మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

సోమవారం MONDAY 9.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 95 ‖ వెల (Price) రూ.6.50 | షష్ఠి

సోమవారం, సూర్యోదయం: 6-03, సూర్యాస్తమయం: 6-23. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: షష్ఠి రాత్రి 9-53 వరకు. నక్షత్రం: విశాఖ సాయంత్రం 6-05 వరకు. వర్జ్యం: రాత్రి 10-25 నుంచి రాత్రి 12-09 వరకు. రాహుకాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-08 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-37 నుంచి పగలు 1-26 వరకు, పగలు 3-05 నుంచి పగలు 3-54. అమృతకాలం: ఉదయం 8-19 నుంచి ఉదయం 10-06 వరకు.



ధిక్కార దివిటీ

కాళోజీ

నేడు అక్షర తపస్వి జయంతి

తెలంగాణ ఉద్యమంలో కాళోజీ స్ఫూర్తి: కేసీఆర్ › 7

కనికరం లేని హైడ్రా కూల్చివేతలు పేదల కుటుంబాలను ఛిన్నాభిన్నం చేశాయి. సున్నం చెరువు సమీపంలో కూలిన తన ఇంటిని చూసి తలబాదుకుంటూ గుండెలవిసేలా రోదిస్తున్న మహిళ



• గూడు చెదిరి.. నీడ కరువై..



మాదాపూర్‌లోని సున్నం చెరువు సమీపంలోని ఇండ్లను ఆదివారం హైడ్రా, రెవెన్యూ అధికారులు కూల్చివేయడంతో గూడుకోల్పోయి నిలువ నీడలేక వర్షంలో తడుస్తున్న మహిళలు

• గుడిసె కూలి.. గోడు మిగిలి..



హైడ్రా అధికారులు ఆదివారం సున్నం చెరువు వద్ద గుడిసెలను కూల్చివేయడంతో ఇంట్లోని సామాన్లను బయటకు తీసుకొస్తున్న బాధిత కుటుంబం

సామాన్యులే సమిధలు

కూల్చివేత.. గుండెకోత

తెల్లారకముందే బస్తీలపై బుల్డోజర్లతో హైడ్రా దాడి

- పండుగపూట పేదల ఇండ్ల కూల్చివేత
- సర్కారుపై దుమ్మెత్తి పోసిన బాధితులు
- చంటి పిల్లలతో వర్షంలోనే కుటుంబాలు
- కండ్ల ముందే గూడు చెదిరిన పేదలు
- కిరోసిన్‌తో పలువురి ఆత్మహత్యాయత్నం
- కనికరం లేని కాంగ్రెస్ సర్కారు: కేటీఆర్

గంటల వ్యవధిలోనే రోడ్డుపాలైన బతుకులు

హైదరాబాద్ సిటీబ్యూరో/మాదాపూర్/అమీన్‌పూర్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): వినాయకుడి పూజ చేసుకుని హాయిగా ని ద్రించిన ఆ కుటుంబాలకు మరికొన్ని గంటల్లోనే హైడ్రా రూపంలో గండం వచ్చి పడింది. ప్రజాపాలనలో సామాన్యుడి గూడుపై సర్కారు దాడి మొదలైంది. తెల్లవారుజామునే నిద్రలేవకముందే ఇండ్లపై బుల్డోజర్లతో దాడులు చేయిస్తూ ప్రభుత్వం హైడ్రామాలు చేస్తోంది. ప్రభుత్వం, హైడ్రాపై బాధితులు తిరగబడుతూ ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం జరుగుతున్న వాటిపైనే › 2వ పేజీలో



చావే శరణ్యం

ఆదివారం తెల్లవారుజామున హైడ్రా అధికారులు తమ ఇండ్లను కూల్చివేయడంతో తమకు చావే శరణ్యమంటూ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన బాధితులు



కేసీఆర్ తెలంగాణ తెస్తే.. నువ్వు కూలుస్తున్నవ్

కేసీఆర్ 28 రోజులో, 30 రోజులో నిరాహార దీక్ష చేసి తెలంగాణ తెస్తే.. నువ్వేం చేశావయ్యా? మాలాంటోళ్ల ఇండ్లు, కడుపులు కొట్టడానికి వచ్చావ్. ఏదైనా మంచిపని చేసి శభాష్ అనిపించుకోవాలి. అంతేకానీ, ఇలా పేదల ఇండ్లపై పడతావా? మేం డబ్బులు ఖర్చుపెట్టుకుని కోర్టుకు వెళ్లాం. కోర్టులు ఎందుకున్నాయి? కేసు అక్కడుండగానే ఇక్కడికొచ్చి ఎలా కూలుస్తారు? మేమేమీ దొంగతనం చేయలేదు. కష్టపడి లోన్లు తెచ్చుకుని ఇండ్లు కట్టుకున్నాం. -బాధితురాలు



జయభేరికేమో నోటీసులు పేదలపైకి బుల్డోజర్లు!

- ఎఫ్‌టీఎల్ నిర్మాణాల కూల్చివేతల్లో హైడ్రామా
- 14 విల్లాలకు నోటీసులు.. పేదలపై బుల్డోజర్లు
- నిర్మాణాల కూల్చివేతల్లో హైడ్రా ద్వంద్వ వైఖరి
- నోటీసుల్లేకుండా కొందరికి.. ఇచ్చి మరికొందరికి
- కూల్చివేతల్లో వివక్ష.. ప్రజల నుంచి విమర్శల వెల్లువ

› 2

'హైడ్రా' ఎఫెక్ట్.. తగ్గిన రిజిస్ట్రేషన్లు

- ఇండ్లు, ఫ్లాట్ల కొనుగోళ్లకు బఫర్ జోన్ టెన్షన్
- రాష్ట్రంలో గత నెల 32% తగ్గిన రిజిస్ట్రేషన్లు
- జూలైతో పోల్చితే 412 కోట్లు తగ్గిన ఆదాయం

రేవంత్ పాలన యమపాశం

9 నెలల్లో 470 మంది రైతుల ఆత్మహత్య



- రైతు రుణమాఫీ ఎగవేసేందుకు 31 సాకులు
- రేషన్‌కార్డు లింకు లేదని అసెంబ్లీలో చెప్పారు
- సురేందర్‌రెడ్డి ఆత్మహత్యతో లింక్ నిరూపితం
- ఆంక్షలతో కుటుంబ బంధాల్లో చిచ్చు పెట్టారు
- అవివాహితులకు రుణమాఫీ చేయడం లేదు
- పెండ్లే కానివారు భార్య ఆధార్‌కార్డు ఇవ్వాలట!
- రుణమాఫీ కాకపాయె.. రైతుబంధు రాకపాయె
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం

మాఫీ చేయనప్పుడు పదవులెందుకు?

చేతిగుర్తుకు ఓటేసినందుకు కోతలే మిగిలాయి. వ్యవసాయ రంగంలో కొత్త కొత్త పదవులు ఏర్పాటు చేస్తున్నారు. రైతు కమిషన్ పెట్టారు. రుణమాఫీ చేయనప్పుడు పదవులెందుకు? రైతుల ఆత్మహత్యలు పెంచడానికా ఈ పదవులు? రేవంత్‌రెడ్డి పాలనలో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లింది. రైతులు ఆత్మహత్య చేసుకోవద్దు. వారి కోసం బీఆర్ఎస్ ప్రాణాలకు తెగించి పోరాడుతుంది. -హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి పాలన రైతుల పాలిట యమపాశంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తొమ్మిది నెలల్లో 470 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కంజూస్ సర్కార్‌గా మారిందని, రైతు రుణమాఫీని ఎగ్గొట్టడానికి 31 సాకులు చూపుతున్నదని దుయ్యబట్టారు. రుణమాఫీకి రేషన్‌కార్డుతో లింకుపెట్టబోమని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, అయితే రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్యతో రేషన్‌కార్డు లింకు ఉన్నట్టు నిరూపితమైందని పేర్కొన్నారు. అవివాహితులకు రుణమాఫీ కావడం › 3వ పేజీలో



రైతు మరణంపైనా రాజకీయమే

- సురేందర్‌రెడ్డికి మాఫీ కాకపోయినా అయినట్టు ప్రచారం
- ఆయన తల్లి సుశీలకు 1.5 లక్షలు మాఫీ అయిందంటూ జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ లేఖ
- సుశీలకు రుణమాఫీ కాలేదని పేర్కొన్న బ్యాంకు అధికారులు
- నిజమేనని ధ్రువీకరించిన జిల్లా వ్యవసాయ అధికారి

హైదరాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాలేదన్నది నిజం. ఆ బాధతోనే రైతు ప్రాణం కోల్పోయాడన్నది నిజం. కానీ, రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్న రైతు సురేందర్‌రెడ్డి మరణంపై కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తున్నది. పచ్చి అబద్ధాలను వల్లె వేస్తున్నది. ఆ రైతు కుటుంబానికి పైసా రుణమాఫీ కాకపోయినా, రూ.1.5 లక్షలు మాఫీ అయిందని ఆ పార్టీ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అబద్ధాలాడుతున్నారు. అంతేకాదు, › 3వ పేజీలో

'కాళోజీ' ముంగిట పోలీస్ జులుం

- హన్మకొండ కాళోజీ కళాక్షేత్రం సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలతో పోలీసుల దురుసు ప్రవర్తన
- వినయ్‌భాస్కర్‌తో సుబేదారి పోలీసుల వాగ్వాదం
- ఆడిటోరియం నుంచి వెంటనే వెళ్లిపోవాలని ఒత్తిడి
- నిర్మించింది కేసీఆర్.. ప్రచారం కాంగ్రెస్‌ది: దాస్యం
- ముఖ్యమంత్రి నేటి వరంగల్ పర్యటన వాయిదా



వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రానికి ఎలా వస్తారని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో వాదనకు దిగిన సుబేదారి సీఐ పీ శ్రీనివాస్‌రెడ్డి


వరంగల్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.85 కోట్లతో రాష్ట్రంలోనే అతి పెద్ద సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దిన కాళోజీ కళాక్షేత్రంలోకి బీఆర్ఎస్ నేతలను అనుమతించకుండా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సోమవారం (సెప్టెంబర్ 9) కాళోజీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లోని కాళోజీ కళా క్షేత్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. తుది మెరుగులు దిద్దే పనులు పూర్తి కాకపోవడం, వానల కారణంగా సీఎం పర్యటన రద్దయ్యింది. కాళోజీ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళోజీ కళా క్షేత్రాన్ని చూసేందుకు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే వీ సతీశ్‌కుమార్, ఇతర బీఆర్ఎస్ నాయకులు అక్కడికి వెళ్లారు. భవన నిర్మాణం, పనులను › 3వ పేజీలో



హైదరాబాద్ సీపీగా సీవీ ఆనంద్

- ఏసీబీ ఏడీజీగా విజయ్‌కుమార్
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కొత్తకోట
- సీనియర్ ఐపీఎస్‌ల బదిలీ

› 5



ఎమ్మెల్యేల అనర్హతపై నేడు హైకోర్టు తీర్పు

గత నెలలోనే ముగిసిన వాదనలు › 5

వచ్చే 48 గంటల్లో భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో వాయుగుండం
- పలు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ › 5

పదేండ్లు.. అభివృద్ధి పరుగులు

కేసీఆర్ హయాంలో తెలంగాణ ప్రగతిని ఒప్పుకున్న రేవంత్ సర్కార్



- బీఆర్ఎస్ హయాంలో జీఎస్డీపీ సగటున ఏటా 12.5% వృద్ధి
- భారత ఐటీ రంగానికి కేంద్రంగా మారిన తెలంగాణ రాష్ట్రం
- గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం, పంటల ఉత్పత్తి
- ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో 'తెలంగాణ గ్రోత్ స్టోరీ' నివేదిక వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): గత పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందంటూ దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ సర్కారు ఎట్టకేలకు నిజాన్ని ఒప్పుకున్నది. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిందని స్వయంగా ప్రకటించింది. అంతేకాకుండా ఈ అభివృద్ధి ఏ ఒక్క రంగానికో పరిమితం కాలేదని, ప్రాథమిక, ద్వితీయ, తృతీయ (సేవా) రంగాల్లో సమాన వృద్ధి సాధిస్తూ పదేండ్లలో తెలంగాణ సమతుల వృద్ధిని సాధించిందని అంతర్జాతీయ వేదికపై › 5వ పేజీలో

గాలి స్వచ్ఛతలో నల్లగొండకు కేంద్ర అవార్డు

పెద్ద నగరాల్లో సూరత్‌కు ప్రథమ స్థానం › 8



సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి ఠాణాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడి బర్త్‌డే వేడుకలు నిర్వహించి కేక్ కట్‌చేసి తినిపిస్తున్న ఎస్సై

ఠాణాలో కాంగ్రెస్ నాయకుడి బర్త్‌డే వేడుకలు

› 9

- ఎస్సై సమక్షంలో కేక్‌కట్ చేసి పోలీసుల సంబురాలు
- పోలీస్ స్టేషన్ పార్టీ ఆఫీసుగా మారిందని విమర్శలు

సాహితీవేత్త నలిమెలకు కాళోజీ పురస్కారం



నేడు రవీంద్రభారతిలో ప్రదానం › 7

'హైడ్రా' ఎఫెక్ట్.. తగ్గిన రిజిస్ట్రేషన్లు

- బుల్డోజర్ల భయంతో తగ్గిన ఇండ్లు, ఫ్లాట్ల కొనుగోళ్లు
- రాష్ట్రంలో గత నెల 32 శాతం పడిపోయిన రిజిస్ట్రేషన్లు
- జూలైతో పోల్చితే రూ.412 కోట్లు తగ్గిన ఆదాయం
- రాజధాని ప్రాంతం నుంచే రూ.330 కోట్లు తగ్గుదల
- వణికిపోతున్న రియల్టర్లు

నెల	రిజిస్ట్రేషన్ల సంఖ్య	ఆదాయం (రూ.కోట్లలో)
జూలై	1,33,408	1318.81
ఆగస్టు	89,585	906.57
తగ్గుదల	43,823	412.24

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'హైడ్రా' ప్రభావం రాష్ట్ర ఖజానాపైనా పడింది. బుల్డోజర్లు, కూల్చివేతల భయానికి ఇండ్ల కొనుగోళ్లు తగ్గిపోవడంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతున్నది. రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిపోయి.. ఆదాయం పడిపోయింది. జూలైతో పోల్చితే ఆగస్టులో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఆదాయం రూ.412 కోట్లు తగ్గింది. ఇక రాష్ట్రానికి గుండెకాయలాంటి రాజధాని ప్రాంతంలో భూములు, ఇండ్ల కొనుగోళ్లు దారుణంగా పడిపోయాయి. హైదరాబాద్‌తోపాటు శివారు జిల్లాల్లో కలిపి ఏకంగా 330 కోట్ల రాబడి తగ్గింది. అంటే రాష్ట్రవ్యాప్త నష్టంలో 80 శాతం ఇక్కడే నమోదైంది. దీంతో రియల్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

31 శాతం పడిపోయిన ఆదాయం

జూలై నెలలో రాష్ట్రవ్యాప్తంగా 1,33,408 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి. దీంతో ఖజానాకు రూ.1318.81 కోట్ల ఆదాయం వచ్చింది. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా నుంచి రూ.509 కోట్ల రాబడి నమోదైంది. కానీ ఆగస్టు నెలలో రిజిస్ట్రేషన్ల సంఖ్య, రాబడి గణనీయంగా పడిపోయింది. గత నెలలో కేవలం 89,585 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా, రూ.906.57 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. 43,823 రిజిస్ట్రేషన్లు తగ్గాయి. జూలైతో పోల్చితే 32 శాతం పడిపోయాయి. ఆదాయం రూ.412.24 కోట్లు అంటే.. జూలైతో పోల్చితే 31 శాతం తగ్గిపోయినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

'గ్రేటర్'లో స్పష్టంగా హైడ్రా భయం

రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి రాష్ట్రంలో 12 'రెవెన్యూ' జిల్లాలు ఉన్నాయి. ఇందులో హైదరాబాద్, బంజారాహిల్స్, రంగారెడ్డి, మేడ్చల్, పటాన్‌చెరును 'గ్రేటర్' జిల్లాలుగా పేర్కొంటారు. హైదరాబాద్‌లోపాటు శివారు జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. ఈ జిల్లాలే రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రధాన ఆదాయ వనరు. ఈ జిల్లాల నుంచే 80 శాతం ఆదాయం వస్తుంటుంది. హైడ్రా ధాటికి ఈ గ్రేటర్ రెవెన్యూ జిల్లాలు విలవిలలాడుతున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఐదు జిల్లాల్లో కలిపి జూలైలో 65,668 రిజిస్ట్రేషన్లు నమోదు కాగా.. రూ.1102 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే.. రాష్ట్రం ఆదాయంలో 83 శాతం ఈ ఐదు జిల్లాల్లోనే వచ్చింది. అయితే.. ఆగస్టు నాటికి ఈ జిల్లాల్లో రిజిస్ట్రేషన్లు, ఆదాయం గణనీయంగా పడిపోయాయి. గత నెలలో ఐదు జిల్లాల్లో కలిపి 45,943 రిజిస్ట్రేషన్లు కాగా, ఆదాయం రూ.772 కోట్లే వచ్చినట్టు గణాంకాలు చెప్తున్నాయి. అంటే.. రిజిస్ట్రేషన్ల సంఖ్య దాదాపు 20 వేలు పడిపోగా.. రూ.330 కోట్ల రాబడి తగ్గింది. హైడ్రా కారణంగానే ఈ తగ్గుదల నమోదైనట్టు రియల్టర్లు చెప్తున్నారు. ఏ ప్లాట్ కొనాలన్నా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా? బఫర్ జోన్ కిందికి వస్తుందా? అంటూ ఒకటికి వంద సార్లు పరిశీలిస్తున్నారని తెలిసింది.

కాంప్రమైజ్ అయ్యారా? భయపడ్డారా?

- ఒవైసీ కాలేజీ కూల్చేందుకు బుల్డోజర్లు దొరుకుతలేదా?
- రేవంత్‌పై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఫాతిమా ఒవైసీ కాలేజీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎంఐఎంతో కాంప్రమైజ్ అయ్యారా? లేక అక్బరుద్దీన్ ఒవైసీ వార్నింగ్ ఇస్తే భయపడ్డారా? అని బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్నది హైడ్రా కార్యక్రమాలు కాదని, హైడ్రామా నడుస్తున్నదని ప్రజలే అంటున్నారని ఆదివారం విడుదల చేసిన ఓ వీడియోలో విమర్శించారు. హైడ్రా ఆధ్వర్యంలో పేదల ఇండ్లు కూల్చడానికి పెద్ద పెద్ద జేసీబీలు, మిషన్లు దొరుకుతున్నాయి కానీ, ఫాతిమా ఒవైసీ కాలేజీని కూల్చడానికి ఎందుకు దొరకట్లేదని ప్రశ్నించారు. పేదల ఇండ్లను వెంటవెంటనే కూలగొడ్తున్నారని, ఫాతిమా ఒవైసీ కాలేజీని ఎప్పుడు కూలుస్తారో చెప్పాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను డిమాండ్ చేశారు.



కొత్తకుంటలోకి చేరిన వరద నీటితో జలకళ



కుంటలోకి చేరుతున్న వరదనీరు

రియల్టర్ చెరలో మరో చెరువు

- ఎనిమిదెకరాల కొత్తకుంట మూడెకరాలకే పరిమితం
- 'నమస్తే' కథనంతో ముందుగానే రియల్టర్ అప్రమత్తం
- చెరువులోకి నీళ్లు వచ్చేలా కాల్వ తవ్వి వరద మళ్లింపు
- సూరం చెరువును పరిశీలించిన నీటిపారుదలశాఖ ఇంజినీర్లు
- పక్కనే ఉన్న కొత్త కుంటను విస్మరించిన అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ)/మహేశ్వరం: శ్రీశైలం జాతీయ రహదారి పక్కనే ఉన్న రియల్ వెంచర్ ఒకటి కాదు... రెండు చెరువుల గొంతు నులిమింది. శంషాబాద్ విమానాశ్రయం మొదలు పహాడీషరీఫ్ వంటి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చే వరదను ఒడిసిపట్టే కొత్తకుంట నోట్లో సైతం మట్టి కొట్టి వెంచర్‌లో కలుపుకొన్నారు. సామాన్య రైతు మొదలు అన్ని శాఖల అధికారులకు ఈ కబ్జాపర్వం తెలిసినప్పటికీ ఎవరికి వారు ఫిర్యాదులు వచ్చాయి, కేసులు నమోదు చేశాం అంటున్నారేగానీ కొత్తకుంటను మాత్రం కబ్జా చెర నుంచి విడిపించలేదు. మరి, చెరువులను పరిరక్షిస్తామంటూ కబ్జాలపర్వాన్ని కొనసాగిస్తున్న హైడ్రా వర్టెక్స్ గిగా సిటీతో నలిగిపోయిన కొత్తకుంటతో పాటు సూరం చెరువుకు విముక్తి కల్పిస్తారా? లేదా? అని మహేశ్వరం రైతాంగం ఎదురు చూస్తున్నది. అందుకే 'హైడ్రా.. ఇటు చూడు!' అంటూ ఆహ్వానిస్తున్నది. ఈ రియల్ వెంచర్ వర్టెక్స్-కేఎల్ఆర్ గిగా సిటీగా రూపుదిద్దుకోగా, చెరువుల కబ్జాకు సంబంధించిన వెంచర్ విస్తరణతో తనకు సంబంధంలేదని మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చెబుతుండడం గమనార్హం.

గొలుసుకట్టు చెరువుకు శాపంగా రియల్ వెంచర్

రంగారెడ్డి జిల్లాలోని మంఖాల్ గ్రామ పరిధిలోని గొలుసుకట్టు చెరువులకు రియల్ వెంచర్ ఒక శాపంలా తయారైంది. శ్రీశైలం జాతీయ రహదారిని అనుసరించి ఉన్న ఈ వెంచర్ ఏకంగా రెండు నీటి వనరులను కబ్జా చేసినా పట్టించుకునే దిక్కు లేదు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద వివిధ మార్గాల్లో కొత్తకుంటకు చేరుతుంది. మంఖాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 776లో దాదాపు పదెకరాల వరకు విస్తరించి ఉన్న ఈ కుంటకు వరద వచ్చేందుకు ఐదారు మార్గాలున్నట్టు అక్కడి రైతులు చెబుతున్నారు. ఈ కుంట మత్తడి దుంకడంతో వరద దిగువన ఉన్న సూరం చెరువుకు చేరుకుంటుంది. సూరం చెరువు 60.32 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అయితే ఈ వెంచర్‌లో సూరం చెరువును సగం వరకు కబ్జా చేసినట్టుగా ఇప్పటికే 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ప్రచురించింది. ఇది చదివి అక్కడి రైతాంగం స్పందించింది. సూరం చెరువు మాత్రమే కాదు... దాని ఎగువన ఉన్న కొత్త కుంటను సైతం వందలకొద్దీ టిప్పర్ల మట్టితో పూడ్చివేసి, వెంచర్‌లో కలుపుకున్నట్టు 'నమస్తే తెలంగాణ'కు వివరాలు అందించారు.

ప్రశ్నార్థకంగా ఆ ప్రాంత భవితవ్యం

దశాబ్దాలుగా హైదరాబాద్ మహా నగరంలోని చెరువులు కబ్జాకు గురవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు గోదారులై, కాలనీలు జలదిగ్బంధనంలోకి వెళ్తున్న దృశ్యాలు చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో కనీసం నిర్మాణాలు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోనైనా నీటి వనరులను కాపాడుకోవడంలో అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. మంఖాల్ గ్రామ పరిధిలోని రియల్ వెంచర్ ఆక్రమించిన రెండు నీటి వనరులకు పెద్ద ఎత్తున ఎగువ నుంచి వరద వస్తుంది. రెండింటినీ ఆక్రమించి వెంచర్‌లో కలుపుకొని భవిష్యత్తులో అక్కడ నిర్మాణాలు వస్తే, వచ్చే వరద ఎటు పోతుందనేది ఆందోళన కలిగించే అంశం. హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో స్పష్టంగా ఉన్న కొత్తకుంట పదెకరాల్లో ఉంటుందని రైతులు, మున్సిపల్ శాఖ చెబుతుండగా, ఎనిమిది ఎకరాల వరకు ఉంటుందని నీటిపారుదలశాఖ ఇంజినీర్లు చెబుతున్నారు. ఎంత విస్తీర్ణంలో ఉన్నప్పటికీ కుంట మొత్తాన్ని భారీఎత్తున మట్టితో పూడ్చివేశారు. కుంటకు వరద వచ్చే అన్ని మార్గాలను మూసి కేవలం ఒక మార్గంలో కాంక్రీట్‌తో డ్రెయిన్ బాక్సులు నిర్మించారు. దాని నుంచి దిగువన ఉన్న సూరం చెరువుకు వచ్చే వరద మార్గంలో సైతం డ్రెయిన్ బాక్సులు నిర్మించారు. అంటే ఎగువ నుంచి ఎంత వరద వచ్చినా కొత్తకుంటలోకి రాకుండా నేరుగా డ్రెయిన్ బాక్సుల ద్వారా దిగువన కబ్జా పోను మిగిలిన సూరం చెరువులోకి వెళుతుందన్నమాట. సూరం చెరువు కబ్జాపై 'నమస్తే తెలంగాణ'లో కథనం రావడంతో అప్రమత్తమైన సదరు రియల్టర్ కొత్తకుంట గుట్టు కూడా రట్టువుతుందని ముందే ఊహించినట్టుంది. అందుకే కథనం వచ్చిన రోజే రెండు జేసీబీలతో ఎగువ నుంచి వచ్చే వరద డ్రెయిన్ బాక్సులోకి వెళ్లకుండా నేరుగా చెరువులోకి వెళ్లేలా కాల్వ తవ్వించినట్టు రైతులు తెలిపారు. దీంతో గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి వచ్చే వరద ఆ కాల్వ ద్వారా కొత్తకుంటలోకి చేరుకుంటున్నది.

హైడ్రా వచ్చేనా? మోక్షం కల్పించేనా?

కొత్తకుంట కబ్జాపై గతంలోనే ఫిర్యాదు చేశామని రైతులు, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చెబుతున్నారు. తాము కూడా ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేయించామని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్రాం తెలిపారు. తాము గతంలోనే కుంటను పరిశీలించి, కేసు నమోదు చేశామని నీటిపారుదలశాఖ ఇంజినీర్లు సైతం సెలవిస్తున్నారు. మరి, అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు అందరూ ఫిర్యాదు చేసి, కేసులు నమోదు చేసినా కొత్తకుంట, సూరం చెరువుకు మోక్షం ఎందుకు కలగడంలేదో అనేది ఎవరికీ అంతుబట్టని విషయం. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగ నిర్లక్ష్యాన్ని చూస్తుంటే మరి కొన్ని రోజులైతే ఎప్పటిలాగే కొత్తకుంటలోని నీరు దిగువకు మళ్లించి మళ్లీ మట్టితో చదును చేస్తారని స్థానిక రైతులు వాపోతున్నారు. అందుకే ఈ కబ్జాను మొగ్గ దశలోనే తుంచేవేసేందుకు హైడ్రా రంగంలోకి దిగుతుందా? లేదా? అని స్థానికంగా చర్చ జరుగుతున్నది. ప్రస్తుతం వెంచర్ రియల్టర్ చేతిలోనే ఉండటంతో హైడ్రా ఇప్పుడు రంగంలోకి దిగితే వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి సామాన్యుడు బలి కాకుండా ఉంటాడని అంటున్నారు.



కనికరం లేని కాంగ్రెస్ సర్కార్

- పేదల గూడును కర్కశంగా కూల్చివేస్తున్నది
- దిక్కుతోచని స్థితిలో నిరాశ్రయులైన నిరుపేదలు
- బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఇండ్లు పేదలకు ఇవ్వండి
- హైదరాబాద్‌లోనే అందుబాటులో 40 వేల 'డబుల్' ఇండ్లు
- 'ఎక్స్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): పేదల పట్ల రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు కనికరమే లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎందరో పేదలు నిర్మించుకున్న ఇండ్లను హైడ్రా పేరుతో అత్యంత కర్కశంగా కూల్చివేస్తున్నదంటూ ఆయన ఎక్స్ వేదికగా ఆదివారం పోస్టు చేశారు. హైడ్రా ఇండ్లు కూల్చిన తర్వాత.. నిరాశ్రయులైన పేదలు జోరు వానలో పట్టాలు అడ్డుపెట్టుకొని కన్నీటిపర్యంతమవుతున్న వీడియోను ఆ పోస్టుకు జత చేశారు. ఆ పోస్టుకు వేలాదిగా వ్యూస్, పాజిటివ్ కామెంట్లతో విశేష స్పందన వస్తున్నది. కనికరం లేకుండా కర్కశంగా నిరుపేదలు నివాసముండే ఇండ్లను ఇవ్వాళ రేవంత్ సర్కార్ కూల్చివేస్తే.. ఆ అభాగ్యులు దిక్కుతోచక ప్లాస్టిక్ కవర్ల నీడలో తలదాచుకుంటున్నారని తెలిపారు. పేరుకేమో ప్రజా ప్రభుత్వం.. కూల్చేదేమో నిరుపేదల ఇండ్లు అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన సుమారు 40,000 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు హైదరాబాద్‌లో పేదలకు కేటాయించేందుకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆ ఇండ్లను వెంటనే నిరుపేదలకు కేటాయించాలని దయతో వేడుకుంటున్నట్టు సీఎస్‌ను కోరారు. మానవీయ దృక్పథంతో పునరావాస విధానంతో ముందుకురావాలని, పౌరులందరికీ చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి ఇండ్లు కేటాయించండి' అంటూ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తన పోస్టును తెలంగాణ సీఎస్‌కు ట్యాగ్ చేశారు.

కూల్చివేత.. గుండెకోత

మొదటిపేజీ తరువాయి...

ముందుగా చర్యలు తీసుకుంటామని హైడ్రా చెబుతూనే ఇండ్లలో నివాసముంటున్న వారిపై విరుచుపడుతున్నది. కూల్చివేతల్లో హైడ్రా ప్రదర్శిస్తున్న ద్వంద్వ నీతిపై నగర ప్రజలు మండిపడుతున్నారు. ఆదివారం ఉదయం మాదాపూర్‌లోని సున్నం చెరువు పరిసరాలలో ఉద్రిక్తతల నడుమ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మల్లంపేట్‌లోని కత్వ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో లక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ సంస్థ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన 13 విల్లాలను కూల్చేశారు. భారీ పోలీసుల బందోబస్తు నడుమ మాదాపూర్, దుండిగల్‌లోని సున్నం చెరువు, కత్వ ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న డ్రైవ్ ఇన్, రెండు బహుళ అంతస్తుల నిర్మాణాలతో పాటు పొట్టకూటి కోసం వచ్చిన సామాన్యుల షెడ్‌లను కూడా హైడ్రా కూల్చేసింది. ఓ వైపు వర్షం, మరో వైపు ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే హైడ్రా అధికారులు కూల్చివేతలు చేశారు. పండగ పూట వర్షంలో పిల్లలను తీసుకొని ఎటుపోవాలో దిక్కుతోచక బాధితులు బిక్కు బిక్కుమంటూ కన్నీరుమున్నీరయ్యారు. 'కేసీఆర్ నిరాహార దీక్ష చేసి తెలంగాణ తెచ్చారు.. నువ్వేం చేశావు.. మా బతుకులు కొట్టడానికే నువ్వొచ్చావా బాబు..' అంటూ ఓ మహిళ సీఎం రేవంత్‌ను ఉద్దేశిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. మరో మహిళ కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేస్తూ రేవంత్‌సర్కార్‌పై దుమ్మెత్తి పోశారు. రూపాయి రూపాయి కూడబెట్టి స్థలం కొనుగోలు చేసి నిర్మాణాలు చేశామని, తమను ఆకస్మాత్తుగా రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'మాకు చావే శరణ్యం' అని ఆత్మహత్యాయత్నాలకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. మా పేదల ఇండ్లు కూలగొడితే రేవంత్ నాశనాన్ని కోరుకున్నట్టేనని బాధితులు శాపనార్థాలు పెట్టారు. మరికొంతమంది మాత్రం ప్రభుత్వ నిబంధనలు పేదలకేనా ? సంపన్నులకు వర్తించవా? అని అధికారులను ప్రశ్నించారు. హైడ్రా ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ స్థానిక ప్రజలు ఆందోళనకు చేస్తుండడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. దుండిగల్‌లో ఇండ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి కూల్చేసేందుకు హైడ్రా ప్రయత్నించగా బాధితులు తిరగబడ్డారు. దీంతో మరో 14 మందికి వారం రోజులు గడువు ఇచ్చారు. అలాగే సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్‌పరిధిలో ఆదివారం హైడ్రా ఆధ్వర్యంలో అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. ఆదివారం హైడ్రా నేతృత్వంలో తహసీల్దార్ రాధా, ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో కూల్చివేతలు చేశారు. పెద్ద చెరువు ప్రాంతంలో సర్వేనెంబర్ 323, 324, 329 గల స్థలంలో ఆంధ్రప్రదేశ్ వైసీపీకి చెందిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి చెందిన స్థలాలలో నిర్మించిన ప్రహరీ, షెడ్లు, రూములను నేలమట్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఇరిగేషన్ డీఈ రామస్వామి సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



మాదాపూర్ సున్నంచెరువు వద్ద హైడ్రా కూల్చివేసిన పేదలు నివాసమున్న గుడిసెలు

సంపన్నులకు వర్తించని నిబంధనలు ...

మాదాపూర్ సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలున్నాయని గుర్తించిన హైడ్రా ఆదివారం భారీ యంత్ర పరికరాలతో సున్నం చెరువు వద్దకు చేరుకొని కూల్చేవేతచేపట్టారు. పొట్టకూటి కొరకు ఒడిశా నుంచి వచ్చిన కూలీలు సున్నం చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో రేకుల షెడ్‌లను నిర్మించుకున్నారు. ఉదయం 5 గంటలకు వచ్చిన హైడ్రా అధికారులు షెడ్లను ఖాళీ చేయమని చెప్పి గంట వ్యవధిలోనే ఆయా షెడ్లను కూల్చివేయడం ప్రారంభించారు. దీనిపై అక్కడున్న పేదలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ రేవంత్ సర్కారుకు పక్కనున్న ఎఫ్‌టీఎల్ పరిధిలోని సంపన్నుల భవనాలు, విల్లాలు కనిపించడం లేదా? పేదలపై మీ ప్రతాపమా? అంటూ మండిపడ్డారు. భారీ భవనాల్లో, విల్లాల్లో ఉంటున్న వారికి హైడ్రా ముందస్తు నోటీసులిస్తుందని, గుడిసెల్లో ఉంటున్న వారికి గంట సమయం ఇవ్వకుండా కూల్చేస్తున్నారని పేద ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ నిర్మిస్తున్న రెండు భవనాలు, అక్కడ కొనసాగుతున్న ఒక డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, పేదలు ఉంటున్న 30కి పైగా షెడ్లను హైడ్రా కూల్చేసింది. షెడ్లను కూల్చేస్తుండటంతో బాధితులు హైడ్రా అధికారులపై తిరగబడ్డారు. తమకు హైడ్రా తీవ్రంగా అన్యాయం చేస్తుందని నిరసిస్తూ ఒక మహిళ, మరో పురుషుడు కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యయతానికి పాల్పడ్డారు. వారిని పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. దీంతో స్థానికులు ఆందోళనకు సిద్ధం కాగా, భారీఎత్తున అదనపు పోలీసు బలగాలను రప్పించి చెదరొగొట్టారు. దీంతో ఉద్రిక్తతం నెలకొన్నది. మాదాపూర్ సున్నం చెరువు విస్తీర్ణం ఎఫ్‌టీఎల్‌తో కలిసి 29.75 ఎకరాలు, నీటిని విస్తరించి ఉన్న ప్రాంతం 15.20 ఎకరాల విస్తీరణంలో ఉంది. మిగతాది ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుంది.

పిల్లలతో ఎక్కడికెళ్లాలి ?



సున్నం చెరువు వద్ద రేకుల షెడ్‌ను ఏర్పాటు చేసుకొని పదేండ్లుగా ఉంటున్నాం. మా ఇంట్లో చిన్న పిల్లలు కూడా ఉన్నారు. పిల్లలున్నారు అన్న కనికరం లేకుండా షెడ్‌ను నేటమట్టం చేశారు. పొట్టకూటి కోసం ఒడిశా నుంచి వచ్చి కూలీ పని చేసుకుంటున్నాం. ఉన్నట్టుండి షెడ్‌ను కూల్చితే పిల్లలను తీసుకొని వర్షంలో ఎక్కడ తలదాచుకోవాలి. మాలాంటి వారికొరకు ప్రభుత్వం ఏదైనా సమకూర్చే ఆలోచన చేసిందా? నేను ఎక్కడికి వెళ్లేది. ఏమి చేసేది ? - పద్మ, కూలీ

మా బతుకులపై కాంగ్రెస్ విషం



సున్నం చెరువు వద్ద రేకుల షెడ్డు వేసుకొని పదేండ్లుగా ఉంటున్నాం. ఇన్ని సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 9 నెలలు కాలేదు కానీ పేదల బ్రతుకులపై విషం చిమ్ముతున్నారు. పక్కనే ఉన్న విల్లాల వారికి మాత్రం నోటీసులు ఇచ్చారు. 10 రోజులు పూర్తైన ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మాకు మాత్రం షెడ్‌లను అన్యాయంగా కూల్చివేశారు. - బాబుల్, కూలీ



సున్నంచెరువు వద్ద గుడిసె కూల్చివేతతో ఆందోళనతో కిరోసిన్ పోసుకున్న ఓ అర్చకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



కూల్చివేతల తర్వాత ఓ ఇంటి శిథిలాల మధ్య పడి ఉన్న అన్నం గిన్నె

జయభేరికి నోటీసులు..
పేదలపైకి బుల్డోజర్లు!

- కూల్చివేతల్లో హైడ్రా ద్వంద్వ వైఖరి
- నోటీసుల్లేకుండా కొందరికి.. ఇచ్చి మరికొందరికి
- పేదల గుడిసెలు కూల్చిన అధికారులు
- బడాబాబులకు నోటీసులతోనే సరి
- నిర్మాణాలను మేమే తొలగించుకుంటాం: జయభేరి అధినేత మురళీమోహన్

పేదలకో నీతి.. పెద్దలకు మరోనీతి.. ఇదే ఇప్పుడు హైడ్రా పాటిస్తున్న ద్వంద్వనీతి. ఉన్నపళంగా సామాన్యుల నివాసాలపై బుల్డోజర్ ఎక్కిస్తున్న అధికారులు.. పెద్దల విషయంలో మాత్రం 'గడువు' నాటకం ఆడుతున్నారు. కనీసం సామాను సర్దుకునే సమయం కూడా ఇవ్వని ఆ అధికార గణం.. బడాబాబుల విషయంలో మాత్రం నోటీసులకే పరిమితమవుతున్నది. లక్షలాది రూపాయల డబ్బు పెట్టి కొనుక్కున్న ఎందరో మధ్య తరగతి వారిండ్లను నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేస్తున్నారు. కట్టుబట్టలతోనే వారిని బయటకు నెట్టేస్తున్నారు. పాలకపక్ష నేతలకు అనుకూలంగా ఉండేవారి పట్ల మాత్రం హైడ్రా సాచివేత వైఖరిని ప్రదర్శిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హైదరాబాద్ సిటీబ్యూరో/శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా చర్యల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ విమర్శల పాలవుతున్నది. మొదటి నుంచి కూల్చివేతల్లో ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నది. ఎఫ్టీఎల్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపులో 'హైడ్రా'మా కొనసాగుతున్నది. ఆదివారం మాదాపూర్ సున్నం చెరువులో జరిపిన కూల్చివేతల్లో ముందస్తు నోటీసులు లేకుండా ఉన్నపళంగా సామాన్యులు, మధ్య తరగతి వారు ఉండే నివాసాలపై బుల్డోజర్ దింపి రోడ్డుపాలు చేశారు. మరోవైపు టీడీపీ మాజీ ఎంపీ, జయభేరి సంస్థ నిర్వాహకులు మురళీ మోహన్ విషయంలో మాత్రం హైడ్రా అడగకుండానే గడువు ఇచ్చింది. అంతేగాకుండా ఎన్ కన్వెన్షన్ తరహాలోనే మురళీమోహన్‌కు సంబంధించిన ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎఫ్టీఎల్‌లో అపార్ట్‌మెంట్లు, షెడ్లు, ఇతర వ్యాపార సముదాయాలను నోటీసులు లేకుండా కూల్చేస్తున్న హైడ్రా.. ఎఫ్టీఎల్‌ను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను తొలగించాలంటూ మురళీమోహన్‌కు మాటమాత్రంగా చెప్పి వెళ్లిపోయారు. సున్నం చెరువు ఎఫ్టీఎల్‌లో ఆక్రమణలు ఉన్నాయంటూ నోటీసులు లేకుండా ఆదివారం పలు ఇండ్లను కూల్చేశారు. అక్కడ నివాసముండే రోజువారి కూలీలు కట్టుబట్టలతో రోడ్డుపైకి వచ్చారు. మల్లంపేటలోని 13 విల్లాలను కూల్చేశారు. తమ నివాసాలను కూల్చేసిన హైడ్రా.. రోడ్డున పడేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాదాపూర్‌లో ఎఫ్టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టారని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా గత నెల 24న హైడ్రా ఎన్' కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చేసింది. దీనిపై దాని నిర్వాహకుడైన నాగార్జున కోర్టును ఆశ్రయించారు.

'ఎఫ్టీఎల్‌లో ఉంది.. మీరే కూల్చుకోండి'

నానక్‌రాంగూడ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లోని సర్వే నెంబర్ 106లోని రంగ్‌లాల్‌కుంట ఎఫ్టీఎల్‌తో కలిపి 5.36 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువును, ఎఫ్టీఎల్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ మట్టితో నింపి ఎఫ్టీఎల్ స్థలాన్ని కబ్జా చేసి జయభేరి సంస్థ రేకులతో ప్రహరీ ఏర్పాటు చేసింది. దానిని కూడా హైడ్రా ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా తొలగించి ఆ కబ్జాకు గురైన ఎఫ్టీఎల్ స్థలాన్ని కుంటలోకి కలుపాల్సి ఉన్నది. కానీ, 15 రోజుల్లో ఆక్రమణలు తొలగించాలని జయభేరి సంస్థకు హైడ్రా అధికారులు నోటీసులు జారీచేశారు. అయితే జయభేరికి నోటీసులు జారీ చేయలేదని హైడ్రా అధికారులు పేర్కొనడం గమనార్హం.

అక్రమ నిర్మాణం కాదు:మురళీమోహన్

తాము ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టి అవకతవకలకు పాల్పడలేదని జయభేరి నిర్వాహకుడు మురళీమోహన్ తెలిపారు. తమకు వచ్చిన నోటీసులపై స్పందించిన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. హైడ్రా తమ షెడ్ల ను తొలగించాల్సిన పనిలేదని, తామే మంగళవారం వాటిని తొలగిస్తామని చెప్పారు.

నాలాలనే మళ్లించారు!

రంగ్‌లాల్‌కుంట చెరువు పూర్తిగా కబ్జాకు గురయింది. ఈ చెరువులోకి వచ్చే వరద నీటిని రాకుండా పలు నిర్మాణాలు వెలిశాయి. నాలాలను మళ్లించి చెరువు పక్కనే బడా సంస్థలు అపార్టుమెంట్లనే నిర్మించాయి. నాలాలను మళ్లించి, నిర్మాణాలు చేపట్టి, చెరువు కబ్జాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారిపై అసలు హైడ్రా చర్యలు తీసుకుంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిరాశ్రయులైన వలస కూలీలు

మాదాపూర్‌లోని సున్నం చెరువు ఎఫ్టీఎల్‌లో ఆక్రమణాలు జరిగాయంటూ హైడ్రా ఆదివారం ఉదయం అక్కడ బుల్డోజర్లతో విరుచుకుపడింది. నివాసాల కూల్చివేతతో కూలీల కుటుంబాలు రోడ్డుపై పడ్డారు. ఆదివారమంతా భోజనంకరువైంది. ఒడిస్సా, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే అక్కడ ఎక్కువగా ఉన్నారు. అయితే అదే జయభేరి కబ్జాలకు 15 రోజుల గడువు ఇచ్చిన హైడ్రా, గుడిసెల్లో నివాసం ఉంటున్న వారిని నిర్దాక్షిణ్యంగా అక్కడి నుంచి ఖాళీ చేయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అమ్మో హైడ్రా !

- ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాల స్వచ్ఛంద తొలిగింపు
- ఫామ్‌హౌస్ ప్రహరీని కూల్చిన మాజీ మంత్రి



హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలను తొలగించుకున్న ప్రముఖులు

మొయినాబాద్, సెప్టెంబర్ 8 : కొందరు ప్రముఖులు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న తమ నిర్మాణాలను సొంతంగా కూల్చివేసుకుంటున్నారు. అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని హిమాయత్‌సాగర్ జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో హైడ్రా వచ్చి కూల్చివేతలు చేపట్టక ముందే ఓ మాజీ మంత్రి తన షెడ్‌ను, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యనేత ఫామ్ హౌస్ ప్రహరీని స్వచ్ఛందంగా తొలగించారు. ఇదే బాటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలున్న వారు స్వచ్ఛంధంగా కూల్చివేసుకుంటారా? లేక హైడ్రానే కూల్చివేస్తుందా అనే చర్చ జరుగుతున్నది.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో స్థలాలు, ఇండ్లు కొనుగోలు చేయొద్దు



నగరవాసులు సొంతింటి కలను సాకారం చేసుకునే క్రమంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రధానంగా అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ఇండ్లు, స్థలాలు కొనుగోలు చేసే ముందు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉందా? లేదా అని నిర్ధారించుకోవాలి. మాదాపూర్‌లోని సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న నాలుగు అంతస్తులు, రెండు అంతస్తులు భవనాలు..30కి పైగా షెడ్‌లను అధికారులు కూల్చివేసి పది ఎకరాల చెరువు భూమిని స్వాధీనం చేసుకున్నాం. దుండిగల్ కొత్వా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న 13 డూప్లెక్స్ విల్లా భవనాలను తొలగించి రెండు ఎకరాల చెరువును స్వాధీనం చేసుకున్నాం. అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని 51 ఎకరాల్లో పద్మావతినగర్‌లో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్ ప్రహరీ, రెండు సెక్యూరిటీ గదులను తొలగించాం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అనుమతి లేనివే కూల్చివేస్తున్నాం. నివాసం ఉంటున్న గృహాలను కూల్చబోం. - ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 9 సెప్టెంబర్ 2024
www.ntnews.com

చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

నాటకం మరో మలుపు తిరగాలి

సాహిత్య ప్రక్రియల్లో నాటకానికి విశిష్ఠ స్థానం ఉన్నది. అందుకే మహాకవి కాళిదాసు 'నాటకాంతం హి సాహిత్యం' అని అన్నారు. అనగా అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ చివరిగా స్పర్శించవలసిన అంకం నాటకం అని అర్థం. బాణ, ప్రకరణ, ప్రహసన, డిమ, వ్యాయోగ, సమవాకార, వీథి, అంక, ఈహామృగ వంటి దశ రూపకాల్లో నాటకం ఉత్తమమైనది. శ్రవణ సహిత దృశ్యరూపకం నాటకం.

కాకతీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరామం కూడా ఒక నాటకమే అని చెప్పవచ్చును. అయితే, కొందరు క్రీడాభిరామంలో నాటక లక్షణాల్లేవు అంటారు. మహా పండితులు చెప్పిన నాటక లక్షణాలు సమస్తం అనుసరిస్తూ నాటకం రాయడం, ప్రదర్శించడంలో తప్పులేదు కానీ, భాస మహాకవి వంటి వారు రాసిన 'ఊరు భంగం, దూత వాక్యం, కర్ణ భారం, దూతఘటోత్కచం, పాంచరాత్రం, అవిమారకం, స్వప్న వాసవదత్తము వంటి రచనల్లో నాటక లక్షణాలు సమస్తం ఉండవు' అని కొందరు పండితులు అంటారు. నాటకంలో పది మందిని ఆకర్షించే సన్నివేశాలు, చక్కని సంభాషణలు, ఆకర్షణీయమైన సంగీతంతో కూడుకున్న పద్యాలు, పాటలు రంగస్థలంపై ఉన్న నటుల నటన పది మందిని ఆకర్షిస్తే అలాంటి నాటకాలన్నీ ప్రజాదరణ పొందుతూనే ఉంటాయి. అప్పుడు పండితులు చెప్పిన నాటక లక్షణాలు లెక్కలోకి రావు. నిజం చెప్పాలంటే పండితుల నాటక లక్షణాలకు ప్రజాదరణ పొందిన నాటక లక్షణాలకు సంబంధం ఉండదు.

నాటక లక్షణాల్లో నాయకుడు ఉత్తముడై ఉండాలంటారు. దుష్యంతుడు, హరిశ్చంద్రుడు వంటి నాయకులు ఉత్తములా? అంటే ఎవరి అభిప్రాయం వారిది. ఎవరు ఉత్తములు? ఎవరు మధ్యములు? ఎవరు అధములు? అనే చర్చోపచర్చలు మహా పండితుల నడుమ సాగుతుంటాయి. ఎక్కువ శాతం, నాటక ప్రజాదరణ, పండితుల చర్చోపచర్చలకు భిన్నంగా ఉంటుంది. ఏదేమైనా ఒకప్పుడు తెలుగు నాటకాలు ప్రజలను విపరీతంగా ఆకర్షించాయి. తెలుగు తొలి నాటకం 1860 ప్రాంతాన కోరాడ రామచంద్రశాస్త్రి రాసిన మంజరీ మధుకరీయం అని నాటక చరిత్రకారులు చెప్తున్నారు. తెలుగులో అభిజ్ఞాన శాకుంతలం, నరకాసుర విజయం, వేణీ సంహారము, గయోపాఖ్యానం, ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం, పాదుకా పట్టాభిషేకం, హరిశ్చంద్ర, పాండవ ఉద్యోగ విజయాలు, బొబ్బిలి యుద్ధం, పల్నాటి యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం, ప్రమీలార్జునీయం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, శ్రీరామాంజనేయ యుద్ధం, లవకుశ, భక్త రామదాసు, భక్త ప్రహ్లాద, సతీ అనసూయ, సతీ సావిత్రి, చింతామణి, వరవిక్రయం, నర్తనశాల, శ్రీమత్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి చరిత్ర, అల్లూరి సీతారామరాజు, ఛత్రపతి శివాజీ, కురుక్షేత్రం, మాభూమి, కీర్తిశేషులు, రంగూన్ రౌడీ, వసంతసేన వంటి తెలుగు నాటకాలు ఒకప్పుడు దేశ విదేశాల్లోని అనేక రంగస్థలాలకు వన్నె తెచ్చాయి. ఒక లెక్క ప్రకారం తెలుగులో పౌరాణిక, చారిత్రక, సాంఘిక, జానపదాది నాటకాలు రమారమి నాలుగు వేలపైనే అన్న మాటల్లో ఆవంత కూడా అతిశయోక్తి లేదు.

ఏదేమైనా ఒకనాటి తెలుగువారి మనసుల్లో కొన్ని పౌరాణిక పాత్రలు మరికొన్ని చారిత్రక సంఘటనలు శాశ్వతంగా నిలిచిపోవడానికి ప్రధాన కారణం తెలుగు నాటకాలు అని చెప్పవచ్చు. రామాయణ భారత భాగవతాదులలో కూడా లేని సంఘటనలు మన తెలుగు పౌరాణిక నాటకాల్లో ఉన్నాయి. ఆ కల్పిత సంఘటనలే నిజమన్న సామర్థ్యాన్ని సంతరించుకున్నాయి. ఒకప్పుడు తెలుగు నాటకాలకు అంత శక్తి ఉంది. శ్రీరామాంజనేయ యుద్ధం, శశిరేఖా పరిణయం, సీత అగ్ని ప్రవేశం, వాల్మీకి ఆశ్రమంలో లవకుశులు, శ్రీరామ శంబూకుల యుద్ధం, కర్ణుని నాయకతేజం వంటి అనేకానేక అంశాలు రామాయణ భారత భాగవతాదులలో వేరే రకంగా ఉంటాయి. భాగవత పురాణంలో హరిశ్చంద్రుడు సత్యహరిశ్చంద్రుడు అన్నట్టు ఉండదు. కానీ,



మన తెలుగు నాటకాలు అనేకానేక పురాణ పాత్రలను మహోన్నత నాయకులుగా తీర్చిదిద్దాయి. ఈ పౌరాణిక చారిత్రక, సాంఘిక నాటకాలే తర్వాత, తర్వాత సినిమాలుగా వచ్చాయి. ఆ సినిమాలు కూడా అధికశాతం విజయవంతం అయ్యాయి. తెలుగునాట ఒకప్పుడు పౌరాణిక నాటకాల కథాంశాలే అసలు రామాయణ భారత భాగవతాదులలోని కథాంశాలు అనుకుంటే, ఆ తర్వాత పౌరాణిక సినిమాలే అసలు రామాయణ భారత భాగవతాదులలో కథాంశాలు అని అధిక శాతం తెలుగువారు అనుకునేవారు. నేడు పౌరాణిక సినిమాల ప్రభావం తగ్గిపోయింది. ఏదేమైనా పౌరాణిక సినిమా నాలెడ్జే పురాణ నాలెడ్జ్ అని పొంగిపోవడం అశాస్త్రీయమవుతుంది.

కొన్ని కొన్ని తెలుగు సాంఘిక సినిమాలలో పౌరాణిక, జానపద, చారిత్రక ఛాయలుంటాయి. ఉదాహరణకు బాసుని స్వప్న వాసవదత్త నాటకంలో వాసవదత్త అవంతిక పేరుతో పద్మావతి దగ్గర ఉంటుంది. ఆమెను పద్మావతీ దేవి దగ్గరికి మంత్రి యౌగం ధరాయణుడు తీసుకువస్తాడు. ఆ సంఘటన ఛాయయే సంప్రదాయం అనే తెలుగు సినిమా మూల కథ అనిపిస్తుంది. ఇలాంటి ఛాయలు మన తెలుగు సినిమాలలో చాలా కనపడతాయి. అలాగే, శ్రీకృష్ణ తులాభారం కథా ఛాయ శుభలగ్నం అనే సాంఘిక సినిమాలో కనపడుతుంది. శమంతకమణి పౌరాణిక వృత్తాంతానికి ఛాయారూపంగా ఎన్టీఆర్ వేటగాడు సినిమా ఉంటుంది. ఇలా పౌరాణికాది కథల ఛాయతో సాంఘిక సినిమాలు రావడం తప్పు కాదు. అయితే, పౌరాణిక పాత్రల ఔచిత్యం దెబ్బతినేటట్టు పౌరాణిక సినిమాలు రావడం మాత్రం మంచిది కాదు. నేడు తెలుగునాట దుష్ట చతుష్టయంలోని ఒకడైన కర్ణుడు కొందరికి నాయకుడిగా కనపడతాడు. నిజానికి వ్యాసభారతం చదివితే ఆ భావన రాదు. పౌరాణిక పాత్రల గుణగణాలను లెక్కగట్టేటప్పుడు యుగధర్మాదులన్నీ గమనించాలి. వ్యాస భగవానుడు ఆ పని చేశాడు. కలియుగ నాటక రచయితలు, సినిమా రచయితలు ఆ పని చేయలేదు.



వాగుమూడి
లక్ష్మీ రాఘవరావు
62814 90160

శాస్త్ర సాంకేతిక విజ్ఞాన పరిజ్ఞానం, పౌరాణిక కథా పరిధులు పెరిగిన ఆధునిక కాలంలో, స్వయంప్రభ, ప్రమద్వర, ఉలూక రాయబారం వంటి పౌరాణిక నాటికలు, బాసర సరస్వతి చరిత్ర, శ్రీ కాళేశ్వర క్షేత్ర మహిమ, ఆర్యభట్ట, వరాహ మిహిర, భాస్కరాచార్య, శ్రీనివాస రామానుజన్, మహా వీరాచార్య, బ్రహ్మగుప్త వంటి నాటికలు అక్కడక్కడ ప్రభుత్వేతర పాఠశాలల్లో విద్యార్థుల చేత ప్రదర్శితమవుతూనే ఉన్నాయి. అయితే, ఒకప్పటి తెలుగు నాటకాల ప్రదర్శనలా ఇప్పుడు తెలుగు నాటక ప్రదర్శనలుండటం లేదన్నది నిజం.

అక్కడక్కడ కొన్ని నాటక పరిషత్తులవారు నాటక పోటీలను ప్రదర్శిస్తూ, వర్తమాన సాంఘిక నాటకాలకే ప్రాధాన్యాన్నిస్తున్నారు. కొత్తగా ఆలోచించలేక పోతున్నారు. నేడు నాటకాలకు ఆదరణ కరువైంది. అయితే, విద్యా ప్రపంచాన ఒకప్పటి కంటే ఇప్పుడు రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ఎక్కువగానే కనపడుతుంది. అయితే ఆయా సాంస్కృతిక ప్రదర్శనలు అధిక శాతం సినిమా పాటలకు, షోకేస్ బొమ్మల్లా విద్యార్థులను తయారు చేయడానికి పరిమితమవ్వడం విచారించవలసిన విషయం. విద్యార్థులతో శాస్త్ర సాంకేతిక, పౌరాణిక విజ్ఞాన తెలుగు నాటికలను ప్రదర్శింపజేయడం వల్ల విద్యార్థులలో తెలుగు భాషా ఉచ్చారణ సామర్థ్యం పెరుగుతుంది. భాషపై పట్టు వస్తుంది. విషయ అవగాహన మీద పట్టు పెరుగుతుంది. బట్టీతత్వం తగ్గి పరిశోధనాతత్వం పెరుగుతుంది. మన భారతీయ శాస్త్ర సాంకేతిక విజ్ఞాన పరిధులను తెలుగు నాటికల ద్వారా పెంచవచ్చును. అలా జరిగిననాడు భారతీయ శాస్త్రసాంకేతిక విజ్ఞానం ప్రయోగశాలల వైపు పయనమవుతుంది. మన తెలుగు నాటక తేజం శాస్త్రీయపథాన వికసిస్తుంది.



నేడు కాళోజీ జయంతి
తెలంగాణ భాషా దినోత్సవం

కాళన్న స్ఫూర్తి

సీ. ఆ నిజాము జమాన యాగడములనెన్నొ
తూర్పారబట్టిన దొడ్డమనిషి
ఎవని వాడుక భాష నేమార్చనీకుండ
గట్లనే నుంచుతు గౌరవించె
తన్లాడె యాసకై, తన్లాడె బాసకై
పలుకుబడుల భాష పరువు పెంచె
తెలగాణ యేర్పాటు తొలిపొద్దు పొడుపుగా
ఉద్యమానికితాను నూతమయ్యె
అన్యాయమెదిరించినట్టి పుణ్యాత్ముడే
ఆరాధ్యుడని జెప్పె ధీరుడయ్యి
ప్రజలపక్షము నుండి ప్రశ్నించు గొంతుకై
ధిక్కార స్వరముతో తేల్చిజెప్పె
ఎవ్వరైన మనభాష నేవగించుకొనిన
తిట్ల దండకముతో తిక్కగూర్చె
నిర్భీ తి,ధైర్యమ్ము ,నిక్కచ్చితత్వమ్ము
కాళోజి రూపమై కానిపించు

తే.గీ. అణచివేత, వివక్షల నడ్డుకొనియు
అక్షరాలకు నావేశమంటగట్టి
నా గొడవ యంచు ప్రకటించె నలుదిశలకు
మాండలికపద తావితో మధువు నింపె!!!



గొల్లపల్లి
రఘురామ శర్మ
9989149454



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్ద కాలం దాటింది. మొన్నటి జూన్ 2 వరకు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు కేవలం తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మారింది. దీంతో తెలంగాణ అస్తిత్వ ప్రదర్శనకు ఆఖరి అవరోధం కూడా తొలగినట్టయింది. అందుకే ఈ సందర్భంలో తెలంగాణ అస్తిత్వాన్ని మరింత బలంగా చాటి చెప్పుకోవాల్సిన అవసరం ఉన్నది.

సురవరం పేరే సముచితం

తెలంగాణ ఘనతను, చరిత్రను, సంస్కృతిని రక్షించుకోవాలి. అందులో భాగంగా హైదరాబాద్‌లో ఉన్నటువంటి తెలుగు విశ్వవిద్యాలయానికి 'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం' అని నామకరణం చేసుకోవాలి. ఎందుకంటే, సురవరం తొలి తెలంగాణవాది. 1934లో 'తెలంగాణలో కవులు పూజ్యం' అని విమర్శ వచ్చినప్పుడు ఇక్కడి కవులు 'పూజ్యం కాదు, పూజనీయులు' అని లెక్కగట్టి 369 మందితో 'గోలకొండ కవుల సంచిక'ను వెలువరించి ఆత్మగౌరవాన్ని ప్రకటించారు. అంతేకాదు, పలు ప్రక్రియల్లో రాసిన సాహితీవేత్తగా, పత్రికా సంపాదకుడిగా, చరిత్రకారుడిగా, పరిష్కర్తగా, హక్కుల ఉద్యమ కార్యకర్తగా, ప్రచురణ సంస్థ నిర్వాహకుడిగా, ఆంధ్రమహాసభ నాయకుడిగా, ఎమ్మెల్యేగా, సాహిత్య సంస్థల నిర్మాతగా, ఆంధ్రవిద్యాలయ లాంటి విద్యాసంస్థల స్థాపకుడిగా, గ్రంథాలయోద్యమ నేతగా, మద్యపాన నిరోధక ప్రచారకుడిగా ఇట్లా బహుముఖాలుగా పనిచేసిన సురవరం ప్రతాపరెడ్డికి సముచిత స్థానం దక్కలేదు. ప్రస్తుతం ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాష, చరిత్ర, సంస్కృతి, కళల అధ్యయనం, అధ్యాపన కోసం 1985లో డిసెంబర్ 2న ఏర్పాటు చేసింన్రు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు భాష, చరిత్ర, సంస్కృతి, కళలు, జర్నలిజం, పరిశోధన రంగాల్లో విశేషమైన కృషి చేసింన్రు. ఇట్లా విశ్వవిద్యాలయం ఏర్పాటు లక్ష్యాలన్నింటిలోనూ ప్రతాపరెడ్డి విశిష్ఠమైన కృషిచేసింన్రు. అందుకే ఈ డిసెంబర్ 2న 40వ ఏడులో ప్రవేశిస్తున్న సందర్భంలో ఆయన పేరు పెట్టే ప్రక్రియను పూర్తిచేసి గౌరవించుకోవాలి. ఇది ప్రతాపరెడ్డికి గౌరవం కాదు, తెలంగాణకు గర్వకారణం.

ఈ విషయమై ఇటీవల అసెంబ్లీలో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని పక్షాలకు సమ్మతమైతే సురవరం పేరును పెట్టడానికి తమకేమి అభ్యంతరం లేదని ప్రకటించారు. ఈయన పేరు పెట్టాలని అసెంబ్లీలో ప్రస్తావన తెచ్చింది సీపీఐ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఆ ప్రతిపాదనకు బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ మద్దతు కూడా పలికారు.

వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ఖ్యాతి దశదిశలా విస్తరించేందుకు సురవరం ఒక మార్గం. రాష్ట్ర విభజన చట్టంలో 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం' షెడ్యూల్ 9లో ఉండటంతో గత పదేండ్లుగా రెండు రాష్ట్రాల్లో అడ్మిషన్లు, పీఠాల నిర్వహణ హైదరాబాద్ నుంచే జరిగింది. అయితే, ఈ సంవత్సరం అడ్మిషన్లు తెలంగాణలో మాత్రమే జరిగేలా నోటిఫికేషన్లు కూడా జారీ చేసింన్రు. కాబట్టి ఈ 'నామకరణ' ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాల్సిన అవసరం ఉన్నది.

ఇప్పటికే రాజమండ్రి, మొవ్వ, శ్రీశైలంలలో ఉన్న పీఠాలు ఆంధ్రాకు వెళ్లిపోవడంతో వాటి స్థానంలో తెలంగాణలో చరిత్ర, సాహిత్యం, కళలు, జర్నలిజం, భాష రక్షణకు ప్రత్యేకంగా ఈ ప్రాంతంలోని వివిధ ప్రదేశాల్లో పీఠాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది. వీటిపై త్వరలో నియామకం అయ్యే వైస్‌చాన్సలర్ దృష్టిసారించాలి.

'సురవరం' పేరును విశ్వవిద్యాలయానికి పెట్టడమే కాకుండా, ఆయన సమగ్ర రచనలు, సంపాదకీయాలు దాదాపు పది, పన్నెండు వేల పేజీల్లో లభ్యంగా ఉన్నాయి. వాటన్నింటిని సంపుటాలుగా ప్రచురించాల్సిన అవసవరం ఉన్నది. అట్లాగే ఆయన పేరిట ప్రత్యేక అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా ఈ సందర్భంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాధినేతలు అసెంబ్లీలో ప్రకటించిన విషయాన్ని గౌరవించి సాధ్యమైనంత త్వరగా తెలుగు విశ్వవిద్యాలయానికి 'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం' అని పేరు పెట్టాలి.



డాక్టర్ సంగిశెట్టి
శ్రీనివాస్

200 ఏండ్ల నాటి తెలంగాణ

చరిత్రలో మన ప్రాంతాన్ని చూసినప్పుడు కలిగే సంబురం మామూలుగా ఉండదు. అప్పట్లోనే ఇంత ఘనమైన చరిత్ర మనదని తెలిసినప్పుడు, మన సంస్కృతి మహోన్నతమైనదన్నప్పుడు కలిగే ఆత్మగౌరవ భావన అనిర్వచనీయం. చరిత్ర అధ్యయనం బలమైన భవిష్యత్తును నిర్మిస్తుంది. మన సమీప గతంలో రెండు వందల ఏండ్ల కిందట ఒక మహనీయుడు మన ప్రాంతాన్ని సందర్శించి తాను పొందిన అనుభవాలను తెలుసుకోవడం, అప్పటి చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక, భాషా విషయాలను పరిశీలించడం నేటి తరానికి అవసరం.



కృష్ణా తీరానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉండే పెంటపల్లిలో తొలి మజిలీ. శంషాబాద్ దాటాక చిన్న, చిన్న చెరువులు చాలా చూశాను. హైదరాబాద్ నగర గోడకు ఆనుకొని 'మూసి' (స్థానికులు 'ముచుకుంద నది'గా పిలుచుకునే) నది పారుతుంది. గతేడాది ఈ నదికి వరదలొచ్చాయి. ఆ వరదల్లో ఢిల్లీ దర్వాజా దగ్గర ఇంగ్లీష్‌వారు కట్టిన వంతెన పగిలిపోయింది. దీంతో బేగంబజార్ సహా కొన్ని వీధులు ముంపునకు గురయ్యాయి.

హైదరాబాద్‌కు, లష్కర్‌కు మధ్య హుస్సేన్‌సాగర్ అనే గొప్ప మంచినీటి చెరువుంది. హుస్సేన్‌సాగర్ కట్ట మీద ఇంగ్లీష్‌వారు గుర్రపు బండ్లు వెళ్లేందుకు అనుకూలంగా రోడ్డు వేసుకొని కట్టను చాలా ముచ్చటగా అలంకరించారు. ఇతర వాహనాలు, మనుషులు ఆ రోడ్డును పాడు చేయకుండా రోడ్డుకు ఇరువైపులా పహారా కాసేవారు. యూరోపియన్లు తప్ప ఇతరులకు ఆ కట్ట మీద అనుమతి లేకుండా నడవనివ్వరు.

ప్రతి ఊరికి ముందు పెద్ద, చిన్న వాగులను దాటుకుంటూ వెళ్లాలి. ముఖ్యంగా మేడ్చల్ మొదలుకొని ఆదిలాబాద్ వరకు ఎక్కువ వాగులను దాటాలి. శ్రీశైలం తర్వాత కృష్ణా నదిని, హైదరాబాద్‌లో మూసి నదిని, దూదుగాము దగ్గర గోదావరి నదిని, విచ్చోడ దగ్గర కడెం నదిని, ధనోరా దగ్గర పెన్‌గంగా నదిని, వోణి దగ్గర వశిష్ట నదిని దాటాము. ఆయా నదుల పరిమాణాన్ని, నీటి ప్రవాహాన్ని బట్టి నది దాటడానికి వసతులున్నాయి. తెలంగాణలో పెద్ద వర్తకులు, ధనవంతులు ఉండే ప్రాంతాల్లో దొంగలు దాడి చేసేవారు. వారు నిర్భయంగా సాయంత్రాల్లో గుంపులుగా ప్రవేశించి కనపడ్డ వారినల్లా చంపి ధనవంతుల ఇండ్లల్లో, అంగళ్లలో చొరబడి యజమానులను చంపి, ధనాన్ని దోచుకొని అర గడియలో మాయమైపోయేవారు.

తెలంగాణ అన్ని దారులు మట్టివే. ఆయా ప్రాంతాల్లో రకరకాల భూములున్నాయి. కొన్ని బాటలు గులకరాళ్లతో, ఇసుకతో నిండి ఉన్నాయి. ఇంకొన్ని నల్లరేగడి భూములతో వానాకాలం చిత్తడిగా, ఎండకాలం నెర్రెలు చాచి ముళ్లలా గుచ్చుకుంటూ ఉండేది. బాటలన్ని దాదాపు అడవులు, గుట్టలు, కొండలు, వాగులు, వంకలు, డొంకలు, ఎత్తులు, వంపులు, నదులు, పర్వతాల గుండా ఉన్నవి. అడవి దారుల్లో క్రూర మృగాల బెడద ఎక్కువగా ఉంది. మేడ్చల్ నుంచి ఆదిలాబాద్ వైపుకు వెళ్లే బాటలో దొంగలు, పులుల భయం ఉండేది. నిర్మల్ దాటిన తర్వాత దారి వెంట ఈగలు చాలా బాధపెట్టాయి. హైదరాబాద్‌లో కాకులు ఎక్కువగా లేవు. అక్కడి ప్రజలు డేగలు పెంచడమే అందుకు కారణం.

కుంఫిణీవారు తెలంగాణలోని ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాలకు వెళ్లడానికి కొన్ని రహదారులు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, ఆ రోడ్లలో వచ్చే ఊర్ల గురించి ఇంగ్లీషు అధికారులు రాసిన వివరాలలో తప్పులున్నాయి. ఆ ప్రకారం పేర్లు అడిగితే అటువంటి ఊరు దారిలో లేదని స్థానికులు చెప్తారు.

హైదరాబాద్ సంప్రదాయంలో ఒకటైన మొహర్రం పండుగ జరిగే పుణ్య సమయానికి అక్కడ ఉన్నందుకు భగవంతునికి కృతజ్ఞత చెప్పుకుంటున్నాను. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవం జరిగేది. కంచికి గరుడ సేవలా, హైదరాబాదుకు మొహర్రం అత్యంత ప్రముఖమైన పండుగ. కంచిలో కూడా అన్ని మతాలవారు ఐక్యతతో కూడి గరుడ సేవ చేస్తారని ప్రతీతి. మొహర్రం పండగ కుతుబ్‌షాహీల కాలంలో అప్పటి అధికారి మీర్ మోమిన్ అస్తరబాది చొరవతో హైదరాబాద్ నగరంలోకి ప్రవేశించింది.

తెలంగాణలో ఎక్కువగా అన్నమే తింటారు. ఆయా గ్రామాల్లో బియ్యంతో పాటు తియ్యగా ఉండే గోధుమల పిండి విసిరి అమ్ముతున్నారు. ఊరికే అన్నమే తినడం వల్ల దేహానికి బలం ఉండదనే పుకారు ఉన్నందున రాత్రిపూట రొట్టె తినేవాడిని. తెలంగాణ ప్రాంతంలో ఉన్నంతకాలం రొట్టెతో పాటు అన్నం కూడా తిన్నాను. అది కూడా ఆరోగ్యంగానే ఉంది.

కూరగాయలు మా ప్రాంతంలో కంటే ఇక్కడ ఎక్కువ రుచిగా ఉన్నాయి. హైదరాబాద్ దాటిన తర్వాత పాలు, పెరుగు ఊరూరిలో సమృద్ధిగా దొరికాయి. ఇందలవాయిలో తమలపాకులు మిగతా ప్రాంతాల కన్నా చాలా బాగున్నాయి. తెలంగాణలో వక్కలు ముడివక్కలు. పగలగొట్టి నోటిలో వేసుకొంటే మా ప్రాంతపు వక్కల కన్నా బాగా రుచిగా ఉన్నాయి. ఇక్కడి పేద ప్రజలు తాంబూలం కన్నా వక్కలే ఎక్కువగా నములుతారు. చుట్ట అలవాటు కూడా ఇక్కడి వారికి ఉంది.

***

(1830-31 సంవత్సరాల్లో ఏనుగుల వీరాస్వామయ్య అనే ఓ మహనీయుడు చెన్నై నుంచి కాశీకి యాత్ర జరిపారు. అందులో భాగంగా తెలంగాణలోనూ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన అనుభవాలను పైవిధంగా చెప్పుకొచ్చారు. వీరాస్వామయ్య రాసిన కాశీయాత్ర చరిత్ర వ్యవహారిక భాషోద్యమానికి చాలా ఉపయోగపడింది. అంత గొప్ప గ్రంథంలోని మన తెలంగాణకు సంబంధించిన భాగాల సేకరణ...)



డాక్టర్
మల్లెగోడ గంగాప్రసాద్
73863 87249



బైనరీ భాష

భాషంటే
ఒకటే అనుకుంటాం

కానీ భాష ద్విరూపి
కావ్య భాషే
కమనీయమన్నారు ఓ నాడు
పద్య భాషే
ప్రామాణికమన్నారు ఆనాడు
గ్రాంథిక భాషే
గణనీయమన్నారు మరునాడు
వ్యవహారికమే
విలువైనదన్నారు ఈనాడు


ప్రతి దశలోనూ భాష
రెండు సమాంతర నదులుగా
ప్రవహించింది
మార్గ, దేశీ దశలుగా
గ్రాంథికం, వ్యావహారికంగా
బడి పలుకులు, పలుకుబడులుగా
ఒకే జన్మలో రెండు బతుకులు
బతికింది

ఐనా
మనకెందుకులే ఆ బాధ
కోయిల పాటని మానేసి
కొరియన్ పాప్‌ని
దిబ్బరొట్టె సర్వపిండిని ఆపేసి
పిజ్జా బర్గర్‌ని
రామాయణ భారతాలు చదవటం ఆపేసి
విష సంస్కృతి సీరియల్స్‌కి
మారబడ్డ వాళ్లం కదా మనం

భాషా ప్రేమికుల్లారా
బాధ పడకండి
ఈ తరానికి భాషంటే
smsసే
కిచిడీ మాటల మల్టీ మీడియానే
ఇప్పుడు భాషకి కొత్త
తొడుగు తయారయ్యింది
చాట్ జీపీటీ సింగారంతో
Ai మెరుపులతో
హొయలు పోతుంది
తెలుగు భాషిప్పుడు
బైనరీ కోడ్‌తో
డిజిటల్ స్వరాలుగా
పలుకుతుంది

పలకను గిరాటేసి
ట్యాబ్‌పై అక్షరాలూ
దిద్దుకుంటున్న పిల్లల్లారా!

మనందరం ఓ రహస్యం చెప్పుకుందామా!
గూగులే మనందరి
సామూహిక అమ్మ
గూగులమ్మ పలికేదే
ఈ కాలపు మాతృభాష!



అయినంపూడి
శ్రీలక్ష్మి
99899 28562

ఆవిష్కరణ సభ

2024 సెప్టెంబర్ 14, శనివారం ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో 'కవి సంధ్య 50వ సంచిక' ఆవిష్కరణ సభ జరుగనున్నది. శివారెడ్డి, రమణాచారి, కె.శ్రీనివాస్, వాడ్రేవు చిన వీరభద్రుడు, మామిడి హరికృష్ణ, దాట్ల దేవదానం రాజు, ఏనుగు నరసింహారెడ్డి, కోయి కోటేశ్వరరావు, గూటం స్వామి హాజరుకానున్నారు. ఇదే సభలో నాగరాజు రామస్వామి రచించిన 'కవన కోకిలలు' పుస్తకం ఆవిష్కరణ, అంకిత కార్యక్రమం ఉంటుంది.

- శిఖామణి, కవి సంధ్య

కవితలకు ఆహ్వానం

విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని వెనుకబడిన కులాలు, జాతులకు సమన్యాయం చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నదని ఇటీవల సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు సంఘీభావంగా 2024, అక్టోబర్ 15లోగా వచన, పద్య కవితలను ఆహ్వానిస్తున్నాం. ఎంపికైన కవితలను పుస్తకంగా ప్రచురిస్తాం. కవితలు పంపవలసిన చిరునామా ప్లాట్ నెం 297, రోడ్ నెం 21, సెక్రటేరియట్ కాలనీ, సీయూసీ పోస్ట్, గచ్చిబౌలి, హైదరాబాద్-046. 94410 91305, 99483 11667 ఈ నెంబర్ల ద్వారా కవితలను వాట్సాప్ కూడా చేయవచ్చు. joopakasubadra@gmail.com అనే మెయిల్ ద్వారా కూడా కవితలు పంపవచ్చు.

- జూపాక సుభద్ర, దండోరా ప్రచురణలు

జయ జయహే తెలంగాణ

**జయ జయహే తెలంగాణ
జయ జనమన తెలంగాణ ॥జయ॥**


**ప్రత్యేక తెలంగాణా
ప్రకాశించు సుదినమిదే
బంగారు తెలంగాణా
రంగారే సమయమిదే**

**కరెంటు కష్టాలు తీర
కడుపేదలు సేదదీర
'ఆసరా' పథకాలతో
అలరారే తెలంగాణ ॥జయ॥**

**కాళేశ్వర గోదావరి
కదలి ఎల్లెడల పారగ
రూపొందిన ప్రాజెక్టులు
రూపుమాప నీటి కరువు**

**'అపర భగీరథ' యత్నం
ఆమెను సఫలీకృతం
దేశానికే ఆదర్శం
అయిపోవుటె అభిమతం ॥జయ॥**

**'దశాబ్ది ఉత్సవాల'
దసరా నా తెలంగాణ
'దళితబంధు' - 'రైతుబంధు'
మిళిత పథక తెలంగాణ
అంబరాన్ని చుంబించే
అంబేద్కర్ విగ్రహంతో
సరికొత్త 'సచివాలయ'
సాధించిన తెలంగాణ
'ఫ్లై ఓవర్' కట్టడాల
'హై ఫ్లేవర్' తెలంగాణ ॥జయ॥**





(డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ రాసిన 'జయ జయహే తెలంగాణ' అనే ఈ పాటను 'నమస్తే తెలంగాణ' గతంలోనే ప్రచురించింది. రచయిత ఇటీవల పరమపదించిన నేపథ్యంలో మరోసారి ఆ పాటను ప్రచురిస్తూ ఆయనకు నివాళులర్పిస్తున్నాం..)

తెలుగు నుడికి గుడి కట్టిన తెలంగాణ

- తెలంగాణలోనే కంద పద్ధతి, ద్విపద కావ్యం
- ఉమ్మడి రాష్ట్రంలో ఈసడించబడిన తెలంగాణ భాష
- స్వపరిపాలనలోనే తెలంగాణ తెలుగు వికాసం
- 'కాళోజీ' జయంతిని అధికార భాషా దినోత్సవంగా గుర్తింపు

నేడు తెలంగాణ తెలుగు భాషా దినోత్సవం


జగిత్యాల, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): అరవై ఏండ్ల ఉమ్మడి ప్రయాణంలో తేటతేట తెనుగు అయిన తెలంగాణ తెలుగుకు గుర్తింపే రాలేదు. తెలంగాణ కవులు, రచయితలు, మేధావులు ద్వితీయ శ్రేణివారీగా ఈసడించబడ్డారు. నన్నయ్య, తిక్కన, ఎర్రన, శ్రీశ్రీ, గురజాడ అంటూ అంతా వారే రాజ్యమేలారు. కన్నడాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయలు ఉమ్మడి పాలకులకు కనిపించాడు తప్ప, మల్కాభిరాముడు అని పేరున్న మన కుతుబ్‌షాహీ ప్రభువు గుర్తుకు రాలేదు. సంస్కృతంతో నిండిన భారతమే తప్ప, స్వచ్ఛ తెలుగులో రాసిన పాల్కూరి సోమనాథుడు కనిపించలేదు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాతనే తెలంగాణ భాషను కాపాడుకునే ప్రయత్నం ఆరంభమైంది. 'అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంటూ సకలించు ఆంధ్రుడా చావవెందుకురా' అంటూ పౌరుషంగా ప్రకటించిన కాళోజీ నారాయణరావు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించారు. నేడు తెలుగు భాషా దినోత్సవం నేపథ్యంలో తెలంగాణ తెలుగు భాష ప్రాచీనత, చరిత్ర వికాసంపై ప్రత్యేక కథనం..

ఐదువేల ఏళ్ల వారసత్వం

హిందీ, ఇంగ్లిష్, ఫ్రెంచి, జర్మనీ తదితర భాషలన్నీ సంస్కృతం నుంచి ఆవిర్భవించగా, తెలుగు మాత్రం ద్రావిడ భాష నుంచి ఉద్భవించింది. మధ్య ఆసియాప్రాంతంలో ఐదు వేల ఏండ్ల క్రితం సుమేరియన్ల రాజధాని నినివే వద్ద జరిగిన తవ్వకాల్లో బయల్పడిన 25 వేల మట్టిప్రతుల్లో తెలుగు అక్షరాలు, పదాలు కనిపించాయి.

200 ఏళ్లకు ముందే తెలంగాణలో అభివృద్ధి

తెలుగు అక్షరాలకు నుడికారం దిద్దారని నన్నయ్య బట్టారకుడు, నారాయణ భట్టులను చెప్పుకుంటున్నా వాస్తవానికి వారి కంటే 200 ఏండ్ల ముందే తెలుగు భాష తెలంగాణ ప్రాంతంలో అభివృద్ధి చెందింది. మౌర్యుల తొలి చక్రవర్తి చంద్రగుప్తుడు కాలంలో గ్రీకు రాయబారి మెగస్తనీస్ రచించిన ఇండికాలో దక్షిణ భారతదేశంలో ఆంధ్రులు అనే బలమైన రాజ్యం ఉందని పేర్కొన్నారు. గోదావరి ఒడ్డున రాజధాని



ప్రాంతం కరీంనగర్ జిల్లాలోని కోటి లింగాల గ్రామమని చరిత్రకారులు గుర్తించారు. కోటి లింగాల వద్ద బయల్పడిన శాతవాహనుడు, సీముకుడి నాణాలపై తెలుగు భాషకు మూలమైన బ్రహ్మీ లిపిలో అక్షరాలు లిఖించబడ్డాయి. క్రీ.పూ 2వ శతాబ్దానికి చెందిన నాణెంలు లభించగా, వాటిపై పేర్లు ప్రాకృత తెలుగులోనే ముద్రించబడి ఉన్నాయి. ధూళికట్ట వద్ద లభించిన శాసనం సైతం తెలుగు భాషా ప్రాచీనతను చాటుతుంది. కురిక్యాలలోని బొమ్మలమ్మ గుట్ట వద్ద క్రీ.శ 945లో కవి జీనవల్లభుడు తెలుగు, కన్నడ, సంస్కృత భాషల్లో శాసనాలను వేయించగా, అందులో మూడు తెలుగు కంద పద్యాలు ఉండడం విశేషం. తెలుగు వ్యాకరణంలోని కంద పద్ధతికి కరీంనగర్ ప్రాంతమే పుట్టినిల్లు అని స్పష్టమైంది. కాకతీయుల కాలానికి చెందిన పాల్కూరి సోమనాథుడు పండితారాధ్య చరిత, బసవ పురాణాలను ద్విపద కావ్యాలుగా మలిచాడు. కుతుబ్‌షాహీల పాలనలో రుద్రకవి, జగన్నాథుడు, అక్కన్న, మాదన్నలు తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేశారు.

20వ శతాబ్దంలో కొత్తపుంతలు

20వ శతాబ్దంలో తెలంగాణలో తెలుగు సాహిత్యం, భాష కొత్త పుంతలు తొక్కింది. నిజాం పాలనలో తెలుగుకు గొప్ప ప్రాభవమే కనిపించింది. నిజాంకు ఎదురుతిరిగి వట్టికోట అళ్వారుస్వామి జైలులోనే 'జైలు లోపల' అనే సంపుటిని వెలువరించాడు. ప్రజల మనిషి, గంగు నవలలను వ్యవహారిక భాషలో రాశాడు. దాశరథి కృష్ణమాచార్య రాసిన అగ్నిధార, రుద్రవీణ, మార్పు నాతీర్పు, ధ్వజమెత్తిన ప్రజా, తిమిరంతో సమరం ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి. రంగాచారి రాసిన చిల్లర దేవుళ్లు, జీవనయానం, మోదుగుపూలు సైతం తెలుగు సాహిత్యంలో ధ్రువతారలే. కాళోజీ నారాయణరావు రాసిన 'నా గొడవ' ప్రజల తిరుగుబాటుకు ప్రత్యామ్నాయంగా నిలిచింది. ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి, అలిశెట్టి ప్రభాకర్ తదితరులు తెలుగు భాష ఔనత్యాన్ని కాపాడేందుకు కృషి చేశారు.

ప్రాచీన హోదాకు తెలంగాణే అర్హత

రెండువేల ఏండ్ల చరిత్ర కలిగిన భాషలకు కేంద్రం ప్రాచీన భాష హోదాను కట్టబెట్టింది. తెలంగాణ ప్రాంతంలో లభించిన ఆనవాళ్ల తో తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించింది. అయితే ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు తెలుగు భాష ప్రాచీన హోదాను, దాని వల్ల లభించే నిధులను అనుభవిస్తున్నారు. ఆ ప్రయోజనాలను తెలంగాణకు మాత్రమే వర్తింపజేయాలని తెలంగాణ కవులు, కళాకారులు పేర్కొంటున్నారు.

ధిక్కార దివిటీ కాళోజీ

బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి(సెప్టెంబర్ 9) సందర్భంగా ఆయన సేవలను బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. బతుకంతా తెలంగాణ కోసమే అర్పించిన అక్షర తపస్వి కాళోజీ అని కీర్తించారు. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ స్ఫూర్తి ఇమిడి ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తాను బయలుదేరిన నాడు నిండు మనసుతో కాళోజీ దీవించారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాళోజీ



స్ఫూర్తి కొనసాగే దిశగా ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కాళోజీ పురస్కారాన్ని ఏర్పాటు చేసుకొని తెలంగాణ భాష, సాహిత్యాలలో విశేషంగా కృషి చేసిన సాహితీవేత్తలను గౌరవించుకుంటున్నాం అని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య విశ్వవిద్యాలయానికి కాళోజీ పేరు పెట్టామని, వరంగల్‌లో కాళోజీ కళాకేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

నలిమెలకు కాళోజీ పురస్కారం

నేడు రవీంద్రభారతిలో ప్రదానం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ప్రఖ్యాత సాహితీవేత్త, బహుభాషా కోవిదుడు, కవి, రచయిత, అనువాదకుడు నలిమెల భాస్కర్, కాళోజీ నారాయణరావు సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించే ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సాహితీ పురస్కారాన్ని అందజేయనున్నది. పురస్కారం కింద రూ.1,01,116 నగదుతోపాటు జ్ఞాపికను అందజేస్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన నలిమెల భాస్కర్ తెలుగు అధ్యాపకుడిగా పనిచేసి 2011లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆయన రచనల్లో అద్దంలో గాంధారి, మట్టి ముత్యాలు, సుద్దముక్క వంటి సంకలనాలు ప్రసిద్ధమైనవి. నలిమెలకు..14 భాషల్లో నైపుణ్యం ఉన్నది.



మహబూబాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు

అప్రమత్తం.. తప్పిన వరద ముప్పు

- సహాయక చర్యల్లో జిల్లా అధికార యంత్రాంగం
- సురక్షిత ప్రాంతాలకు 'ముంపు' ప్రజల తరలింపు
- రాత్రంతా వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, సీపీ
- తగ్గిన మున్నేరు ఉధృతి.. ఊపిరి పీల్చుకున్న అధికారులు

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): అధికారుల అప్రమత్తతతో ఖమ్మం నగరానికి వరద ముప్పు తప్పింది. వారం క్రితం వచ్చిన వరదలకు సర్వం కోల్పోయిన ప్రజలు ఇంకా తేరుకోకముందే.. మరో దెబ్బ తగిలే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. కుండపోతను తలపించేలా ఖమ్మం జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి నిర్విరామంగా కురుస్తున్న భారీ వర్షాలతో వణికిపోయింది. ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా ఖమ్మం మున్నేరు ప్రవాహం శనివారం రాత్రే మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువైంది. దీంతో అధికారులు అప్రమత్తమై దాని పరీవాహక ప్రాంతాల ప్రజలను మైకులతో అలర్ట్ చేశారు. మున్నేరు ముంపు ప్రాంతాలైన కాల్వొడ్డు, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, ధంసలాపురం, రాజీవ్‌గృహకల్ప, దానవాయిగూడెం, కాలనీల్లోని ప్రజలను ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ ఆధ్వర్యంలో అధికారులు శనివారం అర్ధరాత్రే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారిని కందగంట్ల ఫంక్షన్ హాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉంచారు. శనివారం తెల్లవారుజామున 2 గంటల వరకు మున్నేరు వరద 16 అడుగులకు చేరుకుంది. ఆ తరువాత నిలకడగా ఉండి ఆదివారం సాయంత్రం వరకు పెరగకపోవడంతో అధికారులు, ముంపు ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 5.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తల్లాడలో రికార్డు స్థాయిలో 12.62 సెం.మీ. వర్షం కురిసింది. జూలూరుపాడు మండలం రాంపురం-ఏలకలొడ్డు పరిధిలోని పశువుల కాపరులు, పోడుసాగుదారులు వాగు దాటేందుకు వీలుకాకపోవడంతో అడవిలో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాణాప్రతాప్ సిబ్బందితో కలిసి వారిని సురక్షితంగా ఒడ్డు చేర్చారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పెండల్‌వాడ సమీపంలోని సాత్నాల ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తడంతో ఆరుగురు రైతులు ఎడ్లబండితో సహా వరదలో చిక్కుకున్నారు. గ్రామస్థులు తాళ్ల సాయంతో ఎడ్లబండిని, రైతులను సురక్షితంగా కాపాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ గ్రామంలోని దుందుభీ వాగులో చిక్కుకున్న తొమ్మిది మందిని ఎస్సై మహేశ్ కాపాడారు. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ శివారులో ఎస్సారెస్పీ డీబీఎం-31పై ఏర్పాటు చేసిన బ్రిడ్జి ఆదివారం తెల్లవారుజామున కుప్పకూలింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం శ్యామ్‌నగర్ గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగు పడి పొనగంటి సులోచన (44) అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని గుమ్మెనంగ్లాపూర్‌కు చెందిన రైతు దత్తురి గురువయ్య(50)కు శనివారం రాత్రి గుండెపోటు వచ్చింది. గుమ్మెనంగ్లాపూర్ గ్రామ శివారులో దోత్తివాగు ఉధృతంగా ప్రవహించడంతో దవాఖానకు తీసుకెళ్లడానికి వీలు కాలేదు. దీంతో గురువయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.



ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో పల్లిపాడు —ఏన్కూరు మార్గంలో రోడ్డు పైనుంచి పొంగి ప్రవహిస్తున్న పగిడేరు

వరద బాధితులకు అండగా బీఆర్‌ఎస్

- ప్రజలను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- ప్రజలు ధైర్యంగా ఉండాలి : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్, సెప్టెంబర్ 8: వరద బాధితులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆమె మహబూబాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వరద బాధితుల కోసం పంపిన నిత్యావసర సరుకులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హడావుడిగా వచ్చి అనేక వాగ్దానాలు చేసి వెళ్లారని, రూ.10 వేల నష్టపరిహారం అని.. వారమైనా అందలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కంది ఐఐటీలో సతి సెంటర్

కంది, సెప్టెంబర్ 8: సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో అత్యాధునిక మైక్రోస్కోపీ పద్ధతులను ఉపయోగించి వినూత్న ఆవిష్కరణలకు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సతి (సాఫిస్టికేటెడ్ అనలిటికల్ అండ్ టెక్నికల్ హెల్ప్ ఇన్‌స్టిట్యూట్) సెంటర్‌ను భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్‌టీ) కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఐటీ హెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఐఐటీ హెచ్ చైర్మన్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి, హైదరాబాద్ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జగదీశ్వరరావు, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ చైర్‌పర్సన్ డాక్టర్ కృష్ణ ఎల్లా, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్ టీటీడీ ఆలయాల్లో తిరుమల లడ్డూ

తిరుపతి తిరుపతి దేవస్థానం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని శ్రీవారి భక్తులకు టీటీడీ శుభవార్త తెలిపింది. తిరుమల లడ్డూ నిత్యం హైదరాబాద్‌లో లభ్యం కానుందని ప్రకటించింది. హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానాల్లో ఇక నుంచి ప్రతి రోజూ లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉంటుందని టీటీడీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ ప్రభు, ఎన్ నిరంజన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో లడ్డూను రూ. 50కి విక్రయించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లడ్డూ విక్రయాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. భక్తులు గమనించాలని కోరారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. 20 కంపార్టుమెంట్లో భక్తులు వేచిఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు పేర్కొన్నా రు. శనివారం స్వామివారిని 83,960 మంది భక్తులు దర్శించుకోగా, 32,342 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 2. 96 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.

వర్షాలతో పలు రైళ్ల రద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీలో కురుస్తున్న వర్షాల వల్ల ఆయా మార్గాలలో పలు రైళ్లను రద్దు చేసినట్టు ఆదివారం రైల్వే అధికారులు తెలిపారు. హౌరా-శ్రీ సత్య సాయి ప్రశాంతి నిలయం వరకు ఈ నెల 25 నుంచి 27 వరకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు ప్రకటించారు.

9 నెలల పాలనలోనే ఎన్‌కౌంటర్లు

- శాంతిభద్రతల వైఫల్యం ప్రభుత్వ వైఫల్యమే
- బీఆర్‌ఎస్ హయాంలోనే అనేక పోలీస్ సంస్కరణలు
- బీఆర్‌ఎస్ నేత దేవీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి



హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత జీ దేవీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ఎన్‌కౌంటర్లు ఎక్కువగా జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ నేత జీ దేవీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. గత పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒకటి రెండు మినహా ఎన్‌కౌంటర్లు జరగనేలేదని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై ఆయన మాట్లాడారని తెలిపారు. పోలీసు వ్యవస్థను ప్రభుత్వం కుప్పకూల్చిందని అన్న హరీశ్ వ్యాఖ్యలను పోలీసు అధికారులు తప్పుగా అర్థం చేసుకున్నారని దేవీప్రసాద్ తెలిపారు. పోలీసులు, పోలీసు అధికారుల పట్ల తమకు గౌరవం ఉన్నదని, హరీశ్‌రావు నిరంతరం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల స్పందిస్తున్నారని చెప్పారు. కొందరు పోలీసు అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఖమ్మంలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న నలుగురు మాజీ మంత్రుల బృందంపై దాడులు జరిగాయని, ఈ ఘటనపై పోలీసులు కనీసం స్పందించనే లేదని, ఆ పర్యటనలో హరీశ్‌రావు కూడా ఉన్నారని పేర్కొన్నారు. గత పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో సీఎంగా కేసీఆర్ పోలీసుశాఖలో అనేక సంస్కరణలను అమలు చేశారని గుర్తు చేశారు. పోలీస్‌స్టేషన్లకు స్టేషనరీ ఖర్చులు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. పోలీసులకు కొత్త ఇన్నోవాలు ఇచ్చారని, 47 వేల మంది పోలీస్ కానిస్టేబుళ్ల నియామకం బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగిందని, శాంతిభద్రతల వైఫల్యం ప్రభుత్వ వైఫల్యంగా భావిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయ అవార్డుల్లో పారదర్శకత లేదని పాతూరి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ప్రతి జిల్లా నుంచి నలుగురు చొప్పున ఎంపిక చేయాలని, దానిని విస్మరించారని తెలిపారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక గురుకుల పాఠశాలల స్థాయిని పెంచగా, నేడు కాంగ్రెస్ హయాంలో గురుకుల పాఠశాలలను పట్టించుకోవడమే లేదని తెలిపారు. తెలంగాణలో 194 ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేశామని, వాటిని ప్రభుత్వ పాఠశాలలుగా మార్చాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు శాంతిభద్రతల సమస్య రానీయొద్దని కోరారు. ప్రభుత్వ విధానం ప్రకారమే పోలీసులు నడుచుకుంటారని తెలిపారు. రైతు భరోసా ప్రస్తావనే లేకుండా పోయిందని, ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడమే లేదని, కాంగ్రెస్ నేతలు గాలి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

బీసీ రిజర్వేషన్ల కోసం 20న కలెక్టరేట్ల ముట్టడి

- ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్
- తక్షణమే కులగణన చేపట్టాలని రాహుల్‌కు లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్8 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో 20న కలెక్టరేట్ల ముట్టడి చేపట్టనున్నట్టు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం కాంగ్రెస్ లోక్‌సభపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి, ఆర్ కృష్ణయ్య రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో తక్షణం కులగణన నిర్వహించాలని, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్‌గాంధీ నిత్యం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. బీసీ నేతలు మాట్లాడడానికి ప్రయత్నిస్తుంటే అణిచివేస్తున్నదని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతం సీలింగ్ అని చెప్పి తప్పించుకునేందుకు వీలులేదని స్పష్టం చేశారు.

మహిళలకు 'లైవ్లీ హుడ్' రుణాలు

- ఒక్కొక్కరికీ రూ.40వేలు
- రాష్ట్రంలో 36వేల మందికి రూ.144 కోట్లు అందించనున్న కేంద్రం

హైదరాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సభ్యులను వ్యాపార రంగంలో ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్(ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) రుణాలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. పథకంలో భాగంగా రాష్ట్రంలోని 36వేల మందికి అతి తక్కువ వడ్డీతో ఒక్కొక్కరికీ రూ.40వేల చొప్పున అందజేయనున్నది. రాష్ట్రంలో 18వేల గ్రామ సమాఖ్యలు ఉండగా ఎన్‌ఆర్‌ఎల్‌ఎం రుణాల కింద గ్రామ సమాఖ్యలకు కేంద్రం రూ.144కోట్లను అందజేయనున్నది. తీసుకున్న రుణాలతో గ్రామాల్లో సూక్ష్మ తరహా పరిశ్రమలను స్థాపించాల్సి ఉంటుంది. లబ్ధిదారుల ఎంపికను నెలాఖరు వరకు పూర్తిచేయాలని నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ అధికారులు రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా రుణాన్ని తీసుకునే సభ్యురాలు, తిరిగి కేంద్రానికి చెల్లించకుండా గ్రామ సమాఖ్యకు చెల్లించాల్సి ఉంటుంది. అలా రికవరీ అయిన డబ్బులను గ్రామ సమాఖ్య ఇతర సభ్యులకు రుణాలు ఇచ్చేందుకు ఉపయోగించాలని అధికారులు తెలిపారు.

హోటల్‌లో 20రోజులపాటు బాలిక నిర్బంధం

- వాట్సాప్ ద్వారా లోకేషన్ షేర్ చేసిన బాలిక
- కాపాడిన షీ టీమ్స్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): ఇన్‌స్టాగ్రామ్ పరిచయం ఆ బాలికకు శాపంగా మారింది. ఓ మోసగాడి ఉచ్చులో పడిన ఆ బాలిక హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో 20రోజులు నిర్బంధంలో చిక్కుకున్నది. చివరికి వాట్సాప్ ద్వారా తల్లిదండ్రులకు లోకేషన్ షేర్ చేయగా, షీటీమ్స్ సాయంతో బయటపడింది. సైబర్ క్రైమ్స్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం...నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. మాయమాటలతో ఆమెను హైదరాబాద్‌కు రప్పించాడు. అనంతరం ఓ హోటల్‌లో బాలికను 20రోజులపాటు బంధించాడు. తల్లిదండ్రులు షీటీమ్స్‌ను ఆశ్రయించగా, నారాయణగూడలోని ఓ హోటల్‌లో ఉన్నట్లు గుర్తించి ఆమెను కాపాడారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై ముగ్గురు యువకుల లైంగికదాడి

నిందితులపై పోక్సో కేసు నమోదు

దుబ్బాక, సెప్టెంబర్ 8: పాఠశాలలో చదువుకునే బాలికపై ముగ్గురు యువకులు లైంగికదాడి చేశారు. బాలిక గర్భం దాల్చడంతో విషయం బయటకొచ్చింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితులపై పోక్సో కేసు నమోదయ్యింది. ఈ మేరకు ఆదివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఏసీపీ మధు వివరాలు వెల్లడించారు. దుబ్బాకలోని ఓ బాలిక (9వ తరగతి)పై అదే మండలానికి చెందిన యువకుడు, అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులు కలిసి లైంగికదాడి చేశారు. మాయమాటలతో బాలికను మోసగించారు. 3 నెలల కిందట బాలిక తల్లి ఇంట్లో లేని సమయంలో వివిధ సమయాల్లో ముగ్గురు యువకులు ఆమె ఇంటికొచ్చి లైంగికదాడి చేశారు. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురవడంతో తల్లి సిద్దిపేట జిల్లా దవాఖానకు తీసుకెళ్లింది. అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు బాలిక గర్భం దాల్చిందని నిర్ధారించారు. దీంతో బాలిక తల్లి దుబ్బాక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేసి ముగ్గురు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఏసీపీ తెలిపారు. బాలికలు, మహిళలకు మాయమాటలు చెప్పి.. వారిపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు.



బాలికపై లైంగికదాడి చేసిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు. పక్కన దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగారాజు



జాతీయ సదస్సులో పాల్గొన్న వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్సీ అగర్వాల్, వైస్ చాన్స్‌లర్లు, ప్రతినిధులు

వ్యవసాయ రంగంలో మరిన్ని మార్పులు

- కేంద్ర వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్సీ అగర్వాల్
- కన్హాలో వీసీలతో జాతీయ సదస్సు

నందిగామ, సెప్టెంబర్ 8 : వ్యవసాయ రంగంలో మరిన్ని మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్సీ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో కేంద్ర వ్యవసాయ పరిశోధన మండలి, హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు భారత వ్యవసాయ వైస్ చాన్స్‌లర్ల జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్సీ అగర్వాల్ మాట్లాడుతూ.. సాగులో సాంకేతికంగా మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో 50 మందికిపైగా వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ వర్సిటీ విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, అధికారులు, ప్రొఫెసర్లు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ సూసైడ్

మృతురాలు పెద్దపల్లి జిల్లావాసి

జ్యోతినగర్, సెప్టెంబర్ 8: గుజరాత్‌లోని గాంధీనగర్ బీఎస్‌ఎఫ్ క్యాంపు క్వార్టర్‌లో శనివారం రాత్రి పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ సుభాష్‌నగర్‌కు చెందిన కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నది. కానిస్టేబుల్ బల్ల గంగాభవానీ (26) శనివారం మధ్యాహ్నం వరకు హెడ్‌క్వార్టర్స్‌లో సెంట్రింగ్ డ్యూటీ చేసి, తన నివాసానికి వెళ్లింది. రాత్రి 9 గంటలైనా గంగాభవానీ డ్యూటీకి రాకపోవడంతో అధికారులు ఆమె క్వార్టర్‌కు వెళ్లారు. తలుపు గడియపెట్టి ఉండటంతో దంతివాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తొలగించారు. అప్పటికే గంగాభవానీ ఉరేసుకొని విగత జీవిగా కనిపించింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం ఆమె మృతదేహాన్ని ఎన్టీపీసీకి తరలించారు. కాగా ఆమెకు 15 రోజుల క్రితమే వివాహం కుదిరింది. డిసెంబర్ 5న పెండ్లికి ముహూర్తం ఖరారైంది. పక్షం రోజుల క్రితం ఎన్టీపీసీకి వచ్చిన ఆమె ఈ నెల ఒకటిన గుజరాత్‌కు వెళ్లి విధుల్లో చేరింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

విమానాశ్రయంలో 'జైలర్' విలన్ అరెస్ట్

మద్యం మత్తులో భద్రతాసిబ్బందిపై దాడికి యత్నం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 8: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జైలర్ సినిమా విలన్ వినాయకన్‌ను అరెస్ట్ చేసిన ఘటన శనివారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొచ్చి నుంచి శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన వినాయకన్ మద్యం మత్తులో సీఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బందిపై దాడికి యత్నించాడు. దీంతో సీఐఎస్‌ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకొని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. సినిమాలో విలన్‌గా నటించిన ఆయన నిజ జీవితంలోనూ విలన్‌గా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. దీంతో అతడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు.

జిందగీ
చింతన

నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 9 సెప్టెంబర్ 2024
www.ntnews.com

సమస్యా నీదే.. పరిష్కారమూ నీదే!

గీతా వాక్యం

న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖానిచ!
కింనో రాజ్యేన గోవింద! కిం భోగైర్జీవితేన వా?
(భగవద్గీత – 1– 32)

'కృష్ణా! నాకు విజయంపై కోరికలేదు. ఓ! గోవిందా.. నాకు ఈ రాజ్యంతో గానీ, భోగాలతో గానీ, జీవితంతో గానీ ఏ విధమైన ప్రయోజనం లేదు!' అంటూ కురుక్షేత్రంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు. అది కురుక్షేత్రం. అంటేనే కార్యక్షేత్రం. అక్కడ కర్తవ్యాన్ని నిర్వహించాలే కానీ, సొంత భావనలకు అవకాశం ఉండదు. క్షత్రియుడిగా అర్జునుడి కర్తవ్యం ధర్మహాని జరుగుతున్న సమయంలో, అధర్మాన్ని నిగ్రహించి ధర్మాన్ని సంస్థాపించడం. నిర్దేశిత ధర్మాచరణకు సిద్ధమై కురుక్షేత్రానికి వచ్చిన అర్జునుడు.. ఇరుసైన్యాలలో తనవారిని చూసి, విమోహియై అస్త్రసన్యాసం చేస్తున్నాడు. కార్యాచరణ వేళ సమర్థుడైన వ్యక్తి అస్త్రసన్యాసం చేయడం అవాంఛనీయం.



లక్ష్యం నిర్దేశితమైంది. వనరులు సమకూర్చుకున్నారు. యోజనా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎవరి బాధ్యతలు వారికి అప్పగించడం జరిగింది. అర్జునుడి కార్య నిర్వహణా దక్షత, ధైర్య సాహసాలు, ప్రజ్ఞాపాటవాలు, గతంలో తాను సాధించిన విజయాలు ప్రాతిపదికగా.. అతణ్ని పూర్తిగా నమ్మి ఏడు అక్షౌహిణులతో పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని ఎదిరించడానికి రంగం సిద్ధమైంది. ఆ సమయంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు.

ఇక్కడ కృష్ణా, గోవిందా అనే రెండు సంబోధనలు ముఖ్యమైనవి. 'కృష్..' అనేది భూవాచకం. భూమి ఫలితాన్నిస్తుంది. భూమి కృషికి, కర్తవ్యపాలనకు సంకేతం. 'ణ' కారం నివృత్తి మార్గం. ఫలితాపేక్షతో చేసే కృషి వల్ల మోక్షం రాదు. ఫలితాపేక్షలేకుండా ఎవరైతే కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహిస్తారో వారికి మోక్షం వస్తుంది. 'నేను చంపుతున్నాను' అనే కర్తృత్వ భావన అర్జునుడిలో ఉంది.

గోవిందా అనడంలో... 'గో' శబ్దం ఇంద్రియాలకు ప్రతీక. ఇంద్రియాలను జయించిన వారికి శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చేవాడు గోవిందుడు. ఇంద్రియాలను జయించడం అంటే ఇంద్రియాల పని విధానాన్ని అవగాహన చేసుకొని, వాటిని ప్రభావవంతంగా ఉపయోగించుకోవడం మాత్రమే. జీవితమనే మరొక పదం ఉన్నది ఇందులో. బతకడం వేరు, జీవించడం వేరు. జీవించడంలో ప్రయోజనం ఉంది. అర్థవంతమైన, ప్రయోజనకరమైన, ఆనందకరమైన, అభ్యుదయకారకమైనది జీవితం. సుఖభోగాలు రెండూ భౌతిక జీవితానికి సంబంధించినవే. ప్రలోభానికి గురిచేసేవే. రాజ్యమూ శాశ్వతం కాదు. 'అశాశ్వత రాజ్యభోగాల కోసం, అయినవారిని అంతమొందించడం యుక్తమా?' అని సంశయిస్తున్నాడు అర్జునుడు.

అర్జునుడు ఇప్పుడు తన సమర్థత కన్నా తక్కువ స్థాయి భావాలని ప్రదర్శించి అవే ఉదాత్తమైనవిగా భ్రమపడుతున్నాడు. తనకు యుద్ధాలు కొత్తనా? ఎన్నో యుద్ధాలలో పాల్గొని జైత్రయాత్రలు చేశాడు. ఆ యుద్ధాలలో ఎందరు చనిపోలేదు? పిరికివాడా.. అంటే కాలకేయ నివాత కవచాది రాక్షసులను నిగ్రహించాడు. ఇంద్రుని అర్ధ సింహాసనాన్ని అధిష్ఠించాడు. భౌతిక సంపదల పట్ల ఉదాసీనత మోక్షానికి అవసరమే! కానీ, అర్జునుడిలో ఇంకా అలాంటి మానసికస్థితి ఉత్పన్నం కాలేదు. అతని మనసు, బుద్ధి కలత చెంది ద్వైదీ భావనలతో సంక్షుభితమై అయోమయంలో ఉన్నాయి. కర్తవ్యంపై అసంతృప్తితో కూడిన వేదన కలిగింది. విభ్రమకు లోనైన మనసుతో తనది కారుణ్య భావన అనే ముసుగులో నిర్వికారతను ఆశ్రయించాడు. అర్జునుడు ధర్మ స్థాపనలో అనివార్యమైతే యుద్ధంలో ఎవరినైనా ఎదిరించాలే కానీ, క్లీబత్వాన్ని చూపకూడదనే జ్ఞానం లేనివాడా? అంటే కాదు. మరి ఎందుకా నిర్వేదన? మనసు చంచలమైనప్పుడు సందిగ్ధత పలకరిస్తుంది. ఆ సమయంలోనే మార్గదర్శకుడు అవసరమవుతాడు. వ్యక్తిలో సహజ స్థితియైన చేతన వెలుగు చూడాలి. దానికి ప్రేరణనిస్తూ వ్యక్తిని కర్తవ్యపరాయణుడిని చేసే దిశలో నడిపించేది భగవద్గీత.

... పాలకుర్తి రామమూర్తి

కాకిగోల

ఉపనిషత్ సారం

ఘన వాసన మేతత్తు చేతః కర్తృత్వ భావనమ్।
సర్వ దుఃఖప్రదం తస్మాత్ వాసనాం తనుతాం నయేత్॥
(అన్నపూర్ణోపనిషత్తు 1–31)

'మనసు కర్తృత్వంతో ఉంటే ఘనవాసన కలది అవుతుంది. ఆ స్థితే సమస్త దుఃఖాలనూ కలిగిస్తుంది. కాబట్టి వాసనలను నశింపజేసుకోవాలి...' అని భావం.

'నేను చేస్తున్నాను' అనే భావనే కర్తృత్వ భావన. దానినే ఆధ్యాత్మిక పరిభాషలో 'వాసన' అంటారు. ఒకే పనిని పదేపదే చేస్తూపోతే ఈ భావన క్రమంగా బలపడిపోతుంది. అది బలంగా మనసులో పాతుకుపోయి ఉన్నంత కాలం దుఃఖం తప్పదు. ఉన్న రహస్యమంతా ఇందులోనే ఉన్నది. ఒకసారి రామకృష్ణ పరమహంస మాట్లాడుతూ విజయ కృష్ణ గోస్వామికి ఓ కథ చెప్పాడు. 'ఒకరోజు జాలరులు చేపలు పడుతున్నారు. ఇంతలో పైనుంచి ఒక గద్ద రివ్వున వచ్చి ఓ చేపను తన్నుకు పోయింది. వెంటనే ఎక్కడినుంచి వచ్చాయోగాని కాకులన్నీ గుమిగూడాయి. నానా గోల చేస్తూ గద్ద ఎటు వెళ్తే అటు తరమసాగాయి. ఆ అయోమయంలో వేళ్ల నుంచి చేప ఉన్నట్టుండి జారి పడిపోయింది.



మరుక్షణంలో కాకులన్నీ గద్దను వదిలిపెట్టి చేప కోసం ఎగిరిపోయాయి. కాకుల నుంచి తప్పించుకునే క్రమంలో అలసిపోయి చికాకుపడిన గద్ద ఓ చెట్టు కొమ్మమీద వాలి ఊపిరి పీల్చుకుంది. తర్వాత తన మనసులో 'అయ్యయ్యో! ఈ చేపనే కదా అన్ని ప్రమాదాలకు మూల కారణం! అది నన్ను వదిలిపోయిన వెంటనే నాకు చెప్పలేనంత మనశ్శాంతి కలిగింది' అని అనుకున్నది. ఈ కథ చెప్పి పరమహంస 'ఎంతవరకైతే చేప అనే ప్రాపంచిక వాసన మనసును అంటిపెట్టుకొని ఉంటుందో.. అంతవరకూ జీవుడు కష్టాలలో గిలగిలా కొట్టుకుంటూనే ఉంటాడు. ఎప్పుడు ఆ వాసన.. అంటే తీవ్రమైన కోరిక ఒక్కసారి విడిచిపెట్టి పోయిందో ఆ క్షణంలోనే ఆత్మశాంతి అనంతంగా లభిస్తుంది'.

... డా॥ వెలుదండ సత్యనారాయణ

గురువు గొప్పతనం

ఇస్లాం బోధ

ఖలీఫా హారూన్ రషీద్ తన ఇద్దరు పిల్లలకు ఇంట్లోనే చదువులు చెప్పించేవారు. ఇమామ్ కసాయి చెప్పే పాఠాలను ఖలీఫా ఇద్దరు పిల్లలు మామూర్, అమీన్ ఎంతో బుద్ధిగా వినేవారు. గురువు గారికి పరమ విధేయులుగా ఉండేవారు. ఒకరోజు గురువుగారు చదువు చెప్పి ఇంటికి బయల్దేరబోయారు. అంతలో అన్నదమ్ములిద్దరూ లేచి గురువు గారికి తానంటే తాను మేజోళ్లు తొడిగిస్తానని పోటీపడ్డారు. ఇద్దరిమధ్య స్వల్ప గొడవ మొదలైంది. ఇంతలో గురువుగారు కలగజేసుకుని 'చెరో చెప్పు తొడిగించండి' అని చెప్పడంతో ఇద్దరి గొడవ సద్దుమణిగింది. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల తర్వాత ఖలీఫాను కలుసుకున్నారు గురువు. 'అత్యంత గౌరవనీయుడు ఎవరు?' అని ఇమామ్ కసాయిని ప్రశ్నించాడు ఖలీఫా హారూన్ రషీద్. దానికి ఆయన 'ఖలీఫా కంటే ఆదరణీయుడు, గౌరవనీయుడు ఇంకెవరుంటారు ప్రభూ' అన్నాడు. దానికి ఖలీఫా హారూన్ రషీద్ 'ఖలీఫా కొడుకులు ఎవరికైతే చెప్పులు తొడిగించారో అతను గౌరవనీయుడు' అన్నారు. గురువులను ప్రవక్తల వారసులుగా అభివర్ణించారు ప్రవక్త మహనీయులు. జ్ఞానాన్ని నేర్పే వారి కోసం సముద్రంలో చేపలు, భూమికింద కీటకాలు, ఆకాశంలో పక్షులు వేడుకుంటాయని ప్రవక్త (స) చెప్పారు. జ్ఞాన సంపన్నులైన గురువులకు అల్లాహ్ మహోన్నత స్థానాలు ప్రసాదిస్తాడని ఖురాన్ పేర్కొన్నది.



.. మహమ్మద్ ముజాహిద్,
96406 22076



సతుల విజ్ఞత గృహపతుల అజ్ఞత



మన పోతన మధురిమ 183 వ భాగం

శ్రీశుక ఉవాచ- రాజేంద్రా! రామకృష్ణులు గోపకులతో కూడి బృందావన ధామానికి దూరంలో గోవులను మేపుతున్నారు. అది మండు వేసవి. చండ కిరణుని ఎండ తాపం భరించలేక దండి చెడి- బడలిపోయి గోప కుమారులు తరుల దండ- వృక్ష సమూహాలను అండగా గైకొన్నారు. గొడుగుల వలె నీడలు ఇస్తున్న ఆ చెట్లను చూచి కడు వేడుక పడి గోప బాలకులు శ్రీకృష్ణ బలరామాదులతో ఇలా నుడివారు..

మ॥ 'అపకారంబులు సేయవెవ్వరికి నేకాంతంబు లందుండు నా
తప శీతానిల వర్ష వారణములై త్వగ్గంధ నిర్యాస భ
స్మ పలాశాగ్ర మరంద మూల కుసుమ చ్ఛాయా ఫలశ్రేణిచే
నుపకారంబులు సేయు నర్థులకు నీ యుర్వీజముల్ గంటిరే?'

'మిత్రులారా! ఈ ద్రుమాలను చూడండి. ఎవ్వరికీ ఎలాంటి హాని కలిగించవు. ఒకరి జోలి- జోక్యం లేకుండా, కాని పనులకు పోకుండా ఏకాంతంగా ఉంటాయి. ఎండ వాన చలిగాలి మంచుల బారి నుండి ఆశ్రయించిన వారిని రక్షిస్తాయి. కోరువారికి భూరిగా- జోరుగా తమ పట్టలు- బెరళ్లు, గంధం, జిగురు, భస్మం, చిగురుటాకులు, తేనెలు, వేళ్లు, పూలు, పండ్లు సమంచితంగా పంచి ఇచ్చి ఎంతగానో మేలుచేస్తాయి.' ఇలా చెప్పుకొంటూ బాలలందరూ తిన్నగా కాళిందీ తీరానికి చేరుకున్నారు. అందులో ఉన్న పెద్ద మడుగులో మెల్లగా పశువులకు చల్లని నీరు తాగించి, ఆ దగ్గరలోనే వాటికి కసవు మేపుతూ... 'అన్నా! ఆకలి వేస్తోంద'ని కన్నయ్యకు విన్నవించారు. తన భక్తురాండ్రగు ముని భార్యలను కనికరింపదలచి వనమాలి మాధవుడు ఆ యాదవ బాలురతో... 'వల్లవ కుమారులారా! ఈ వనంలో వేదవేత్తలైన విప్రులు స్వర్గలోక ప్రాప్తికై ఘనంగా ఆంగిరసమనే జన్నం- యజ్ఞం చేస్తున్నారు. వారి చెంతకు వెళ్లి నేను అడిగానని ఇంత అన్నం అర్థించి తెండి' అని అన్నాడు. శుకముని ఔత్తరేయునితో- అవనీపతీ! గొల్లపిల్లలు గ్రద్దన- వేగంగా యాగశాల వద్దకు వచ్చారు. గగనం దద్దరిల్లే విధంగా నిగమ- వేదధ్వని వినిపిస్తోంది. జన్నపు పెద్దలను కని మ్రొక్కి పిన్నలు... 'అవనీ సుర(బ్రాహ్మణు)లారా! ఓ మహనీయులారా! బలరామకృష్ణులు వని- అడవిలో పసువులను మేపుతూ అలసి ఆగొన్నారు. దయచేసి అన్నం పెట్టండి' అని అర్థించారు.

మ॥ 'క్రతువున్ మంత్రము దంత్రమున్ ధనములుం గాలంబు దేశంబు దే
వతయున్ ధర్మము నన్యముల్ దలప నెవ్వాడట్టి సర్వేశ్వరున్
మతి నూహింపక గోపబాలుడనుచున్ మందస్థితిం జూచి దు
ర్మతులై యన్నము లేదు లేదనిరి సమ్మాన క్రియా శూన్యులై.'

వైదిక కర్మలు, మంత్రాలు, తంత్రాలు, హవిస్సులు, పుణ్యకాలాలు, పవిత్ర స్థలాలు, ఇంద్రాది దేవతలు, యజమాని, అవికల- సంపూర్ణ యాగఫలమూ, ఈ సకలం ఏ మహావిష్ణువో, ఆ అకలంకుడే- మాయాదూరుడే అరవిందాక్షుడు కృష్ణుడని, అజ్ఞతతో అంతరంగంలో భావించలేక, కేవలం నందసుతుడని- గోపబాలకుడని తలచి ఆ విప్రులు మందమతులై, గోవిందుడు పంపిన గొల్లపిల్లలను ఆదరించక 'అన్నం లేదు లేద'ని అదలించి పొమ్మన్నారు. స్వర్గాది తుచ్ఛఫలాలు ఆశించి యాగాలు సాగిస్తున్న వీరు జ్ఞాన దృష్ట్యా బాలురు- అజ్ఞానులైనా తమను తాము జ్ఞానవృద్ధులుగా భావించే వ్యర్థులు!

రాజా! నిరాశతో మరలివచ్చిన బాలురను శోకరహితుడు, మురళీ మనోహరుడు లోక మర్యాదను అనుసరిస్తూ... 'అరే! ఎంతటి వెర్రివాళ్లురా మీరు? 'భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ' ఆకలి బాధ అమ్మలకు- అన్నపూర్ణలకు తెలుసు కాని అయ్యగార్లకేం తెలుసు? 'క్షుధా తృషార్తాః జననీం స్మరంతి' (ఆకలి దప్పులతో అల్లాడు పిల్లలు తల్లినేగా తలచేది) పిల్లలూ! మీరీమారు ఆర్యులను- పెద్దలను కాక వారి భార్యలను అడగండి' అంటూ వారిని మరల పంపాడు. ఆనక, వారంతా యాగశాల వెనుక నుంచి లోనికి చని, భాసురంగా- వెలిగిపోతున్న భూసురుల భార్యలను- వాసుదేవుని భక్తురాండ్రను కని, అవనికి తలలు తాకించి నమస్కరించారు. తమను ఆదరించిన అన్నపూర్ణ స్వరూపలకు ఇలా విన్నవించారు- 'ఓ బుద్ధిమతులారా! గోవిందుడు గోవులను మేపుతూ అలసి ఆగొన్నాడు. ఓ తులసీమతల్లులారా! మిమ్ములనడిగి అన్నం తెండని మమ్ము పంపించాడు. రండమ్మా! అన్నం పెట్టండమ్మా!'

శుకుడు- రాజా! ఆ పలుకులు ఆలకించి 'నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా' అని మనసున భావించే ఆ పతివ్రతామ తల్లులు పరవశించి పోయారు. నిత్యం కృష్ణ కథా శ్రవణ సంస్కారం వలన పరమాత్మ దర్శనం కొరకు పరితపించారు. వారికి యజ్ఞవిధిలో చిత్తం లేదు. యజ్ఞేశ్వరుని నైవేద్యంతో నిమిత్తం లేదు. తాము తినడంతో అస్సలు పనేలేదు. అయస్కాంత అచలం ఆకర్షించిన సూదుల్లాగా, పల్లానికి పారే జలధారల్లాగా, 'సముద్రమివ నిమ్నగాః' (భాగవతం)- సాగరుని చేర నరిగే సరిత (నదు)లలాగా, బిడ్డలు భర్తలు తోబుట్టువులు, బంధువులూ- 'హద్దు మీరుతున్నారు, వెళ్లవద్దు. వెళితే తిరిగి వద్దకు రానివ్వం' అని గద్దరిస్తు- అరుస్తున్నా, 'అడ్డగించకండి, తప్పుకోండి' అంటూ కడలికేసి వెడలే నదులు చిరు కట్టలకు నిలువనట్లు; 'పచామ్యన్నం చతుర్విధం' అన్నట్టు భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలు- పలు విధాల పానీయాలతో అన్నం విడివిడిగా పాత్రల్లో పళ్లేరాల్లో నింపుకొని విప్ర వనితలు అప్రమత్తలై, సుప్రసన్నలై కలివిడిగా, వడి-వడిగా తరలిపోయారు. అలా వెళ్లి కాళిందీ తీరంలో క్రొంజిగురు జొంపాలతో ఇంపారుతూ- కొత్త చిగుళ్ల గుబురులతో అందగిస్తూ, వనచరుల వేదనలు హరించే ఒక అశోక వృక్షం క్రింద, సుందర ప్రదేశంలో సందడి చేస్తున్న నందనందనుని అరవింద నేత్రలు (విప్ర పత్నులు) సందర్శించారు.

క॥ 'కని లోచన రంధ్రంబుల
మునుమిడి హరి లలిత రూపమును లోగొని నె
మ్మనముల బరిరంభించిరి
తను మధ్యలు హృదయ జనిత తాపము వాయన్'

రాజా! శ్యామసుందరుని, కామ జనకుని, వనమాలా విరాజితుని... 'భువన మోహన నటవేష భూతివాని, గనిరి కాంతలు కన్నుల కఱవు దీర'... జగాలను సమ్మోహపరచే నటవేషంతో జిగేలుమను వానిని ఆ రామలు- ఉత్తమ స్త్రీలు కన్నుల కరవు తీర కనుగొన్నారు. నళినాయతాక్షుని ఆ సుందరరూపాన్ని నయన ద్వారాల గుండా మనో మందిరాలలో పదిలంగా నిలుపుకొని త్రివిధ తాపాలు తొలగునట్లు హృదిలోనే కౌగిలించుకొన్నారు. సర్వాంతర్యామి శ్రీకాంతుడు వారి ఆంతర్యాన్ని గ్రహించి, తదేకంగా చూస్తూ, చిరునవ్వు చిందిస్తూ, అభినందిస్తూ ఇలా అన్నాడు... 'కాంతా రత్నములారా! మీమీ గృహాలలో అంతా కుశలమే కదా? మీరెంతో ఉల్లాసంతో ఫలాపేక్ష లేకనే- నిష్కామంగా ఏకాంత భక్తితో మా చెంతకు ఏతెంచారని మాకు తెలుసు. సంతోషం! మీ వలెనే బుద్ధిమంతులు నిష్కామభావంతో నన్ను సేవించి శ్రీమంతులు- మోక్షభాగులవుతారు. సతులారా! మీ పతులు నిర్వహించే క్రతువు నిర్విఘ్నంగా నెరవేరడానికి మీరిప్పుడే యజ్ఞశాలకు వెళ్లండి.' పుణ్యసతులు... 'పురుషోత్తమా! ఇంత పరుషంగా పలకడం నీకు తగునా? మా మగవారందరూ వారించినా నీ యందలి చనువుతో నీ చరణాల చెంతకు చేరాము. తీరా ఇప్పుడు మరలిపోతే, దామోదరా! మమ్ములను వారు చేరదీస్తారా? సారసాక్షా! మాకది సమ్మతం కాదు. వాసుదేవా! నీదే భారం. నీ దాసీజనంగా భావించి రక్షించు.' అని అతిదీనంగా విన్నవించుకున్న వనితలతో పన్నగశాయి ఇలా పలికాడు... 'సతులారా! నాకు సమర్పితలైన పుణ్యవతులు కనుక, మీ పతి సుతాదులు మీయందు కినుక పూనరు- నొచ్చుకోరు. దేవతలు సైతం మిమ్ములను మెచ్చుకుంటారు. నా సన్నిధి ముక్తికి పెన్నిధి! నా మాటలు నమ్ముట మీకు విధి.' పిమ్మట శ్రీహరి ఆ సాధ్వీమణులు అర్పించిన ఆహారాన్ని తోడివారితో కూడి ఆరగించాడు.

క॥ 'పరమేశ్వరార్పణంబుగ
బరజనులకు భిక్షయిడిన బరమ పదమునం
బరగెదరట! తుది సాక్షా
త్పరమేశుడు భిక్షగొన్న ఫలమెట్టిదియో?'

శుకుడు- రాజా! 'పరమేశ్వరార్పణమస్తు' అంటూ పరులకు భిక్ష పెడితే పరమపదం ప్రాప్తిస్తుందే! అలాంటిది- 'కృష్ణస్తు భగవాన్ స్వయం' సాక్షాత్ భగవంతుడైన శ్రీకృష్ణుడే భిక్ష స్వీకరిస్తే కలిగే ఫలం ఇది, ఇట్టిది అని ఎవరు గట్టిగ చెప్పగలరు? విప్ర వనితలకి యజ్ఞం వెయ్యి రెట్లు పండిపోయింది. సర్వేశ్వరుడు, సర్వరూపుడైన శ్రీహరికి ఆహారం నివేదించి తమ ధర్మపత్నులు ధన్యురాండ్రు అయ్యారని తెలిసి ఆ బ్రహ్మవాదులు- బ్రాహ్మణులు పశ్చాత్తప్తులయ్యారు. 'విప్రాః పశ్చిమ బుద్ధయః'- 'ఉర్వీసురులకు- విప్రులకు పెడతలనుండు బుద్ధి' అన్న ఆర్యోక్తని అయ్యవార్లు అన్వర్థం- సార్థకం చేసుకున్నారు. చేతులు కాలినాక ఆకులు తడుముకొన్నారు.. 'కటకట! మోసపోయితిమి, కాంతల పాటియు బుద్ధిలేదు'- అయ్యయ్యో! ఎంత మోసపోయాం! మన అతివ (భార్య)లకున్నంత మతి కూడా మనకు లేకపోయెనే? ఇంత దుర్గతి పాలయితిమే! వాసుదేవుని దర్శనానికి వెళ్లకపోతిమే! మనం దుష్టచిత్తులం, పరమ పాపాత్ములం. దామోదరునికి దూరమైన మన ప్రజ్ఞలెందుకు? తపస్సులు, తీర్థయాత్రలు, నియమనిష్ఠలు, యజ్ఞాలు, శీలసదాచారాలు ఎందుకు? తగుల వేసేటందుకా?

క॥ 'జప హోమాధ్యయనంబులు
దపములు వ్రతములును లేని తరుణులు హరి స
త్కృప బడసి, రన్ని గలిగియు
జపలత బొందితిమి భక్తి సలుపమి నకటా?'

– 'జపాలు, హోమాలు, వేదాధ్యయన తపోవ్రతాలు- ఇవి ఏవీ లేని అబలలు అచ్యుతుని అనుగ్రహానికి పాత్రమయ్యారు. ఇవన్నీ ఉన్నప్పటికీ భక్తికి నోచుకోనందు వలన మనం బుద్ధి చాంచల్యానికి గురియై విచ్యుతులం- పతితులం అయ్యాం. శ్రీమహాలక్ష్మిచే నిత్యం సేవలందుకునే ఆ భగవంతుడు విష్ణువు మనలను అన్నమడుగమని పంపడం- ఆ యాచన ప్రజలను మోహపెట్టేది కాదా! కృష్ణుని విష్ణువుగా గుర్తింపలేకపోవడం మన గొప్ప మౌఢ్యం కదా!'. యజ్ఞాలు చేస్తున్నారే కాని యజ్ఞఫల భోక్త ఎవ్వడనే విజ్ఞత- జ్ఞానం వారికి ఉన్నట్టు లేదు. శుకుడు- రాజా! ఆ విప్రపుంగవులు పరిపరి విధాల పశ్చాత్తాపం చెంది కూడా కంసుడి భయం వలన బలరామకృష్ణుల దర్శనానికి వెళ్లలేదు. ఆ శ్రీహరిని స్మరిస్తూ 'ఆ నందనందనునికి ఇవే మా వందనాలు' అంటూ తమ అపచారాన్ని క్షమించమని అక్కడి నుండే దండాలు పెట్టారు.'



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)

గొప్ప స్నేహం

క్రీస్తు సందేశం

మన జీవితంలో ఓ మంచి స్నేహితుణ్ని సంపాదించుకోవడం చాలా కష్టతరం. ఈ స్వార్థ జగత్తులో, ఎవరి బతుకు వారిదే అన్నట్టున్న ఈ రోజుల్లో నిబద్ధత గలిగిన స్నేహితులు కనిపించడం అరుదైన విషయమే! మానవుడికి శుభం కలిగించే మంచి స్నేహం గురించి యోబు భక్తుడు చెబుతూ 'ఆయనతో సహవాసం చేసిన యెడల నీకు సమాధానం కలుగును ఆలాగున నీకు మేలు కలుగును' (యోబు, -22,:-21,) అని ప్రస్తావించాడు. దేవుడితో సహవాసమా? ఎంత గొప్ప భాగ్యం? దేవుడితోనే మాట్లాడుతూ, ఆయనతోనే ఆలోచిస్తూ, చర్చిస్తూ, అన్నపానీయాలు సేవిస్తూ ఆయనతోనే నిరంతరం నివసిస్తూ ఉండటం ఎంతటి అవకాశం! నిజమే ప్రభువుతో కలిసి నడిచిన వారికి, నిత్యం తిరిగిన వారికి అనుక్షణం ఆయన రక్షణ లభిస్తుంది. విడువక, ఎడబాయక మనల్ని కంటికి రెప్పలా కాచి కాపాడతాడు. అంతేకాదు 'నీవు నావాడవు' అని భరోసా ఇస్తాడు. అలా అనగలిగేది ప్రేమ, బాధ్యత ఉన్నవాడే. నీవు దాక్కునే స్థలంలో కూడా రక్షణ కవచంలా పక్షిరెక్కలా కాచి కాపాడే గొప్ప స్నేహితుడు దేవుడు. 'నేను నిన్ను విమోచించియున్నాను భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను.. నీవు నా సొత్తు' (యెషయా 43:1) వాక్యాలు.. గొప్ప స్నేహాన్ని చాటిచెబుతాయి.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024



రైలుకు ఎదురెళ్లి.. పెనుముప్పు తప్పించి

ట్రాక్‌పై కొంకణ్ రైల్వే ట్రాక్‌మ్యాన్ సాహసం
వెల్డింగ్ లోపంపై లోకో పైలట్‌కు సమాచారం



న్యూఢిల్లీ: కొంకణ్ రైల్వే లైన్‌లో శుక్రవారం భారీ ముప్పు తప్పింది. ట్రాక్‌మ్యాన్ మహాదేవ అప్రమత్తత, ధైర్యసాహసాలు ఘోర ప్రమాదాన్ని తప్పించాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, కుమ్టు-హొన్నవర్ స్టేషన్ల మధ్య మహాదేవ రొటీన్ డ్యూటీలో ఉండగా శుక్రవారం తెల్లవారుజాము 4.50 గంటలకు ఓ ట్రాక్ జాయింట్ వెల్డింగ్ అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించారు. ఆ సమయంలో తిరువనంతపురం-ఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ ఈ మార్గంలో వస్తున్నది. దీంతో అప్రమత్తమైన మహాదేవ హుటాహుటిన కుమ్టు స్టేషన్‌ను సంప్రదించారు. అయితే అప్పటికే ఆ రైలు ఆ స్టేషన్‌ను వదిలిపెట్టి, లోపం ఉన్న ప్రమాదకరమైన సెక్షన్ వైపు దూసుకువస్తున్నది. దీంతో మహాదేవ వెనుకడుగు వేయకుండా లోకో పైలట్‌ను నేరుగా సంప్రదించేందుకు ప్రయత్నించారు. కానీ ఆయనతో అనుసంధానం కుదరలేదు. ఇక మహాదేవ ఆలస్యం చేయకుండా పట్టాలపై పరుగు ప్రారంభించారు. అర కిలోమీటరు దూరాన్ని కేవలం ఐదు నిమిషాల్లో పరుగెత్తి జెండా ఊపి రైలు నిలిచిపోయేలా చేశారు. ఆయన ప్రయత్నం ఫలించడంతో ఘోర ప్రమాదం తప్పింది. వెల్డింగ్ వర్క్ పూర్తయిన తర్వాత రాజధాని ఎక్స్‌ప్రెస్ కర్వార్ వైపు ప్రయాణం ప్రారంభించింది. మహాదేవ అప్రమత్తంగా ఉండి, తన ప్రాణాలను పణంగా పెట్టి ఘోర ప్రమాదాన్ని నివారించారని అందరూ ప్రశంసించారు. ఆయన వందలాది మంది ప్రాణాలను కాపాడారని రైల్వే అధికారులు కొనియాడారు. కొంకణ్ రైల్వే జోన్ అధికారులు ఆయనకు రూ.15 వేలు నగదు బహుమతి ఇచ్చి సత్కరించారు.

గాలి స్వచ్ఛతలో నల్గొండకు కేంద్ర అవార్డు

పెద్ద నగరాల్లో సూరత్‌కు ప్రథమ స్థానం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: గాలి నాణ్యత మెరుగుదలలో తెలంగాణలోని నల్గొండ సత్తా చాటింది. జైపూర్‌లో 'స్వచ్ఛమైన గాలి కోసం అంతర్జాతీయ దినోత్సవం'పై జరిగిన జాతీయ వర్క్ షాప్‌లో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ -2024కు సంబంధించి కేంద్ర పర్యావరణ శాఖ జాతీయ పరిశుభ్ర వాయు నగరాల అవార్డులను ప్రకటించింది. మూడు లక్షల కన్నా తక్కువ జనాభా ఉన్న విభాగంలో రాయ్‌బరేలి (యూపీ), నల్గొండ (తెలంగాణ), నలగర్ (హిమాచల్ ప్రదేశ్) తొలి మూడు స్థానాల్లో నిలిచి అవార్డులు కైవసం చేసుకున్నాయి. ఇక 10 లక్షలకు మించి జనాభా ఉన్న నగరాల్లో సూరత్, జబల్‌పూర్, ఆగ్రా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. 3 నుంచి 10 లక్షల జనాభా ఉన్న నగరాల్లో ఫిరోజాబాద్ (యూపీ), అమరావతి (మహారాష్ట్ర), ఝాన్సీ (యూపీ) అగ్ర స్థానంలో నిలిచాయి. గాలి నాణ్యతలో అధిక మెరుగుదల, కాలుష్యాన్ని తగ్గించేందుకు మెకానికల్ స్వీపింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి, డంపింగ్ సైట్‌ల నుంచి పొందిన భూమిని పచ్చని ప్రదేశంగా మార్చడం, చక్కని ట్రాఫిక్ విధానాలను బాగా చేపట్టడం వల్ల ఈ నగరాలు/పట్టణాలను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. 2024 నాటికి కాలుష్యాన్ని 20-30 శాతం తగ్గించాలన్న లక్ష్యంతో భారత్ 2019లో నేషనల్ క్లీన్ ఎయిర్ (ఎన్‌ఏసీపీ) కార్యక్రమాన్ని చేపట్టింది. తర్వాత ఆ లక్ష్యాన్ని సవరిస్తూ దానిని 2026 నాటికి 40 శాతం సాధించాలని నిర్ణయించారు. 2011-2015 మధ్య జాతీయ పరిసర నాణ్యతా ప్రమాణాల్ని అందుకోవడంలో క్రమం తప్పకుండా విఫలమవుతున్న 131నగరాలను దీని పరిధిలోకి తెచ్చారు.

ఆధార్ కోసం ఎన్‌ఆర్‌సీ నెంబర్ తప్పనిసరి

జనాభా కన్నా ఎక్కువ దరఖాస్తులు రావడంతో అస్సాం సర్కార్ నిర్ణయం

గువాహటి: అస్సాంలో కొత్తగా ఆధార్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకునేవారు జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ) దరఖాస్తు రసీదు నెంబర్ (ఏఆర్‌ఎన్)ను సమర్పించాల్సి ఉంటుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెప్పారు. దీనికి సంబంధించిన సవివరమైన ప్రామాణిక కార్యనిర్వహణ విధానాన్ని రూపొందిస్తామని, ఇది వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు. దీనివల్ల విదేశీయులు అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించడం ఆగుతుందని తెలిపారు. ఆధార్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు బార్‌పేట, ధుబ్రి, మోరిగావ్, నాగావూన్ జిల్లాల్లో జనాభాకు మించి ఉన్నాయన్నారు. దీంతో అనుమానాస్పద పౌరులు ఉన్నట్లు అర్థమవుతున్నదని చెప్పారు. ఇతర రాష్ట్రాలు కూడా ఆధార్ జారీలో కఠినంగా వ్యవహరిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐఏఎస్ నుంచి ఖేద్కర్ తొలగింపు

న్యూఢిల్లీ: ఇటీవల వివాదాల్లో చిక్కుకున్న పూజా ఖేద్కర్‌ను ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) నుంచి కేంద్ర ప్రభుత్వం తొలగించింది. తమ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. ఆమె ఎంపికను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఓ నెల క్రితం రద్దు చేసింది. ఓబీసీ, దివ్యాంగుల కోటాలను పూజ అక్రమంగా ఉపయోగించుకున్నట్లు గుర్తించింది. పూజ రెండేళ్ల ప్రొబేషన్ కాలంలో అర్హత లేకున్నా గొంతెమ్మ సదుపాయాలను కోరారు. దీంతో పూణె కలెక్టర్ సుహాస్ దివాసే మహారాష్ట్ర ప్రధాన కార్యదర్శికి నివేదిక పంపించారు. పర్యవసానంగా ఆమె వివాదాల్లో చిక్కుకున్నారు.

కార్గిల్ యుద్ధంలో మా పాత్ర ఉంది

25 ఏండ్ల తర్వాత పాక్ అంగీకారం

ఇస్లామాబాద్, సెప్టెంబర్ 8: కార్గిల్ యుద్ధంలో తమ పాత్ర ఉందని పాకిస్థాన్ సైన్యం అంగీకరించింది. ఈ యుద్ధం జరిగిన 25 ఏండ్ల తర్వాత తొలిసారి పాక్ ఈ విషయంపై స్పందించింది. రక్షణ దినోత్సవాల సందర్భంగా పాక్ సైన్యాధ్యక్షుడు జనరల్ అసిం మునీర్ శనివారం మాట్లాడుతూ, '1948, 1965, 1971లో భారత్-పాక్ యుద్ధాల్లో అయినా, 1999 నాటి కార్గిల్ యుద్ధంలోనైనా వేలాది మంది సైనికులు దేశం కోసం, ఇస్లాం కోసం ప్రాణాలు అర్పించారు' అని అన్నారు. కార్గిల్ యుద్ధంలో పాక్ పాత్రను ఆ దేశం ఇప్పటి వరకు తిరస్కరిస్తూ వచ్చింది. ప్రైవేటు స్వాతంత్ర్య సమర యోధులు మాత్రమే ఈ యుద్ధంలో పాల్గొన్నారని చెప్తూ వచ్చింది.

హసీనాను రప్పించేందుకు చర్యలు

సామూహిక హత్యలకు పాల్పడ్డారన్న తాత్కాలిక ప్రభుత్వం

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను భారత్ నుంచి స్వదేశానికి రప్పించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఆ దేశానికి చెందిన 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్' ఆదివారం ప్రకటించింది. విద్యార్థుల ఆందోళనను అణచివేయడానికి సామూహిక హత్యాకాండకు పాల్పడ్డారని హసీనా సహా పలువురిపై తాత్కాలిక ప్రభుత్వం కేసుల్ని నమోదు చేసింది. వీటి విచారణ కోసం ఆమెను రప్పించేందుకు ప్రయత్నాలు చేపట్టింది. 'హసీనా సహా పరారీలో ఉన్న వారందరికీ అరెస్టు వారెంట్ జారీ చేయాలంటూ ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేయబోతున్నాం. ఇరు దేశాల మధ్య నిందితుల అప్పగింతపై ఒప్పందం ఉంది' అని ట్రిబ్యునల్ చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లామ్ చెప్పారు.

టీఎంసీ ఎంపీ జవహర్ రాజీనామా!

అవినీతిని మమత పట్టించుకోనందుకే

కోల్‌కతా: వైద్యురాలి హత్యాచార ఘటన తృణమూల్ కాంగ్రెస్‌లో ముసలం పుట్టించింది. ఈ ఘటనపై ప్రభుత్వం చాలా ఆలస్యంగా స్పందించడంతో పాటు అరకొరగా చర్యలు తీసుకున్నదని ఆరోపిస్తూ ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జవహర్ సిర్కార్ రాజీనామాకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సీఎం మమతా బెనర్జీకి లేఖ రాశారు. అవినీతి, అస్మదీయుల విషయంలో అధిష్ఠానం పట్టించుకోనట్టు వ్యవహరించడం తనను నిరుత్సాహానికి గురి చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

చిచ్చుపెట్టిన పదవి

కర్ణాటక కాంగ్రెస్‌లో ముదురుతున్న పోరు.. సీఎం కుర్చీ రేసులోకి మరికొందరు నేతలు



శివకుమార్ ఖర్గే

బెంగళూరు, సెప్టెంబర్ 8: కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి చిచ్చు పెట్టింది. ముడా కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకున్నా, అధిష్ఠానమే ఆయనను తప్పించినా తర్వాత ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై పార్టీలో చర్చలు జరుగుతున్నాయి. గవర్నర్ తనపై విచారణకు ఇచ్చిన అనుమతిని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య హైకోర్టులో వేసిన పిటిషన్‌ను విచారణ చేయడానికి కోర్టు అంగీకారం తెలిపింది. ఈ తరుణంలో సీఎం పదవి కోసం మొదలైన రేసులోకి రోజుకో నేత వస్తున్నారు. ఇప్పటివరకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ లేదా హోంమంత్రి పరమేశ్వరలో ఒకరికి సీఎం పదవి దక్కవచ్చని అంతా భావించారు. అయితే, అనూహ్యంగా మంత్రి సతీశ్ జార్కిహోళి బీసీ కోటాలో తెరపైకి వచ్చారు. మరోవైపు కొందరు ఎమ్మెల్యేలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరును అధిష్ఠానానికి సూచించాలని భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

నేతల మధ్య మాటల యుద్ధం

సీఎం పదవికి పోటీ పెరుగుతుండగానే మరోవైపు సీనియర్ మంత్రులు ఎంబీ పాటిల్, శివానంద్ పాటిల్ మధ్య ఇదే విషయమై మాటల యుద్ధం జరిగింది. ఎంబీ పాటిల్ అభ్యర్థిత్వంపై శివానంద్ పాటిల్ స్పందిస్తూ.. 'ఆయన కంటే చాలామంది సీనియర్లు ఉన్నారు, ఆయన ఇంకొన్నాళ్లు వేచి ఉండాలి' అని వ్యాఖ్యానించారు. 'నాకంటే చాలామంది సీనియర్లు ఉన్నారు, అయితే సీనియారిటీ మాత్రమే కొలమానం కాదు' అంటూ ముఖ్యమంత్రి మార్పుపై మంత్రి ఎంబీ పాటిల్ స్పందించారు. మరోవైపు సీనియర్ ఎమ్మెల్యే ఆర్వీ దేశ్‌పాండే సైతం సీఎం కావాలనే తన ఆకాంక్షను బయటపెట్టారు. ఒక వైపు సీఎం పదవి కోసం చాలామంది ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, బయటకు మాత్రం అందరు నేతలు ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగుతారని చెప్తున్నారు.


పార్టీ ప్రచారం కోసం యూట్యూబ్ చానల్

పార్టీ వాణిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సొంత మీడియా ఉండాలని కర్ణాటక కాంగ్రెస్ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో మొదటి దఫాలో ఒక యూట్యూబ్ చానల్ ప్రారంభించబోతున్నది. బీజేపీ నేతలు చరిత్రను వక్రీకరిస్తున్నారని, 50 ఏండ్లుగా కాంగ్రెస్ ఏమీ చేయలేదని చెప్తున్నారని, అందుకే తమ వాణి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యూట్యూబ్ చానల్ ప్రారంభించనున్నట్టు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జీసీ చంద్రశేఖర్ తెలిపారు. రెండో విడతలో ఒక వార్తాపత్రిక ప్రారంభించాలని అనుకుంటున్నట్టు చెప్పారు.

పెండ్లి పేరుతో మోసం.. నేవీ అధికారి అరెస్ట్

నిందితుడు హైదరాబాదీ

కొచ్చి: పంజాబ్ మహిళ ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన రమావత్ సునీల్ నాయక్ (26)ను కేరళ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సునీల్ నాయక్ ఐఎన్‌ఎస్ విక్రాంత్ నౌకలో లెఫ్టినెంట్‌గా పని చేస్తున్నారు. సిమ్లాలో పని చేస్తున్న ఫిర్యాదుదారును రమావత్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకున్నారు. ఆయన పిలుపు మేరకు ఆమె కొచ్చి నగరానికి వచ్చారు. కడవంతరలో ఓ హోటల్‌లో ఆమెకు ఉద్యోగం దొరికింది. అనంతరం వీరిద్దరూ కలిసి ఒకే అద్దె ఇంట్లో నివసించారు. పెండ్లి చేసుకుంటానని చెప్పి, ఆమెతో సునీల్ నాయక్ శారీరక సంబంధం పెట్టుకున్నారు. ఆ తర్వాత కొంత కాలానికి పెండ్లి చేసుకోమని ఆమె పట్టుబట్టేసరికి ఆమెపై సునీల్ నాయక్ భౌతిక దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బీఎన్‌ఎస్ సెక్షన్ 69 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.



మణిపూర్‌లో మళ్లీ హింస

కుకీ మిలిటెంట్ల దాడిలో ఆరుగురు మృతి
యాంటీ-డ్రోన్ వ్యవస్థ ఏర్పాటు



ఇంఫాల్‌లో మూతపడ్డ దుకాణాలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య హింస మళ్లీ చెలరేగింది. బాంబు దాడులు, రాకెట్ లాంచర్లు ప్రయోగిస్తూ మిలిటెంట్ గ్రూపులు రెచ్చిపోతున్నాయి. ఆదివారం ఉదయం జిరిబామ్ జిల్లాలో కుకీ మిలిటెంట్లు జరిపిన కాల్పుల్లో ఆరుగురు చనిపోయారని పోలీసులు తెలిపారు. మిలిటెంట్లు రాకెట్ లాంచర్ దాడిలో శనివారం మోయిరాంగ్ వద్ద ఒక వృద్ధుడు మరణించాడు. హింస నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో భద్రతా వర్గాలు యాంటీ-డ్రోన్ వ్యవస్థను ఏర్పాటుచేశాయి. వివిధ జిల్లాల ఎస్పీలను అలర్ట్ చేశారని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'గ్రామ రక్షక వాలంటీర్లు'గా తమకు తాము ప్రకటించుకున్న మైతీ, కుకీ వర్గాలకు చెందిన గ్రూపులు పరస్పరం కాల్పులు, బాంబు దాడులకు దిగుతున్నాయని, రాజధాని ఇంఫాల్‌కు 229 కిలోమీటర్ల దూరంలో ఉన్న నుంగ్‌చప్పీ గ్రామంపై ఆదివారం కుకీ మిలిటెంట్లు బాంబు దాడులు, కాల్పులకు పాల్పడ్డారని పోలీసులు చెప్పారు. ఘటనాస్థలికి చేరుకుని వెంటనే పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. మిలిటెంట్స్ ఏర్పాటు చేసుకున్న బంకర్లను ధ్వంసం చేశామని పోలీస్ అధికారి కబీబ్ చెప్పారు.

ఇజ్రాయెల్ దాడిలో 61 మంది మృతి

గాజా: ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజాలో మృతుల సంఖ్య 40,939కి చేరుకుంది. హమాస్ ఆరోగ్య శాఖ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గడచిన 48 గంటల్లో ఇజ్రాయెల్ దాడులకు 61 మంది బలైపోయారు. గత ఏడాది అక్టోబరులో ప్రారంభమైన ఈ యుద్ధంలో సుమారు 94,616 మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో అమెరికా (సీఐఏ), బ్రిటన్ (ఎంఐ6) విదేశీ నిఘా సంస్థల అధిపతులు అత్యంత అరుదైన ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. కాల్పుల విరమణకు పిలుపునిచ్చారు.

విద్యార్థులు టాయిలెట్లు

కడిగితే తప్పేంటి?

కర్ణాటక బీజేపీ ఎంపీ గోవింద్ కర్జోల్ వ్యాఖ్యలు
దళిత పిల్లలే చేయాల్సి వస్తుందన్న ఓ విద్యావేత్త



బెంగళూరు, సెప్టెంబర్ 8: విద్యార్థులు బడుల్లో మరుగుదొడ్లు శుభ్రం చేస్తే తప్పేంటని చిత్రదుర్గ బీజేపీ ఎంపీ, కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం గోవింద్ కర్జోల్ ప్రశ్నించారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా తాజాగా ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'విద్యార్థులు మరుగుదొడ్లు శుభ్రం చేస్తే తప్పేంటి? జపాన్‌లో టీచర్లు, విద్యార్థులు ఈ పని చేస్తారు. నేను చదువుకునేటప్పుడు హాస్టల్‌ను ఊడ్చి, కడిగే వాడిని. విద్యార్థులతో ఉపాధ్యాయులు మరుగుదొడ్లు శుభ్రం చేయించే వీడియోలు బయటకు వచ్చినప్పుడు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటారు. విద్యార్థులకు చీపురు ఇవ్వడాన్ని నేరంగా చూస్తున్నారు. అందుకే శుభ్రం చేసే పనిని విద్యార్థులు తక్కువగా చూస్తున్నారు. కాబట్టి, విద్యార్థులకు శుభ్రత గురించి చెప్పడం తప్పని సరి.' అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, శుభ్రతకు సంబంధించిన పనులను విద్యార్థులతో చేయిస్తే వివక్ష లేకుండా, అందరూ రొటేషన్ పద్ధతిలో చేసేలా చూడాలని, ఐదో తరగతి పైన చదువుతున్న వారితోనే ఈ పని చేయించాలని ప్రొఫెసర్ సీతారాము అభిప్రాయపడ్డారు. అయితే, ఎంపీ వ్యాఖ్యలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని, పిల్లలతో మరుగుదొడ్లు శుభ్రం చేయించాలని చెప్పడం సులువే అని, కానీ చివరకు దళిత సామాజిక వర్గానికి చెందిన పిల్లలే ఈ పని చేయాల్సి వస్తుందని విద్యావేత్త నిరంజనారాధ్య పేర్కొన్నారు.

పేదరికాన్ని ఓడించిన సంకల్పం

- నీట్‌లో సత్తా చాటిన ఒడిశా గిరిజన విద్యార్థి
- పుస్తకాలు లేకున్నా స్వయం సాధనతో సీటు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: ఖరీదైన కాలేజీల్లో చదువుతూ కోచింగ్‌కు లక్షలకు లక్షలు ఫీజులు కడుతున్న చాలామందికి ఆ గిరిజన యువకుడు ఆదర్శంగా నిలిచాడు. ఒడిశాలోని కంధమాల్ జిల్లాకు చెందిన సనాతన్ ప్రధాన్‌ది అత్యంత పేద కుటుంబం. పుస్తకాలు కొనుక్కోవడానికి కూడా డబ్బులుండేవి కాదు. ఇక అతడి గ్రామంలో ఇంటర్నెట్ సౌకర్యం లేదు. అలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం డాక్టర్ కావాలన్న తన కలను తొలి ప్రయత్నంలోనే నెరవేర్చుకున్నాడు. ఏటా లక్షలాది మంది హాజరయ్యే జాతీయ వైద్య విద్య అర్హత ప్రవేశ పరీక్ష - నీట్‌లో మంచి ర్యాంకును తెచ్చుకుని ఎంకేసీజీ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీట్ పొందాడు. అతని తండ్రి కనేశ్వర్ ప్రధాని తడిమహ గ్రామంలో చిన్న రైతు. పదో తరగతి వరకు డారింగ్‌బడిలో చదువుకున్న సనాతన్, ఇంటర్‌ను బెర్హంపూర్‌లోని జూనియర్ కాలేజీలో పూర్తి చేశాడు. వైద్య విద్య ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షకు కోచింగ్ తీసుకుందామంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. దీంతో తన ఊరు వచ్చేసి సొంతంగా ప్రిపేరవ్వడం ప్రారంభించాడు. అయితే ఆ గ్రామంలో ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో నాలుగు కి.మీ నడిచి వెళ్లి కొండలపైకి ఎక్కి అక్కడ చదువుకునేవాడు. రోజంతా అక్కడే గడిపేవాడు. చివరకు పరీక్షల ముందు బెర్హంపూర్ వెళ్లి, స్నేహితుల నుంచి పుస్తకాలు తీసుకుని పరీక్షకు సిద్ధమై నీట్‌లో విజయం సాధించాడు. తన సీట్ పొందేందుకు అప్పు చేసి డబ్బును డిపాజిట్ చేసినట్టు సనాతన్ తెలిపాడు. కాగా, సనాతన్‌ను గ్రామస్థులు అభినందనల్లో ముంచెత్తుతున్నారు. ఒడిశాకే చెందిన మరో ఇద్దరు పేద గిరిజన విద్యార్థులు నీట్‌లో మంచి ర్యాంక్ సాధించారు.

నక్సల్స్ ఏరివేతకు 4 వేల మంది

నాలుగు సీఆర్‌పీఎఫ్ బృందాలుగా ఏర్పాటు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: జనజీవనం, రాష్ట్ర అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్‌ను ఏరివేయడానికి కేంద్రం కంకణం కట్టుకుంది. 2026 నాటికి దేశంలో మావోయిస్టుల సమస్య లేకుండా చేయాలని లక్ష్యంగా నిర్ణయించిన కేంద్రం అందులో భాగంగా మావోలపై వ్యూహాత్మకంగా నిర్ణయాత్మక యుద్ధానికి దిగుతున్నది. ఈ క్రమంలో నక్సల్స్ ప్రభావం అధికంగా ఉండే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాకు పెద్దయెత్తున సీఆర్‌పీఎఫ్ బలగాలను తరలిస్తున్నది. 4,000 మంది జవాన్లతో కూడిన నాలుగు బృందాలు నక్సల్స్ ఏరివేతకు ముందుకు కదులుతున్నాయి. వీటిలో మూడు జార్ఖండ్ నుంచి, ఒకటి బీహార్ నుంచి రప్పించారు. ప్రస్తుతం మావోల వేట కొనసాగిస్తున్న బలగాలకు ఇవి అదనం. ఇందులో రెండు బృందాలను దంతెవాడ, సుక్మా జిల్లాల్లో ఏర్పాటు చేశారు. మిగిలిన వారిని ఒడిశా, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను కలిపే మూడు రోడ్ల జంక్షన్లు, ఇతర ప్రదేశాల వద్ద మోహరిస్తారు.

భారత్‌లో ఎంపాక్స్?

అనుమానిత కేసు నమోదు

న్యూఢిల్లీ: ఇప్పటికే ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ప్రాణాంతకమైన మంకీ పాక్స్ (ఎంపాక్స్) లక్షణాలున్న అనుమానిత కేసు భారత్‌లో నమోదైంది. ఓ ఆఫ్రికన్ దేశం నుంచి వచ్చిన ఒక యువకుడిలో వ్యాధి లక్షణాలు కన్పించడంతో వెంటనే అతడిని ఐసోలేషన్‌కు తరలించారు. అతనికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం తెలిపింది. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వ్యాధి సంక్రమణ మూలాలను గుర్తించేందుకు కాంటాక్ట్ ట్రేసింగ్ కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. ఎంపాక్స్‌కు సంబంధించి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆరోగ్య శాఖ తెలిపింది.

రెండుగా విడిపోయిన మగధ్ ఎక్స్‌ప్రెస్

తప్పిన పెను ప్రమాదం

పాట్నా: న్యూఢిల్లీ-ఇస్లాంపూర్ మగధ్ ఎక్స్‌ప్రెస్ కప్లింగ్ ఊడిపోవడంతో రైలు రెండు భాగాలుగా విడిపోయింది. బీహార్‌లోని బక్సర్ జిల్లా, ట్వినిగంజ్-రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం 11.08 గంటలకు ఈ సంఘటన జరిగింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని తూర్పు మధ్య రైల్వే సీపీఆర్‌ఓ సరస్వతి చంద్ర చెప్పారు. ఎస్-6, ఎస్-7 బోగీలను కలుపుతున్న కప్లింగ్ ఊడిపోవడంతో, 14 బోగీలు ఒకవైపు, 13 బోగీలు మరోవైపు విడిపోయినట్లు తెలిపారు. ఫలితంగా డౌన్ లైన్‌లో ట్రైన్ ట్రాఫిక్‌కు కాసేపు అంతరాయం కలిగిందన్నారు.

వృద్ధుడి పిత్తాశయంలో 6,110 రాళ్ల తొలగింపు

కోట: రాజస్థాన్‌లోని కోటాలో 70 ఏళ్ల వృద్ధుడి పిత్తాశయంలోని 6,110 రాళ్లను వైద్యులు తొలగించారు. లాప్రోస్కోపిక్ సర్జన్ దినేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, బుండి జిల్లావాసి అయిన ఈ వృద్ధుడు కొద్ది రోజుల నుంచి కడుపు నొప్పి, ఉబ్బరం, వాంతులతో బాధ పడుతున్నారు. దినేశ్ నేతృత్వంలోని వైద్య బృందం సోనోగ్రఫీ చేయగా ఆయన పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు తెలిసింది. వెంటనే ఈ నెల 5న అరగంటకుపైగా శ్రమించి ఆ రాళ్లను తొలగించారు.



సునీత లేకుండా స్టార్‌లైనర్ వెనక్కి

వాషింగ్టన్, సెప్టెంబర్ 8: సునీతా విలియమ్స్, బచ్ విల్‌మోర్‌లను ఐఎస్‌ఎస్ (అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం) వద్దే వదిలేసి బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక భూమిపైకి చేరుకుంది. వ్యోమగాములు లేని ఖాళీ స్పేస్‌క్రాఫ్ట్ గత శుక్రవారం న్యూమెక్సికోలో దిగింది. బోయింగ్ సంస్థ ఈ ఏడాది జూన్‌లో చేపట్టిన స్టార్‌లైనర్ స్పేస్ మిషన్ ద్వారా వ్యోమగాములు సునీతా విలియమ్స్, విల్‌మోర్ ఐఎస్‌ఎస్‌కు చేరుకున్నారు. అయితే తిరుగు ప్రయాణానికి సంబంధించి సాంకేతిక లోపం తలెత్తటంతో, విల్‌మోర్, సునీతా విలియమ్స్ ఐఎస్‌ఎస్ వద్దే ఉండిపోవాల్సి వచ్చింది. సెప్టెంబర్‌లో 'నాసా' స్పేస్ ఎక్స్‌కు చెందిన 'డ్రాగన్' రాకెట్‌ను పంపేందుకు సిద్ధమవుతున్నది. ఫిబ్రవరిలో చేపట్టే తిరుగు ప్రయాణంలో సునీతా విలియమ్స్, విల్‌మోర్ భూమి మీదకు చేరుకుంటారని తెలిసింది.



చైనా పశువుల కొట్టాల్లో 125 వైరస్‌లు

స్టాక్‌హోమ్: చైనాలోని పశువుల కొట్టాల్లో పెద్ద సంఖ్యలో వైరస్‌లు ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఉన్ని కోసం పెంచే జంతువుల్లో వైరస్‌ల జాడను కనుగొన్నారు. స్వీడన్‌కు చెందిన పరిశోధకులు 2021 నుంచి 2024 మధ్య చైనాలో మరణించిన 461 జంతువుల నుంచి నమూనాలు సేకరించి, జన్యుపరమైన అధ్యయనం చేశారు. వీటిల్లో 412 జంతువులు పశువుల కొట్టాల్లో ఉన్ని ఉత్పత్తి కోసం పెంచేవి. ఈ జంతువుల్లో 125 రకాల వైరస్‌లను పరిశోధకులు గుర్తించారు. వీటిల్లో 36 వైరస్‌లు కొత్త రకమైనవి. మరో 39 వైరస్‌లు ఇతర జంతువులు, మనుషులకు సోకగలిగే ముప్పు ఉన్నవి. వీటిల్లోనూ 13 వైరస్‌లు ప్రమాదకరమైనవని పరిశోధకులు తెలిపారు. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

'యూట్యూబ్' ఆపరేషన్‌కు బాలుడి బలి!

నకిలీ వైద్యంతో మృతి



నకిలీ వైద్యుడు ఆపరేషన్ చేసిన దవాఖాన

పాట్నా, సెప్టెంబర్ 8: బీహార్‌లోని సరన్‌లో అజిత్‌కుమార్ పురి అనే ఓ నకిలీ వైద్యుడు కృష్ణకుమార్ (15) అనే బాలుడి ప్రాణాలను హరించాడు. ఆ బాలుడి పిత్తాశయం నుంచి రాయిని తొలగించేందుకు సదరు 'వైద్యుడు' యూట్యూబ్‌లోని వీడియోలపై ఆధారపడి శస్త్రచికిత్స చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. ఈ ఆపరేషన్ వల్ల కృష్ణకుమార్ ఆరోగ్య పరిస్థితి విషయమించడంతో ఆ నకిలీ వైద్యుడు ఓ అంబులెన్స్ ద్వారా అతడిని రాష్ట్ర రాజధాని పాట్నాలోని ఓ దవాఖానకు తరలించేందుకు ప్రయత్నించాడని, ఈ క్రమంలో కృష్ణకుమార్ దారి మధ్యలోనే మరణించాడని అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని హాస్పిటల్ వద్ద వదిలేసి ఆ వైద్యునితోపాటు అతని వెంట ఉన్నవారు పరారయ్యారని వాపోయారు. అంతకుముందు కృష్ణకుమార్‌కు పలుమార్లు వాంతులు కావడంతో సరన్‌లోని గణపతి హాస్పిటల్‌లో చేర్చామని, ఆ తర్వాత కొద్దిసేపటికే వాంతులు ఆగిపోయినప్పటికీ కృష్ణకుమార్‌కు వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పిన అజిత్‌కుమార్ పురి.. యూట్యూబ్‌లోని వీడియోలను చూస్తూ శస్త్రచికిత్స చేయడంతో తన కుమారుడు మృతి చెందాడని బాధితుడి తండ్రి చందన్ షా తెలిపారు. ఆ 'డాక్టర్' తనకు తానుగా వైద్యుడినని చెప్పుకుంటున్నట్టు అనిపిస్తున్నదని, ఆయనకు సరైన అర్హతలు ఉన్నాయో లేవో తమకు తెలియదని కృష్ణకుమార్ కుటుంబసభ్యులు చెప్పారు.



ఐఫోన్ నమూనాతో గిన్నిస్ రికార్డ్

లండన్: టాప్ ఎండ్ యాపిల్ ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్ 6.7 అంగుళాల స్క్రీన్‌తో అందర్నీ ఆకట్టుకుంటున్నది. అయితే దీనిని పోలిన 6.74 అడుగుల పొడవైన నమూనాను భారత సంతతి యూట్యూబర్, టెక్ కంటెంట్ క్రియేటర్ అరుణ్ మైనీ రూపొందించారు. గ్యాడ్జెట్ స్పెషలిస్ట్ మాథ్యూ పెర్క్స్ సహకారంతో దీనిని తయారు చేశారు. దీనిలో భారీ కెమెరాలు అమర్చారు. దీనిలోని గేమింగ్ యాప్‌లను ఉపయోగించుకోవడానికి వీలుగా తయారు చేశారు. దీనిని స్టాండ్‌పై అమర్చి, వీధుల్లోకి తీసుకెళ్లినపుడు, చూసినవారంతా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఐఫోన్ ప్రతిరూపంగా దీనికి గిన్నిస్ ప్రపంచ రికార్డు లభించింది. బ్రిటన్‌లో ఉంటున్న అరుణ్ టెక్నాలజీ సమాచారాన్ని 'మిస్టర్‌హూజ్‌దబాస్' యూట్యూబ్ చానల్ ద్వారా అందిస్తూ ఉంటారు.



జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు భూమి స్వాధీన పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఫోర్త్‌సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

- ఫ్యూచర్ సిటీలో భాగస్వాములను చేస్తాం
- కొందరు జర్నలిస్టుల తీరుతో అందరికీ చెడ్డపేరు
- పేట్‌బషీర్‌బాగ్‌లో కేటాయించిన 38 ఎకరాల భూమి జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): త్వరలో నిర్మించనున్న ఫోర్త్‌సిటీలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లస్థలాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇండ్ల స్థలాల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని కోరారు. అర్హులైన వారిని ఫ్యూచర్‌సిటీలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఆదివారం ఆయన రవీంద్రభారతిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జేహెచ్‌ఎస్)కు భూమి స్వాధీన పత్రాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజానికి చికిత్స చేసే డాక్టర్లు అనే భావనతో వారి సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇండ్ల స్థలాలు కేటాయించారని గుర్తుచేస్తూ.. ఇప్పుడు ఆ స్థలాలను తమ చేతుల మీదుగా అందజేయడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు కూడా ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు తగిన నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి ఎలాంటి శషభిషలూ లేవని తెలిపారు.

వృత్తిపరమైన గౌరవాన్ని మనమే పెంచుకోవాలి

వృత్తిపరమైన గౌరవాన్ని ఎవరూ పెంచరని, తమకు తామే పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్బోధించారు. కొందరు చేసే పనులతో జర్నలిస్టులందరికీ చెడ్డపేరు వస్తున్నదని, అలాంటి వారిని నియంత్రించే బాధ్యత జర్నలిస్టులపైనే ఉన్నదని వ్యాఖ్యానించారు.

మీడియా అకాడమీకి 10 కోట్లు

ఆరోగ్య భద్రత కార్డులు, అక్రిడిటేషన్, ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మీడియా అకాడమీ కొత్త విధివిధానాలను రూపొందించాలని సీఎం సూచించారు. మీడియా అకాడమీకి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.10 కోట్లు ఇస్తున్నట్టు సీఎం ప్రకటించారు. ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ నిర్మాణంలో భాగస్వాములమవుదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చనిపోయి న 41 మంది జర్నలిస్టుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెక్కును సీఎం అందజేశారు. అనంతరం జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు పేట్‌బషీర్‌బాగ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కేటాయించిన 38 ఎకరాల భూమి స్వాధీనపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ పాల్గొన్నారు.

పచ్చటాకుపై కాలుష్యం పడగ!

- ఇప్పటికే పొల్యూషన్ కోరల్లో విలవిల్లాడుతున్న సంగారెడ్డి ప్రాంతం
- కాలుష్య జలాలు తాగి మృత్యువాత పడుతున్న బర్రెలు, చేపలు
- న్యాల్‌కల్‌కు ఫార్మాసిటీ రాకతో మరింత పొంచి ఉన్న ప్రమాదం
- మాయం కానున్న కొండలు, దర్గాలు, ఆలయాలు
- ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలని సూచిస్తున్న స్థానికులు
- లేదంటే పోరాటాలు తప్పవని హెచ్చరిక



మంచిగా పంటలు పండుతున్న తమ భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని దేవుడిని వేడుకుంటూ సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో గ్రామదేవతలకు పూజలు చేస్తున్న ఫార్మాసిటీ భూబాధితులు, గ్రామస్థులు (ఫైల్)

సంగారెడ్డి సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీ వల్ల తమ ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతుందని, అది తమ జీవితాలను బలితీసుకుంటుందన్న ఆందోళన స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతున్నది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే అనేక కాలుష్యకారక పరిశ్రమలు ఉన్నాయి. దక్షిణాసియాలోనే అదిపెద్ద పారిశ్రామికవాడ సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులోనే ఉన్నది. ఇప్పటికే పటాన్‌చెరు, పాశమైలారం, కాజీపల్లి, గడ్డపోతారం, ఐడీఏ బొల్లారం, సంగారెడ్డి పారిశ్రామికవాడల్లో సుమారు 200 ఫార్మా కంపెనీలు ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా 11 బడా ఫార్మా కంపెనీలు సంగారెడ్డిలో ఉన్నాయి. ఇప్పటికే ఫార్మా కంపెనీల నుంచి వచ్చే కాలుష్యంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిన్నారంలో ఫార్మా కంపెనీల నుంచి వచ్చిన కాలుష్య జలాలు తాగి బర్రెలు చనిపోతున్నాయి. ఇటీవల చిట్కుల్‌లోని చెరువులో చేపలు మృత్యువాతపడ్డాయి. ఇక్కడి ఫార్మా కంపెనీలు, ఇతర పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నది. దీంతో జిల్లాలో నెలకొన్న ఫార్మా కంపెనీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇలాంటి సమయంలో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో మరో ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలన్న నిర్ణయంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పచ్చని పొలాలకు నెలవుగా ఉన్న న్యాల్‌కల్‌లోని మాడ్గి, డప్పూరు, వడ్డి గ్రామాల పరిధిలోని సుమారు రెండు వేల ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ కారణంగా ఆయా గ్రామాలపై కాలుష్యం పడగ పొంచి ఉన్నది. ఫార్మా కంపెనీల నుంచి వెలువడే కాలుష్యంతో డప్పూరు, వడ్డీ, మాల్గి తదితర గ్రామాల్లో జ ల, వాయు కాలుష్యం సమస్యలు తలెత్తడమే కాకుండా భూగర్భ జలాలు సైతం కాలుష్యంగా మా రి విషతుల్యంగా మారే ప్రమాదం పొంచి ఉన్నది. వడ్డి గ్రామం నుంచి పారే న్యాల్‌కల్‌వాగు, పెద్దవాగు, శాకవాగులు చినిగేపల్లి ప్రాజెక్టులో కలుస్తాయి. చినిగేపల్లి ప్రాజెక్ట్‌లోని నీరు చాల్కి మీదుగా మంజీరా నదిలో కలుస్తుంది. ఫార్మా కంపెనీల నుంచి వెలువడే కాలుష్యంతో మంజీరా నది జలాలు కూడా కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉన్నది. మంజీరా నదీ జలాలను సంగారెడ్డి జిల్లా ప్రజలు తాగడంతోపాటు సాగు నీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. మంజీరా నది కాలుష్యం కోరల్లో చిక్కుకుంటే వేల కుటుంబాలపై దాని దుష్ప్రభావం పడుతుందనే ఆం దోళన వ్యక్తమవుతున్నది. దీంతో ఫార్మాసి టీ ఏ ర్పాటు నిర్ణయాన్ని రద్దు చేయాలని న్యాల్‌కల్ ప్ర జలు, రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

కొండలు.. ఆలయాలు మాయమే!

న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తే డప్పూరు, మాడ్గి, మాల్గి శివారులో ఉన్న కొండలు మాయం కానున్నాయి. ఫార్మాసిటీ కోసం సేకరించనున్న 1,983 ఎకరాల భూముల్లో డప్పూరు, మాడ్గి, మాల్గి శివారుల్లో ఖనిజాలతో ఉన్న కొండలు ఉన్నాయి. ఫార్మాసిటీ ఏర్పాటుతో ఖనిజాలు ఉన్న ఈ కొండలు మాయం కానున్నాయి. కొండలపై ఉన్న ఆలయాలు కనుమరుగు ప్రమాదం ఉన్నది. కొండల పైన నవనాథ్ సిద్ధలింగేశ్వరస్వామి, మల్లన్నస్వామి ఆలయాలతోపాటు ఇదే ప్రాంతంలో పీర్‌గైబ్‌సాహెబ్ దర్గా ఉన్నాయి. న్యాల్‌కల్, జహీరాబాద్ ప్రాంత భక్తులతోపాటు బీదర్‌కు చెందిన భక్తులు ఆలయాలు, దర్గాల సందర్శనకు వస్తారు. ఫార్మాసిటీ ఏర్పాటు కోసం కొండలు ఉన్న భూములను సేకరిస్తుండటంతో ఆయా ఆలయాలు, దర్గాలను దర్శించుకునే భక్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఫార్మాసిటీ కోసం ఆలయాలు, దర్గాలను తొలగించడం మంచిది కాదని హితవు చెప్తున్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.5°c	24.3°c
మెదక్	31.6°c	21.9°c
నిజామాబాద్	31.2°c	23.5°c
మహబూబ్‌నగర్	29.1°c	23.4°c
కరీంనగర్	29.0°c	24.0°c
నల్లగొండ	29.0°c	23.0°c
హైదరాబాద్	28.5°c	23.4°c
రంగారెడ్డి	28.2°c	20.2°c
ఖమ్మం	28.0°c	26.0°c
వరంగల్	28.0°c	24.0°c



48 గంటల్లో భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో వాయుగుండం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిందని, రాగల 48 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా తెలంగాణలో వచ్చే మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురియవచ్చని, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఏపీలో సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలపై ప్రభావం ఉంటుందని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. సోమవారం ఏలూరు, అల్లూరి, ఉభయ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడుతాయని వివరించారు.

కార్పొరేషన్లుగా 8 ఫెడరేషన్లు

ప్రభుత్వానికి బీసీ సంక్షేమశాఖ ప్రతిపాదనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ పరిధిలోని 8 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని ఆ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా ముదిరాజ్, యాదవ కుర్మ, మున్నూరు కాపు, పద్మశాలి, పెరిక (పురగిరి క్షత్రియ), లింగాయత్, మేర, గంగపుత్ర కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదే విధంగా గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, సగర (ఉప్పర) వాల్మీకి బోయ, కృష్ణబలిజ, భట్రాజు, కుమ్మరి ఫెడరేషన్లను కో-ఆపరేటివ్ కార్పొరేషన్లుగా మార్చాలని తాజాగా నిర్ణయించారు. ఒక్కో కార్పొరేషన్‌కు ఎండీ, ఫైనాన్స్ మేనేజర్, ముగ్గురు సూపరింటెండెంట్లు, ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు కలిపి 38 మంది చొప్పున సిబ్బంది అవసరమవుతారని ప్రభుత్వానికి బీసీ సంక్షేమశాఖ ప్రతిపాదనలు పంపినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. కానీ, ఇప్పటికే ఉన్న ఫెడరేషన్లకే పూర్తిస్థాయిలో ఎండీలు లేరు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న ఏడీలు, జేడీలే ఒక్కొక్కరు అదనంగా రెండేసి ఫెడరేషన్ల బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు.

మా ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారు?

- ఏడేండ్లుగా కొనసాగుతున్న భర్తీ ప్రక్రియ
- తుది ఫలితాల విడుదలపై స్పష్టత కరువు
- మానసిక ఒత్తిడిలో పీఈటీ అభ్యర్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): ఉద్యోగాల కోసం ఏడేండ్లుగా ఎదురుచూస్తున్న గురుకుల పీఈటీ అభ్యర్థుల భవిష్యత్తు రోజురోజుకు అయోమయంలో పడుతున్నది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ముగిసినప్పటికీ తుది ఫలితాలు ఇవ్వడంలో టీజీపీఎస్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ఇటు ఉద్యోగ తుది ఫలితాలు రాక, అటు వేరే ఉద్యోగ అవకాశాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నట్టు బాధిత అభ్యర్థులు వాపోతున్నారు. సీఎం కేసీఆర్ హయాంలో సంక్షేమ శాఖ గురుకులాల్లో 616 పీఈటీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇంటర్మీడియట్‌తో పాటు డిగ్రీ(డిప్లొమా ప్లస్ బీపీఈడీ) వంటి విద్యార్థులు ఉండాలని నిర్ణయించారు. 16,000 మంది పరీక్షలకు హాజరయ్యారు. 1:2 నిష్పత్తి ప్రకారం ఫలితాలు విడుదల చేశారు. 2018 మే 10న 1,232మందిని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారు. 600మందికి వెరిఫికేషన్ కూడా ముగిసింది. అయితే ఇక్కడే అసలు సమస్య తెరపైకి వచ్చింది. పీఈటీ పోస్టుల భర్తీ అంశంపై డిప్లొమా అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తామే అర్హులమంటూ కోర్టు నుంచి స్టే తెచ్చారు. దీంతో 2018 మే 20న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను టీజీపీఎస్సీ అర్థాంతరంగా నిలిపివేసింది. ప్రభుత్వం, బీపీఈడీ అభ్యర్థులు హైకోర్టులో కేసు వేశారు. గత ఏడాది ఫిబ్రవరి 12న అందరికీ న్యాయం చేయాలని హైకోర్టు స్పష్టంచేసింది. అలాగే ఎంపికైన వారికి కూడా రెండు వారాల్లో పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. దీంతో మే 24 మళ్లీ జీఆర్‌ఎల్ విడుదల చేశారు. 1:2 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను పిలిచారు. మే 29 నుంచి జూన్ 4 వరకు 1,185 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అయితే కొందరు వేరే ఉద్యోగాలకు వెళ్లిపోవడంతో చాలా మంది డ్రాప్ అయ్యారు. దీంతో ఆ కింద ఉన్న అభ్యర్థులకు అంటే మరోసారి జూలై 4 నుంచి 11వరకు 1,086 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. అయితే తుది ఫలితాలు మాత్రం ఇవ్వడం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఎమ్మెల్యేల అనర్హతపై నేడుతీర్పు

గత నెలలోనే హైకోర్టులో ముగిసిన వాదనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించనున్నది. ఇరుపక్షాల వాదనలు గత నెల 7వ తేదీన పూర్తయ్యాయి. తీర్పును తర్వాత వెలువరిస్తామని హైకోర్టు అప్పట్లోనే ప్రకటించింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గత ఏప్రిల్ 24న దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు లోతుగా విచారించింది. బీఆర్‌ఎస్ తరపున గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద పిటిషన దాఖలు చేయగా, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మరొకరు పిటిషన్ దాఖలు చేశారు. ఆయా వ్యాజ్యాలపై వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వు చేసింది.

స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చు

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన చట్టసభ సభ్యులపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌ను శాసనసభ స్పీకర్ విచారణ చేయకుండా కాలయాపన చేస్తుంటే.. ఆ వ్యవహారంపై హైకోర్టు/సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష చేయొచ్చని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం వాదించారు. ఇటీవల కేశమ్ మెఘాచంద్ కేసులో పదో షెడ్యూల్ లక్ష్యం దెబ్బతినకూడదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని, స్పీకర్ కార్యాలయానికి నోటీసులు ఇచ్చిందని గుర్తుచేశారు. రాజేంద్రసింగ్ రాణా, కిహోటా హోలా కేసుల్లో సుప్రీంకోర్టు వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం స్పీకర్‌కు హైకోర్టు/సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేయొచ్చని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్పీకర్‌కు ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మార్చిలో స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తే ఫలితం లేకపోయిందని, మూడు నెలల గరిష్ఠ గడువు ముగిసినందున మరో నాలుగు వారాలు స్పీకర్ సమయం తీసుకునేలా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేలా స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయొచ్చని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరపు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదించారు. నిర్దిష్ట గడువులోగా స్పీకర్ తమ ముందున్న పార్టీ ఫిరాయింపు పిటిషన్లపై తుది నిర్ణయం తీసుకోవాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలుచేయాలని కోరారు. మణిపూర్ ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని 142 అధికరణం కింద స్పీకర్‌కు నోటీసులు జారీ చేసిందని వివరించారు. పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయవని, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో పిటిషన్లను విచారణ చేస్తారని చెప్పారు. ట్రిబ్యునల్ చైర్మన్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయవచ్చునని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై స్పీకర్ చర్యలు తీసుకోకుండా ఉంటే ప్రజాస్వామ్యానికి అర్థమే లేకుండా పోతుందని వివరించారు. న్యాయ శాఖ తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌కు కోర్టులు నోటీసులు జారీ చేయడానికి వీల్లేదని, స్పీకర్ నిర్ణయం తీసుకున్నాక దానిపై న్యాయ సమీక్షకు వీలున్నదని వాదించారు. దానం, కడియం తరపున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, జంధ్యాల రవిశంకర్ వాదించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు వెలువరించనున్న తీర్పుపై రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొన్నది.

పదేండ్లు అభివృద్ధి పరుగులు

మొదటిపేజీ తరువాయి...

వెల్లడించింది. ఈ నెల 5న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన 'గ్లోబల్ ఏఐ సమ్మిట్'లో రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ గ్రోత్ స్టోరీ' పేరుతో ఓ నివేదిక విడుదలచేసింది. స్వరాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు తెలంగాణ సాధించిన ప్రగతిని ఆ నివేదికలో వివరించింది. 2014 నుంచి తెలంగాణలో ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలు గణనీయ వృద్ధి సాధించాయని పేర్కొన్నది. ముఖ్యంగా వ్యవసాయ రంగం గణనీయ వృద్ధిని సాధించిందని, పారిశ్రామిక రంగం పరుగులు పెట్టిందని, సేవల రంగంలో తెలంగాణ దేశానికే రాజధానిగా మారిందని స్పష్టం చేసింది.

స్థిరంగా ఆర్థిక వృద్ధి

తెలంగాణ ఏర్పటినప్పటి నుంచి ఆర్థికంగా స్థిరమైన వృద్ధిని సాధించినట్టు రేవంత్‌రెడ్డి సర్కారు తెలిపింది. 2015లో 50 బిలియన్ డాలర్లకు దిగువన ఉన్న రాష్ట్ర సంపద (జీఎస్డీపీ).. 2024 నాటికి 194 బిలియన్ డాలర్లకు చేరుకున్నదని, ఈ పదేండ్లలో సగటున 12.5% వృద్ధిరేటును నమోదు చేసిందని వెల్లడించింది. కొవిడ్ వల్ల ప్రభావిత సంవత్సరాలను పక్కనపెడితే తెలంగాణ ఆర్థిక వృద్ధి 14% మేరకు ఉంటుందని స్పష్టం చేసింది.

సాగు రూపురేఖలు మారాయి

బీఆర్‌ఎస్ పాలనలో వ్యవసాయరంగం రూపురేఖలు మారిపోయాయని 'గ్రోత్ స్టోరీ'లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెల్లడించింది. 2014 నాటికి తెలంగాణలో 1.3 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం 2021-23 నాటికి 2.3 కోట్ల ఎకరాలకు పెరిగినట్టు ప్రకటించింది. తద్వారా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం ఎనిమిదేండ్లలోనే కోటి ఎకరాలు పెరిగినట్టు అంగీకరించింది. ఇదే సమయంలో ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నుల నుంచి 2.5 కోట్ల టన్నులకు, మొత్తం వ్యవసాయ ఉత్పత్తులు 3.5 కోట్ల టన్నులకు పెరిగినట్టు స్పష్టంచేసింది. 11వ అగ్రికల్చర్ సెన్సస్ ప్రకారం 2021-22 నాటికే తెలంగాణ వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తుల ఎగుమతుల విలువ 808 మిలియన్ డాలర్లుగా ఉన్నట్టు వెల్లడించింది. ప్రాథమిక రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతి పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షించిందని, 2023 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఫుడ్ కాంక్లేవ్'లో 886 మిలియన్ డాలర్ల పెట్టుబడులు రావడంతోపాటు దాదాపు 58 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా ఒప్పందాలు జరిగాయని పేర్కొన్నది. ఇక మసాలా దినుసులు, గుడ్ల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో, మాంసం ఉత్పత్తిలో ఐదోస్థానంలో నిలిచినట్టు ఆ నివేదిక పేర్కొన్నది.

సేవల రంగమే మూలస్తంభం

స్వరాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ ఆర్థికాభివృద్ధికి సేవల రంగం మూల స్తంభంగా నిలిచిందని, గ్రాస్ స్టేట్ వ్యాల్యూ యాడెడ్ (జీఎస్‌వీఏ)లో ఈ రంగం వాటా 60 శాతానికిపైగా ఉన్నదని రేవంత్‌రెడ్డి సర్కారు వెల్లడించింది. ఇందులో ఐటీ, ఇతర ప్రొఫెషనల్ సేవలు, వాణిజ్యం, హాస్పిటాలిటీ (ఆతిథ్య) తదితర రంగాలు ప్రముఖ పాత్ర పోషించాయని తెలిపింది. ముఖ్యంగా ఐటీ రంగం గణనీయ వృద్ధి సాధించిందని, 2018-19 ఆర్థిక సంవత్సరంలో 13 బిలియన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ ఐటీ ఎగుమతులు 2022-23 నాటికి 29 బిలియన్ డాలర్లకు పెరిగాయని స్పష్టం చేసింది. దేశ ఐటీ ఎగుమతుల్లో 2018 నాటికి 10 శాతంగా ఉన్న తెలంగాణ వాటా నిరుడు 15 శాతానికి చేరినట్టు ప్రకటించింది. దేశంలో స్టార్టప్‌లకు తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారుతున్నదని, 2014-23 మధ్య కాలంలో రాష్ట్రంలోని స్టార్టప్‌లు 260 కోట్ల డాలర్ల పెట్టుబడులను సాధించాయని కొనియాడింది. రాష్ట్రంలో ప్రారంభమైన స్టార్టప్‌లలో 2 యూనికార్న్ స్టార్టప్‌లు ఉన్నట్టు పేర్కొన్నది.

ఉత్పత్తి రంగంలోనూ మేటి

ఉత్పత్తి రంగంలోనూ తెలంగాణ మేటిగా నిలిచినట్టు 'గ్రోత్ స్టోరీ' నివేదిక స్పష్టం చేసింది. ప్రధానంగా ఫార్మారంగం గణనీయ ప్రగతిని నమోదు చేసినట్టు వెల్లడించింది. కొత్త ఉద్యోగాల కల్పనలో ఈ రంగానిదే అగ్రస్థానమని పేర్కొన్నది. 2021-22లో రాష్ట్రం లో మొత్తంగా కల్పించిన కొత్త ఉద్యోగాల్లో 37 శాతం వాటా ఫార్మా రంగానిదేనని తెలిపింది. దేశ ఔషధ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 16 శాతంగా ఉన్నదని ప్రకటించింది. సెమీకండక్టర్ల ఉత్పత్తిలో కర్ణాటక తర్వాత తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్టు వెల్లడించింది. ఏరోస్పేస్ రంగంలోనూ తెలంగాణ పరుగులు తీస్తున్నదని, 2020-21లో ఎఫ్‌డీఐ ఏరోస్పేస్ సిటీస్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నది. టాటా, కల్యాణీ గ్రూపుల్లాంటి దేశీయ దిగ్గజాలతోపాటు లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్ వంటి అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాయని తెలిపింది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కూడా జోరుగా ముందుకు సాగుతున్నట్టు రేవంత్‌రెడ్డి సర్కారు వెల్లడించింది. సీబీఆర్‌ఈ నివేదిక ప్రకారం ఆఫీస్ స్పేస్ లీజులో కర్ణాటక తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందని పేర్కొంది.

పాడిరైతుల నిరసన



పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండలోని జాతీయ రహదారిపై పాడి రైతులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. పెండింగ్ బిల్లులు మొత్తం ఒకేసారి ఖాతాలో జమ చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గిరినాయక్ హెచ్చరించారు. - ఊర్కొండ

సీఎం సహాయనిధికి పలువురి విరాళం

హైదరాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): సీఎం సహాయ నిధికి వరద విరాళాలు భారీగా వస్తున్నాయి. శని,ఆదివారాల్లో పలువురు ప్రముఖులు, పలు కంపెనీలకు చెందిన పెద్దలు సీఎం రేవంత్‌రెడ్డిని నేరుగా కలిసి విరాళాలు అందజేశారు. కాగా, వినాయకచవితి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, కుటుంబసభ్యులు, టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ దంపతులు వినాయకపూజలో పాల్గొన్నా రు. అనంతరం వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

విరాళాలు ఇచ్చిన వారిలో..

- ప్రముఖ వ్యాపారవేత్త రవి రహేజా - రూ.5 కోట్లు విరాళం అందజేత
- ప్రముఖ వ్యాపారవేత్త జీవీకే రెడ్డి - రూ. 5 కోట్లు
- కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ ఎండీ నర్సింహారెడ్డి, ఈడీ జలంధర్‌రెడ్డి - రూ.2కోట్లు
- వీఐటీ ఫౌండర్ అండ్ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ - రూ.1.50 కోట్లు
- క్రెడాయ్ ప్రతినిధులు - రూ.కోటి
- నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎండీ రంగరాజు, డైరెక్టర్ సూర్య - రూ.కోటి

అవినీతిపరులపై ఏసీబీ ఉక్కుపాదం

- 8 నెలల్లోనే 145 కేసులు నమోదు
- అకస్మాత్తుగా డీజీ సీవీ ఆనంద్ బదిలీ
- మళ్లీ హైదరాబాద్ సీపీగా నియామకం


హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అవినీతిపరులపై ఏసీబీ ఉక్కుపాదం మోపుతున్నది. గత 8 నెలల్లోనే ఏకంగా 145 కేసులు నమోదు చేసింది. ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అవినీతి నిరోధక శాఖ పనితీరులో వేగం పెంచడమే ఇందుకు కారణం. దీంతో గత ఐదేండ్లలో ఏటా కనీసం రెండంకెలు కూడా దాటని అవినీతి కేసుల సంఖ్య ఈ ఏడాది తొలి 8 నెలల్లోనే మూడెంకలకు చేరింది. అత్యధికంగా హోంశాఖలో 21 మంది, మున్సిపల్ శాఖలో 18, రెవెన్యూ శాఖలో 13 మంది అధికారులు అవినీతి కేసుల్లో అరెస్టయ్యారు. మొత్తంగా 148 కేసుల్లో 229 మందిని ప్రాసిక్యూట్ చేసేందుకు ప్రభుత్వానికి ఏసీబీ నివేదిక పంపగా.. 72 కేసుల్లో 86 మందిని ప్రాసిక్యూట్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది 10 కేసుల్లో అవినీతి అధికారులకు కోర్టులు శిక్షలు ఖరారు చేశాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని 5 ఏసీబీ ప్రత్యేక కోర్టుల్లో 2 పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా.. మిగిలిన 3 కోర్టులు ఇంచార్జిలతో నడుస్తున్నాయి. ఈ కోర్టుల్లో మొత్తం 105 కేసులు విచారణలో, మరో 980 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఏసీబీ అంటేనే అవినీతిపరులకు ముచ్చెమటలు పడుతున్నాయి. సీవీ ఆనంద్ చేపట్టిన చర్యలకు భయపడి కొందరు అధికారులు ఇప్పటివరకు లంచాల రూపంలో స్వీకరించిన సొమ్మును తిరిగి బాధితులకు ఇచ్చేస్తున్నారు. అవినీతికి పాల్పడే అధికారులపై ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని ప్రజల్లో నమ్మకం పెరుగుతున్న క్రమంలో ఆకస్మాత్తుగా వినాయ చవితి రోజున ప్రభుత్వం సీవీ ఆనంద్‌ను ఏసీబీ నుంచి బదిలీ చేసింది. ఆయనను తిరిగి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా పనిచేసిన కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా బదిలీ చేసింది. ఈ బదిలీలు రాష్ట్ర ప్రజలతోపాటు పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కాగా ఏసీబీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా విజయ్‌కుమార్ ఐపీఎస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

2020 నుంచి గతనెల వరకు నమోదైన ఏసీబీ కేసులు

సంవత్సరం	ట్రాప్ (రెడ్ హ్యాండెడ్)	ఆదాయానికి మించిన ఆస్తులు	క్రిమినల్ మిస్ కండక్ట్ కేసులు	రెగ్యులర్ ఎంక్వయిరీస్	ఆకస్మిక తనిఖీలు	డిస్ట్రిక్ట్ ఎంక్వయిరీస్	మొత్తం కేసుల సంఖ్య
2020	61	9	14	5	2	3	94
2021	74	2	7	11	-	4	98
2022	72	18	17	8	-	1	116
2023	73	6	8	4	-	1	92
2024 (ఆగస్టు వరకు)	94	8	7	8	26	2	145

హైదరాబాద్ సీపీగా సీవీ ఆనంద్

- ఏసీబీ ఏడీజీగా విజయ్‌కుమార్
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కొత్తకోట
- తెలంగాణలో సీనియర్ ఐపీఎస్‌ల బదిలీ



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు వచ్చాక రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు భారీగా జరుగుతున్నాయి. తాజాగా వినాయకచవితి రోజున ఐదుగురు ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా సీవీ ఆనంద్‌ను నియమించగా, మొన్నటి వరకూ సీపీగా కొనసాగిన కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు పర్సనల్ ఏడీజీగా ఉన్న విజయ్ కుమార్‌ను ఏసీబీ ఏడీజీగా, ఆయన స్థానంలో లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేశ్ భగవత్‌ను నియమించింది. ఇక పోలీస్ స్పోర్ట్స్ ఐజీగా ఎం రమేశ్‌కు సైతం అదనపు బాధ్యతలు అప్పగించింది. అయితే, ఇటీవల హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పడం, అడ్డూ అదుపులేకుండా నేరాలు పెరిగిపోతుండటం, పోలీసులే లంచాల్లో మునిగి తేలుతుండగా.. సీపీ ట్రాన్స్‌ఫర్లు మాత్రమే చేస్తుండేవారు. నేరాల అదుపులో పురోగతి లేకపోవడంతో సీవీ ఆనంద్‌ను మళ్లీ హైదరాబాద్ సీపీగా తీసుకొచ్చినట్టు సమాచారం. దీంతోపాటు సమర్థుడైన అధికారిగా పేరున్న జయ్‌కుమార్‌ను పోలీసు పర్సనల్ అదనపు డీజీగా ఉంచడం.. పోలీసు వర్గాల్లో కూడా వ్యతిరేకత వ్యక్తమవడంతో అతన్ని అవినీతి నిరోధకశాఖ అదనపు డీజీగా నియమించినట్టు తెలిసింది.



దీప్తికి కోటి నజరానా

హైదరాబాద్, ఆట ప్రతినిధి : పారాలింపిక్స్‌లో భాగంగా మహిళల 400 మీటర్ల టీ20 ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి జివాంజీకి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నగదు పురస్కారం ప్రకటించింది. క్యాష్ ప్రైజ్‌తో పాటు ఆమెకు గ్రూప్-2 ఉద్యోగం, వరంగల్‌లో 500 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించింది. ఆదివారం దీప్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన సందర్భంగా సీఎం ఆమెను సత్కరించారు. దీప్తి కోచ్ నాగపురి రమేశ్ బాబుకూ రూ. 10 లక్షల నగదు పురస్కారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దీప్తికి నగదు పురస్కారం, ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలాన్ని కేటాయించడంపై తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

టెస్టులలో రిషభ్ రీఎంట్రీ

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు భారత జట్టు ప్రకటన



ముంబై: రెండేండ్ల క్రితం కారు ప్రమాదంలో గాయపడి గతేడాది పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పునరాగమనం చేసిన భారత స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ సుమారు 20 నెలల తర్వాత టెస్టు జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. బంగ్లాదేశ్‌తో ఈనెల 19 నుంచి చెన్నై వేదికగా జరుగబోయే తొలి టెస్టుకు ప్రకటించిన జట్టులో అతడు చోటు దక్కించుకున్నాడు. ఈ మేరకు ఆదివారం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని జాతీయ సెలక్షన్ కమిటీ రోహిత్ శర్మ సారథ్యంలోని 16 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించింది. ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ తిరిగి జట్టుతో చేరనుండగా టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత ఏస్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సైతం చెన్నై టెస్టులో ఆడనున్నాడు. దులీప్ ట్రోఫీలో ఆకట్టుకుంటున్న యూపీ పేసర్ యశ్ దయాళ్ సర్‌ప్రైజ్ ప్యాకేజీగా జట్టులోకి వచ్చాడు. సీనియర్ పేసర్ షమీకి నిరాశ తప్పలేదు.

తొలి టెస్టుకు భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, యశ్ దయాళ్

క్రికెట్‌కు మొయిన్ అలీ వీడ్కోలు

లండన్: ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. త్వరలో ఆస్ట్రేలియాతో జరుగనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌కు గాను సెలక్టర్లు అలీని పక్కనబెట్టిన కొద్దిరోజులకే అతడు ఈ నిర్ణయం ప్రకటించడం గమనార్హం. పదేండ్ల అంతర్జాతీయ కెరీర్‌లో అలీ.. 68 టెస్టులు, 138 వన్డేలు, 92 టీ20లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 6,678 పరుగులు సాధించిన అతడు.. 366 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్ 2019లో గెలిచిన వన్డే ప్రపంచకప్, 2022 టీ20 వరల్డ్ కప్‌లలో అలీ సభ్యుడు.



హైదరాబాద్‌లో ఫుట్‌బాల్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు గాను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'స్పెషల్ ఫుట్‌బాల్ క్లినిక్' కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణ పొందుతున్న యువ క్రీడాకారులు.

అంచనాలకు మించి..

పారాలింపిక్స్‌లో అదరగొట్టిన భారత్ • రికార్డు స్థాయిలో 29 పతకాలు • ముగిసిన క్రీడలు



పారిస్: రెండు వారాలుగా పారిస్ వేదికగా జరిగిన పారాలింపిక్స్‌లో భారత్ అంచనాలకు మించి రాణించి సత్తా చాటింది. పారిస్‌లో 25 పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత పారా క్రీడాకారుల బృందం.. లక్ష్యాన్ని అధిగమించడమే గాక మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 29 పతకాలు సాధించి సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. గత పారాలింపిక్స్ (టోక్యో)లో నెగ్గిన 19 పతకాలే ఇప్పటి వరకూ అత్యధికం కాగా పారిస్‌లో మాత్రం అంతకంటే మరో పది పతకాలు ఎక్కువే సాధించింది. 84 మంది బృందంతో పారిస్‌కు వెళ్లిన భారత్‌కు ఐదు క్రీడాంశాల (ఆర్చరీ, బ్యాడ్మింటన్, షూటింగ్, జూడో, అథ్లెటిక్స్)లో ఏడు స్వర్ణాలు, 9 రజతాలు 13 కాంస్య పతకాలతో అదరగొట్టింది. ఆరంభంలో షట్లర్లు, షూటర్లు రెండంకెల పతకాలకు పునాది వేస్తే అథ్లెట్ల రంగప్రవేశంతో భారత్ పతక రేసులో రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్లింది. సమ్మర్ ఒలింపిక్స్‌లో రెండంకెల పతకాలు సాధించడానికి నానా తంటాలు పడుతున్న భారత్‌కు పారా అథ్లెట్లు మాత్రం పతకాల పంట పండించారు. మన పారా వీరుల అత్యద్భుత ప్రదర్శనలతో పతకాల పట్టికలో భారత్.. స్విట్జర్లాండ్, దక్షిణ కొరియా, అర్జెంటీనా వంటి దేశాలను వెనక్కినెట్టి టాప్-20లో (18వ స్థానం) నిలవడం విశేషం. ఆదివారంతో పారాలింపిక్స్ అట్టహాసంగా ముగిశాయి.

అథ్లెట్లు అదరహో..

దేశానికి మొత్తం వచ్చిన పతకాలలో సింహభాగం (17) పారా అథ్లెట్లు తెచ్చినవే. స్వర్ణాల విషయంలోనూ అథ్లెట్లు (4) సత్తా చాటారు. తొలిసారి పారాలింపిక్స్‌లో పాల్గొంటూ పతకాలు కొల్లగొట్టిన దీప్తి జివాంజి, ప్రీతి పాల్, శీతల్ దేవీ వంటివారు కొందరుకాగా వరుసగా రెండు, మూడు ఎడిషన్లలో పతకాలు సాధించిన సుమిత్ అంటిల్, అవని లేఖరా, తంగవేలు మరియప్పన్ వంటి క్రీడాకారులూ ఉన్నారు. చేతులు అత్యంత ప్రధానమైన ఆర్చరీ వంటి ఆటలో రెండు చేతులూ లేకున్నా బరిలోకి దిగి కాలితో బాణాలు సంధించిన 17 ఏండ్ల యువ ఆర్చర్ శీతల్ దేవీ పోరాటం ఎందరికో స్ఫూర్తినిచ్చింది. వ్యక్తిగత ఈవెంట్‌లో తృటిలో స్వర్ణం చేజార్చుకున్న శీతల్.. మిక్స్‌డ్ ఈవెంట్‌లో మాత్రం పట్టు వీడలేదు. హర్విందర్ సింగ్ స్వర్ణ గాథ కూడా గుర్తుంచుకునేదే. ఇక అథ్లెటిక్స్ విషయానికొస్తే వంద మీటర్లతో పాటు రెండు వందల మీటర్ల రేసులోనూ ప్రీతి పాల్ కంచు మోత మోగిస్తే తెలంగాణ అమ్మాయి దీప్తి 400 మీటర్ల రేసులో కాంస్య కాంతులు పంచింది. భారత్ ఇంతవరకూ పతకాలు నెగ్గని జూడోలో కపిల్ పర్మార్ పతకం 'పట్టు' పట్టగా క్లబ్ త్రో లో ధరంబీర్, ప్రణవ్ స్వర్ణ, రజతాలతో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.



నవ్‌దీప్‌కు స్వర్ణం.. సిమ్రన్‌కు కాంస్యం

పారాలింపిక్స్‌లో భారత్‌కు శనివారం మరో స్వర్ణ, కాంస్య పతకాలు దక్కాయి. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 కేటగిరీలో నవ్‌దీప్ సింగ్ బంగారు పతకం సాధించాడు. వాస్తవానికి ఈ ఈవెంట్‌లో ఇరాన్ అథ్లెట్ బేట్ సదేగ్‌కు అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకానికి అర్హత సాధించాడు. కానీ అతడు పారాలింపిక్స్ నియమావళికి వ్యతిరేకంగా నల్లజెండాను ప్రదర్శించడంతో నిర్వాహకులు అతడిపై వేటు విధించడంతో 47.32 మీటర్ల త్రో విసిరి రెండో స్థానంలో ఉన్న నవ్‌దీప్ అనూహ్యంగా అగ్రస్థానానికి వెళ్లాడు. ఇక మహిళల 200 మీటర్ల టీ12 రేసులో సిమ్రన్ శర్మ కాంస్యం దక్కించుకుంది. 24.75 సెకన్లలో పరుగును పూర్తిచేసిన సిమ్రన్ (గైడ్ అభయ్ సింగ్).. మూడో స్థానంతో పతకం సాధించింది.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	94	76	50	220
2	బ్రిటన్	49	44	31	124
3	అమెరికా	36	42	27	105
4	నెదర్లాండ్స్	27	17	12	56
5	బ్రెజిల్	25	26	38	89
6	ఇటలీ	24	15	32	71
18	భారత్	7	9	13	29

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

మహారాణి సబలెంక

యూఎస్ ఓపెన్ మహిళల టైటిల్ కైవసం..

ఫైనల్‌లో జెస్సికపై ఘన విజయం



"2019లో నా తండ్రిని కోల్పోయిన తర్వాత ఒకే ఒక్క లక్ష్యంతో టెన్నిస్ ఆడుతున్నా. టెన్నిస్ చరిత్రలో నా కుటుంబం పేరును చిరస్థాయిలో నిలిచిపోయేలా చేయాలనుకున్నా. ట్రోఫీపై నా పేరును చూసినప్పుడల్లా నా కుటుంబం చాలా గర్వపడుతోంది. **-సబలెంక**

న్యూయార్క్: సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన ప్రతిష్టాత్మక యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను బెలారస్ అమ్మాయి అరీనా సబలెంక గెలుచుకుంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియం వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో సబలెంక.. 7-5, 7-5తో జెస్సిక పెగుల (యూఎస్‌ఏ)ను ఓడించింది. రెండో సీడ్ సబలెంకకు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కాగా యూఎస్ ఓపెన్‌ను గెలుచుకోవడం ఇదే మొదటిసారి. గతేడాది ఫైనల్‌లో అమెరికా అమ్మాయి కోకో గాఫ్ చేతిలో ఓడిన సబలెంక.. ఈసారి మాత్రం వరుస సెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేసి విజేతగా నిలిచింది. సుమారు రెండు గంటల పాటు జరిగిన టైటిల్ పోరులో ఈ బెలారస్ అమ్మాయి.. తొలి సెట్ నుంచే దూకుడుగా ఆడింది. మ్యాచ్‌లో 6 ఏస్‌లు, 40 విన్నర్లు కొట్టిన ఆమె.. తొలి సెట్‌లో ఆద్యంతం ఆధిక్యం కనబరిచింది. రెండో సెట్‌లో 0-3తో వెనుకబడ్డా తర్వాత పుంజుకుని సెట్‌తో పాటు టైటిల్‌నూ సొంతం చేసుకుంది. సబలెంక బలమైన సర్వీసులకు తొలిసారి ఫైనల్ ఆడుతున్న జెస్సికకు పరాభవం తప్పలేదు. ఈ విజయంతో 2016 తర్వాత ఒకే ఏడాది హార్డ్ కోర్టులో రెండు టైటిల్స్ (ఆస్ట్రేలియా ఓపెన్, యూఎస్ ఓపెన్) గెలిచిన తొలి క్రీడాకారిణిగా సబలెంక నిలిచింది. 2016లో జర్మనీ ప్లేయర్ కెర్బర్ ఈ ఘనత సాధించింది.

ప్రైజ్ మనీ
3,600,000 యూఎస్ డాలర్లు
భారత కరెన్సీలో సుమారు రూ. 30.23 కోట్లు

ఏసీఏ అధ్యక్షుడిగా ఎంపీ కేశినేని

- వరద బాధితులకు రూ.కోటి విరాళం ప్రకటన



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడిగా ఎంపీ కేశినేని శివనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేశ్ ఆదివారం ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. ఏసీఏ లోని ఇతర పదవులకూ కేశినేని ప్యానల్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా కేశినేని సీఎం సహాయనిధి కింద వరద బాధితులను ఆదుకునేందుకు కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు.

ఇండియా 'ఏ' ఓటమి

బెంగళూరు: భారత స్టార్ ఓపెనర్ శుభమన్ గిల్ సారథ్యంలో దులీప్ ట్రోఫీ బరిలోకి దిగిన ఇండియా 'ఏ'కు తొలి మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఇండియా 'బీ'తో జరిగిన మొదటి మ్యాచ్‌లో 'ఏ' జట్టు 76 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. అభిమన్యు ఈశ్వరన్ నేతృత్వంలోని ఇండియా 'బీ' రెండో ఇన్నింగ్స్‌లో నిర్దేశించిన 274 పరుగుల ఛేదనలో గిల్ సేన.. 198 పరుగులకే ఆలౌట్ అయింది.

భారత్ బోణీ

ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీ



హులన్‌బుయిర్: చైనా వేదికగా జరుగుతున్న ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత హాకీ జట్టు శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో భారత్ 3-0తో చైనాపై ఏకపక్ష విజయం సాధించి టోర్నీలో బోణీ కొట్టింది. పారిస్‌లో కాంస్య పతకం గెలిచిన తర్వాత మొదటి మ్యాచ్ ఆడిన భారత్‌కు సుఖ్‌జీత్ (14వ నిమిషం), ఉత్తమ్ (27), అభిషేక్ (32) మూడు గోల్స్ చేసి ఘన విజయాన్ని అందించారు.

ఎట్టకేలకు చిన్నారికి బర్త్ సర్టిఫికెట్ జారీ

- ఊపిరి పీల్చుకున్న కుటుంబ సభ్యులు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ములుగు, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): జనన ధ్రువీకరణ పత్రం లేక చిన్నారి గుండె ఆపరేషన్ ఆగిపోవడంతో 'బర్త్ సర్టిఫికెట్ లేక ఆగిన గుండె ఆపరేషన్, ఇబ్బందుల్లో పసి ప్రాణం' అనే కథనం 'నమస్తేతెలంగాణ' దినపత్రికలో ఈ నెల 6న ప్రచురితమైంది. దీనికి పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం వినాయక చవితి సెలవు రోజు అయినప్పటికీ పంచాయతీ కార్యదర్శి రఘు.. చిన్నారి తండ్రి సురేశ్‌కు బర్త్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీవో రహీమొద్దీన్ మాట్లాడుతూ.. ఇటీవల ములుగు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆన్‌లైన్ పాస్‌వర్డ్‌లు మార్చుతున్న క్రమంలో సాంకేతిక కారణాల వల్ల ములుగు జీపీకి చెందిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు పనిచేయకుండా పోయినట్టు తెలిపారు. ప్రస్తుతానికి ఆఫ్‌లైన్‌లో ఇచ్చామని త్వరలో సాంకేతిక సమస్యను పరిష్కరించి ఆన్‌లైన్‌లో బర్త్ సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు.



చిన్నారి తండ్రి సురేశ్‌కు బర్త్ సర్టిఫికెట్ అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి రఘు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అడ్డుకున్న మహిళలు

ఖమ్మం, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/తిరుమలాయపాలెం: వరదల్లో చిక్కుకొని నిరాశ్రయులుగా మారిన తమను పట్టించుకున్న వారే లేరంటూ కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని వరద బాధితులు నిలదీశారు. ఆదివారం ఖమ్మం నగరంలో పర్యటించిన కేంద్రమంత్రి ఎదుట ధంసలాపురం ప్రాంతానికి చెందిన వరద బాధిత మహిళలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ధంసలాపురం ప్రాంతంలో వరద ఇండ్లల్లోకి చేరడంతో తాము దిక్కులేని వారమయ్యామని, సర్వం కోల్పోయామని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.. తమకు న్యాయం చేయాలని నిలదీశారు. మహిళలు ఒక్కసారిగా కిషన్‌రెడ్డిని అడ్డుకొని తమ గోడు వినాలంటూ ప్రాధేయపడ్డారు. తాగునీటికి సైతం ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షం సృష్టించిన బీభత్సం వల్ల ఖమ్మానికి జరిగిన నష్టం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా చూశానని కేంద్రం తగిన రీతిలో ఆదుకుంటుందని భరోసానిచ్చారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వరద బారిన పడిన బాధితులకు అన్నిరకాలుగా సహాయం చేస్తామని, అధైర్యపడొద్దని హామీ ఇచ్చారు.



ఖమ్మంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అడ్డుకుంటున్న ధంసలాపురం ప్రాంత మహిళలు

విలపించిన తండావాసులు

'ఆకేరు ఉప్పొంగడంతో ఇండ్లు మునిగి, పంటలు కొట్టుకుపోయి సర్వం కోల్పోయాం.. ఎలా బతకాలో అర్థం కావడం లేదు.. మమ్ములను మీరే కాపాడాలె సారూ' అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని వరద బాధితులు వేడుకున్నారు. వరద విషాదాన్ని వివరిస్తూ దండం పెట్టి బోరున విలపించారు.


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ



డిపాజిట్లకు వేళాయెరా

స్పెషల్ ఎఫ్‌డీలకు ఈ నెలాఖరే గడువు



సురక్షిత పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ). అయితే ఆయా బ్యాంకులు డిపాజిటర్లను ఆకర్షించేందుకు కొన్ని ప్రత్యేక ఎఫ్‌డీలను తీసుకొచ్చాయి. వీటి కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగుస్తున్నది. సాధారణ డిపాజిటర్లతో పోల్చితే సీనియర్ సిటిజన్లు, సూపర్ సీనియర్ సిటిజన్లకు పావు శాతం నుంచి అర శాతం వరకు ఎక్కువే వడ్డీలొస్తున్నాయి. అవేంటో.. ఏయే బ్యాంకులు అందిస్తున్నాయో ఒక్కసారి పరిశీలిస్తే..

ఐడీబీఐ బ్యాంక్‌లో..

ఐడీబీఐ బ్యాంక్ ప్రత్యేకంగా తెచ్చిన ఉత్సవ్ ఎఫ్‌డీల్లో పెట్టుబడులు పెట్టేందుకు చివరి తేదీ సెప్టెంబర్ 30. 300, 375, 444, 700 రోజుల కాలవ్యవధితో ఈ స్పెషల్ ఎఫ్‌డీలను బ్యాంక్ పరిచయం చేసింది. 300 రోజుల ఎఫ్‌డీపై సాధారణ డిపాజిటర్లకు 7.05 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.55 శాతం వడ్డీరేటు లభిస్తున్నది. ఇక 375 రోజుల ఎఫ్‌డీపై సాధారణ కస్టమర్లకు 7.15 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.65 శాతం వడ్డీరేటున్నది. 444 రోజుల ఎఫ్‌డీపై సాధారణ పౌరులకు 7.35 శాతం, వృద్ధులకు 7.85 శాతం వడ్డీరేటు వస్తున్నది. 700 రోజుల ఎఫ్‌డీకి సాధారణంగానైతే 7.20 శాతం వడ్డీరేటు వర్తిస్తున్నది. సీనియర్ సిటిజన్లకు 7.70 శాతం వడ్డీ ఉన్నది.

ఇండియన్ బ్యాంక్‌లో..

ఇండియన్ బ్యాంక్ స్పెషల్ ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేసేందుకున్న ఆఖరు తేదీ సెప్టెంబర్ 30. ఇండ్ సూపర్ 300 రోజుల ఎఫ్‌డీపై సాధారణ డిపాజిటర్లకు 7.05 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.55 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఇక సూపర్ సీనియర్ సిటిజన్లకైతే 7.80 శాతం వడ్డీరేటును బ్యాంక్ ప్రకటించింది. అలాగే 400 రోజుల ఎఫ్‌డీపై సాధారణంగా 7.25 శాతం వడ్డీరేటున్నది. సీనియర్ సిటిజన్లకు ఇది 7.75 శాతం, సూపర్ సీనియర్లకు 8 శాతం.

పంజాబ్ అండ్ సింధ్‌లో..

222 రోజుల ప్రత్యేక ఎఫ్‌డీపై పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్.. అత్యధికంగా 6.30 శాతం వడ్డీరేటును ఇస్తున్నది. అలాగే 333 రోజుల ఎఫ్‌డీపై 7.15 శాతం, 444 రోజుల ఎఫ్‌డీపై 7.25 శాతం వడ్డీరేట్లున్నాయి. ఈ పరిమితకాల స్పెషల్ ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్‌మెంట్‌కున్న గడువు సెప్టెంబర్ 30.

ఎస్బీఐ ఎఫ్‌డీల్లో..

ఈ నెలాఖరుదాకే ఎస్బీఐ అమృత్ కలశ్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు. 400 రోజులతోకూడిన ఈ ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వడ్డీరేటు 7.10 శాతం. సీనియర్ సిటిజన్లకైతే 7.60 శాతం. అలాగే ఎస్బీఐ వుయ్‌కేర్ స్కీం గడువును ఈ నెల 30దాకా పొడిగించారు. కొత్త డిపాజిట్లపై, మెచ్యూరింగ్ డిపాజిట్ల రెన్యువల్‌పై మాత్రమే ఈ స్కీం వర్తిస్తుంది. ఇందులో వడ్డీరేటు 7.50 శాతం.

ఈఎల్ఎస్ఎస్ మ్యూచువల్ ఫండ్స్

రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులు

ఈక్విటీ-లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్ (ఈఎల్ఎస్ఎస్)లో సంపద వృద్ధికి, పన్ను ఆదాకూ ఆస్కారముంటున్నది. ఫలితంగా మూడేండ్ల లాకిన్ పీరియడ్‌తో ఉన్న ఈ పథకాలు.. యువ ఇన్వెస్టర్లకు హాట్ ఫేవరేట్‌గా మారిపోయాయిప్పుడు. స్టాక్ మార్కెట్లు, స్టాక్ మార్కెట్ సంబంధిత సాధనాల్లో ప్రధానంగా వీటి పెట్టుబడులుంటాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ట్యాక్స్ సేవింగ్ ప్రోత్సాహకాలనూ మదుపరులు పొందే వీలున్నది. రూ.1.5 లక్షలదాకా ఐటీ మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. కాగా, పెట్టుబడి లక్ష్యాలు, ఇన్వెస్టర్ల రిస్క్ ప్రొఫైల్, ఫండ్ ప్రదర్శన, ఫండ్ మేనేజర్ ట్రాక్ రికార్డు, మదుపర్ల వ్యూహాలు, వ్యయ నిష్పత్తి తదితర అంశాలనుబట్టి ఈఎల్ఎస్ఎస్ ఫండ్లను ఎంచుకోవడం ఉత్తమం. అలాగే దీర్ఘకాలంలో స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు, ఇతరత్రా పోటీ ఫండ్లలో రాబడుల అంచనాల ఆధారంగా కూడా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని నిపుణుల సలహా. ఇక ఈఎల్ఎస్ఎస్‌లో రెగ్యులర్‌గా పెట్టుబడులు పెట్టేందుకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను ఎంచుకోవచ్చు.



నో-క్లెయిం బోనస్ లాభాలివీ..

ఆరోగ్య బీమాలో తొందరపాటు వద్దు

నేడు చాలామంది ఆరోగ్య బీమా కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. మారుతున్న జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పులు, పెరిగిన కాలుష్యం ఇలా.. అనేక పరిస్థితులు ఆరోగ్య బీమా ప్రాధాన్యతను పెంచేశాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ లేని కుటుంబాలు లేవంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ ఆరోగ్య బీమాలో నో-క్లెయిం బోనస్ లాభాలెంటో తెలుసా?

నో-క్లెయిం బోనస్ అంటే?


ఆరోగ్య బీమా తీసుకున్నాక తర్వాతి రెన్యువల్ వరకు ఆ బీమాను ఉపయోగించకపోతే.. అందుకుగాను బీమా సంస్థలు పాలసీదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలే ఈ నో-క్లెయిం బోనస్‌లు. వీటిలో క్యుములేటివ్ బోనస్, ప్రీమియంపై డిస్కౌంట్లుంటాయి.

క్యుములేటివ్ బోనస్

తొలి సంవత్సరం ఎలాంటి క్లెయిములు లేకపోతే మలి సంవత్సరం పాలసీ తీసుకునేటప్పుడు అంతే మొత్తానికి బీమా కవరేజీ 10 శాతం మేర పెరుగుతుంది. ఉదాహరణకు రూ.20 వేలు చెల్లించి రూ.20 లక్షల పాలసీని తీసుకున్నారు. తొలి ఏడాది కాలంలో ఏ క్లెయిం చేయలేదు. దీంతో రెండో ఏడాదీ అదే రూ.20 వేలకు రూ.22 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. ఇక్కడ నో-క్లెయిం బోనస్ రూ.2 లక్షలు (10 శాతం) అన్నమాట. ఇలా తర్వాతి సంవత్సరాల్లోనూ రూ.2 లక్షల చొప్పున బీమా కవరేజీ పెరుగుతూపోతుంది. వీటినే క్యుములేటివ్ బోనస్‌లు అంటారు.

ప్రీమియంలపై డిస్కౌంట్

ప్రతి సంవత్సరం క్లెయిములు లేకపోతే ఆ పాలసీదారులకు ఇన్సూరెన్స్ సంస్థలు.. బీమా ప్రీమియంలపై రాయితీలనూ అందిస్తాయి. రెన్యువల్ సమయంలో ఈ తగ్గింపులను అందుకోవచ్చు. ఉదాహరణకు రూ.20 లక్షల ఆరోగ్య బీమాను రూ.20 వేలు పెట్టి తీసుకున్నారు. తొలి ఏడాది ఎలాంటి క్లెయిం చేయలేదు. దీంతో మీ ప్రీమియంలో 10 శాతం తగ్గింపు లభిస్తుంది. అంటే తర్వాతి సంవత్సరం రూ.18 వేలు చెల్లిస్తే చాలు. రూ.20 లక్షల కవరేజీ వస్తుంది. ఇలా తర్వాతి సంవత్సరాలకూ నిబంధనలకు లోబడి 10 శాతం తగ్గింపులు వర్తిస్తాయి.




గుర్తుంచుకోండి..

చిన్నచిన్న వాటికే క్లెయిములు చేస్తే ఆరోగ్య బీమా ద్వారా పొందే ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది. జలుబు, దగ్గు, జ్వరాలు, ఇతరత్రా సీజనల్ వ్యాధులకు ఆరోగ్య బీమాలను ఉపయోగించుకోవడం మానేయండి. పెద్ద సమస్యలు ఎదురైతేనే బీమాను వాడుకోండి. అలాగే ఆరోగ్యంగా ఉన్నప్పుడే బీమాలను తీసుకోండి. బీపీ, షుగర్ వంటివి వచ్చాక తీసుకుంటే ప్రయోజనాలకు కోతలు తప్పవు. ఆరోగ్య బీమా తీసుకునేటప్పుడు వాస్తవాలను వెల్లడించండి. ప్రీమియంలను రెగ్యులర్‌గా చెల్లించండి. నిజాలను దాస్తే ఇబ్బందులు తప్పవు. నో-క్లెయిం బోనస్‌లు.. ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లు, ఇండివీడ్యువల్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకూ వర్తిస్తాయి.

స్టాక్ మార్కెట్‌లో ఎస్‌జీబీలను కొనండిలా

సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ)ను.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తేదీల్లో ప్రైమరీ మార్కెట్ నుంచి లేదా ఎన్ఎస్ఈ, బీఎస్ఈల ద్వారా సెకండరీ మార్కెట్ నుంచి కొనవచ్చు. స్టాక్ మార్కెట్ల విషయానికే వస్తే.. సెకండరీ మార్కెట్‌లో ఎస్‌జీబీల ధర వాటి సప్లై, డిమాండ్ల ఆధారంగా ఉంటుంది. స్పాట్ మార్కెట్‌లో భౌతిక బంగారానికున్న రేటుకన్నా ఎస్‌జీబీల విలువ తక్కువగా ట్రేడ్ అవుతూ ఉంటుంది. కాగా, తొలుత ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో అధిక రాబడిగల రాయితీ ఎస్‌జీబీలు దొరుకుతాయా? అన్నది చూడాలి. కొనుగోలులో వాటికే మొదటి ప్రాధాన్యం ఇవ్వడం లాభదాయకం. ఇక మీ డీమ్యాట్ ఖాతాలో ఎస్‌జీబీ స్క్రిప్ కోడ్‌ను అన్వేషించి, ఆర్డర్ చేయవచ్చు. మరుసటిరోజు మీ డీమ్యాట్ ఖాతాలో బాండ్లు జమవుతాయి.





అమ్మకాల ఒత్తిడే!

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలబారిన పడుతున్నాయి. మదుపరులు లాభాల స్వీకరణకే మొగ్గు చూపుతున్నారు. శుక్రవారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,017, నిఫ్టీ 293 పాయింట్లు పతనమయ్యాయి. ఈ క్రమంలోనే గత వారం సూచీలు భారీ ఎత్తున క్షీణించాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,181.84 పాయింట్లు దిగజారి 81,183.93 వద్ద నిలిచింది. అలాగే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం 383.75 పాయింట్లు కోల్పోయి 24,852.15 దగ్గర ముగిసింది. మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ఈ వారం కూడా సెల్లింగ్ ప్రెషర్ కొనసాగవచ్చని మెజారిటీ నిపుణుల అభిప్రాయం. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. ఇక అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,300-25,500 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు నిపుణుల సలహాలు, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

'కాళోజీ' ముంగిట పోలీస్ జులుం

మొదటిపేజీ తరువాయి...

చూస్తున్న క్రమంలో సుబేదారి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీ శ్రీనివాస్‌రెడ్డి మరో ఇద్దరు ఎస్సైలు, పది మంది సిబ్బందితో అక్కడికి వచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్న సాకు చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. వెంటనే వెళ్లకపోతే తమ పద్ధతిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కూడా అదే రీతిలో స్పందించారు. 'తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఇలాంటి పోలీసు బెదిరింపులను చాలా చూశాం. కేసులు, పదవులు మాకు కొత్త కాదు. రాష్ట్రం కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినం. ప్రభుత్వ నిధులతో చేపట్టిన నిర్మాణాన్ని చూసేందుకు వచ్చిన మాతో ఇలా వ్యవహరించడం సరికాదు. మీరు ఎవరు చెప్తే ఇక్కడికి వచ్చారో అందరికీ తెలుసు. మేం ఎవరితో చెప్పించుకునే పరిస్థితిలో లేము. కాళోజీ కళా క్షేత్రం వద్ద రాజకీయాలు తగదు. ధిక్కారానికి వ్యతిరేకంగా పోరాడిన కాళోజీ కళా క్షేత్రం వద్ద ఎవరి బెదిరింపులకు భయపడం' అని హెచ్చరించారు. కళా క్షేత్రం వద్దకు బీఆర్‌ఎస్ నేతలు రాకూడదనే ఉత్తర్వులు ఏమైనా ఉన్నాయా? అని పోలీసులను ప్రశ్నించారు. వినయ్‌భాస్కర్ హెచ్చరికలతో పోలీసులు కంగుతిన్నారు. వినయ్‌భాస్కర్, ఇతర బీఆర్‌ఎస్ నేతలు అక్కడి నుంచి వెళ్లే వరకు వారి వెన్నంటే పోలీసులు ఉన్నారు. బీఆర్‌ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు కాళోజీ కళా క్షేత్రం వద్దకు వచ్చే ముందు.. భవనం మూడు గేట్లలో రెండు తెరిచే ఉన్నాయి. బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు అక్కడికి వచ్చిన 10 నిమిషాల్లోనే పోలీసులు చేరుకున్నారు. రెండు మెయిన్ గేట్లను మూసివేశారు. బీఆర్‌ఎస్ నాయకులను అక్కడి నుంచి పంపించాలని కాంగ్రెస్ స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతోనే పోలీసులు వేగంగా అక్కడికి చేరుకున్నట్టు సమాచారం.

నిర్మించింది కేసీఆర్.. ప్రచారం కాంగ్రెస్‌ది : వినయ్‌భాస్కర్

ఉద్యమ నేత కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే వరంగల్ నగరానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక,సాహిత్య ఔన్నత్యాన్ని పెంచేలా ఇక్కడ కాళోజీ కళా క్షేత్రాన్ని నిర్మించారని, కాంగ్రెస్ ప్రభుత్వం చివరలో కొద్దిగా రంగులు వేసి ప్రచారం చేసుకుంటున్నదని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిన 30 వేల మందికి కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు ఇస్తూ ఫొటోలు దిగిందని దుయ్యబట్టారు. పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు మరణం తర్వాత ఆయన పేరిట వరంగల్‌లో సాహిత్య కేంద్రం నిర్మించేందుకు సమైక్య ప్రభుత్వాలు ఏ మాత్రమూ ఒప్పుకోలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాళోజీ సాహిత్య కేంద్రం కోసం కనీసం 300 గజాలైనా జాగ ఇవ్వాలని అప్పటి ముఖ్యమంత్రులు వైఎస్ఆర్, రోశయ్యను అడిగితే పట్టించుకోలేదని గుర్తుచేశారు. తెలంగాణ సాధన కోసం కాళోజీ జీవితాంతం తపించారని, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదని పేర్కొన్నారు. కాళోజీ గురించి, ఆయన స్ఫూర్తిని గుర్తించని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలోనే దీని నిర్మాణం పూర్తయిందని, చివరలో చిన్నచిన్న పనులు చేసి తామే అంతా చేశామని కాంగ్రెస్ చెప్పుకుంటున్నదని ఎద్దేవా చేశారు. కాగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటన వాయిదా పడింది. కేసీఆర్ ప్రభుత్వం వరంగల్ నగరంలో నిర్మించిన కాళోజీ కళా క్షేత్రాన్ని కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం సీఎం ప్రారంభిస్తారని, దీని కోసం వరంగల్ పర్యటన ఉంటుందని ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ మేరకు పనులను చేపట్టారు. వానలతోపాటు కళా క్షేత్రం పనులు పూర్తి కాకపోవడంతో ఈ పర్యటన వాయిదా పడినట్టు తెలిసింది. అక్టోబర్ 2న సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి వస్తారని, అదే రోజు కాళోజీ కళా క్షేత్రాన్ని ప్రారంభిస్తారని అధికారులు చెప్పారు.

వెంకటేశ్వరరావుకు హరీశ్ పరామర్శ

హైదరాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): అస్వస్థతకు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ విప్లవ కుమార్ సోదరుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కేకే పెద్ద కుమారుడు వెంకటేశ్వరరావును మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్‌తో మాట్లాడి వెంకటేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. హరీశ్‌రావు వెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఉన్నారు.

రేవంత్ పాలన యమపాశం

మొదటిపేజీ తరువాయి...



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ దేశపతి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

లేదని, అనేక ఆంక్షలు పెట్టి కుటుంబ సంబంధాల్లో సర్కారు చిచ్చుపెట్టిందని దుయ్యబట్టారు. అన్నదాతలను ప్రభుత్వం వంచించిందని విమర్శించారు. మేడ్చల్‌లో వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట పాస్ బుక్‌పైనే సూసైడ్ నోట్ రాసి రైతు సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. సురేందర్‌రెడ్డికి ఏపీజీవీబీలో రూ.1.92 లక్షలు, తన తల్లి పేరిట రూ.1.15 లక్షలు అప్పు ఉన్నదని, కుటుంబసభ్యుల్లో ఒక్కరికే రుణమాఫీ అవుతుందని బ్యాంకు మేనేజర్ చెప్పడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. సురేందర్‌రెడ్డి సూసైడ్ నోట్‌లోని ప్రతి అక్షరం రేవంత్‌రెడ్డి నగ్న స్వరూపాన్ని బయటపెట్టిందని, పూటకో మాట మాట్లాడుతూ రైతులను వంచిస్తున్నారని విమర్శించారు. రేవంత్ పాలనకు సురేందర్‌రెడ్డి లేఖ ఒక పంచనామా లాంటిదని అభివర్ణించారు. సురేందర్‌రెడ్డిది ఆత్మహత్య కాదు.. ప్రభుత్వం చేసిన హత్య అని అభివర్ణించారు.

అవివాహితులు భార్య ఆధార్‌కార్డు తేవాలట!

గత కేసీఆర్ ప్రభుత్వం కుటుంబ బంధాలను బలోపేతం చేస్తే, రేవంత్ ప్రభుత్వం వాటిని విచ్ఛిన్నం చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. 'నా నియోజకవర్గంలో జక్కాపూర్‌లో గురజాల బాల్‌రెడ్డి కుటుంబంలో ముగ్గురికి వ్యవసాయ రుణం ఉన్నది. బాల్‌రెడ్డితోపాటు ఇద్దరు కొడుకులకు రుణాలు ఉన్నాయి. వారు కుటుంబాలు వేరయ్యాయి. వారికి రూ.ఆరు లక్షల అప్పు ఉంటే కేవలం రూ.రెండు లక్షలే మాఫీ అవుతున్నది. నారాయణ్‌పేట గ్రామంలో నల్ల మణెమ్మ అనే రైతుకు రూ.1.30 లక్షల అప్పు ఉన్నది. ఆమె భర్త 2010లో మరణించారు. ఇప్పుడు ఆయన ఆధార్‌కార్డు తెస్తేనే రుణమాఫీ చేస్తామని బ్యాంకు అధికారులు చెప్తున్నారు. 2010లో ఆధార్‌కార్డులే ఇవ్వనప్పుడు ఇప్పుడు ఆధార్‌కార్డు ఎలా తెస్తారు? కుంభాల సిద్ధారెడ్డికి 52 ఏండ్లు, అవివాహితుడు. చాతపల్లి హరీశ్‌కు 32 ఏండ్లు. ఇతనికీ పెండ్లి కాలేదు. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదని వీరిద్దరూ వెళ్లి బ్యాంకు అధికారులను అడిగితే.. భార్య ఆధార్‌కార్డు తెమ్మంటున్నారు. అసలు పెండ్లే కాని వారు భార్య ఆధార్‌కార్డు ఎక్కడి నుంచి తెస్తారు? ఇలాంటి వాళ్లు ఎంతోమంది ఉన్నారు. ఇది రైతుల పాలిట రేవంత్ చేసిన మోసం, దగా కాదా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

ఇప్పుడు బావిలో ఎవరు దూకాలి రేవంత్?

రాష్ట్రంలో ఇప్పటివరకు 20 లక్షల మందికే రుణమాఫీ అయ్యిందని, ఇంకా 21 లక్షల మంది రైతులకు కావాల్సి ఉన్నదని హరీశ్‌రావు చెప్పారు. రైతులందరికీ రుణమాఫీ అయ్యిందని, తనను బావిలో దూకాలని అంటున్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎవరు బావిలో దూకాలో చెప్పాలని నిలదీశారు. చేతి గుర్తుకు ఓటేస్తే కోతలే మిగిలాయని ఎద్దేవా చేశారు. వ్యవసాయ రంగంలో అనేక కొత్త కొత్త పదవులు ఏర్పాటుచేస్తున్నారని, తాజాగా రైతు సంక్షేమ కమిషన్ పెట్టారని, రైతు రుణమాఫీ చేయని వారికి ఇన్ని పదవులు ఎందుకు? అని ప్రశ్నించారు. రైతుల ఆత్మహత్యలు పెంచడానికా ఈ పదవులు? అని ఎద్దేవాచేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు.

రైతుల కోసం తెగించి కొట్లాడుతాం

పెట్టుబడి సాయం అంటే రేవంత్‌రెడ్డికి అర్థం తెలుసా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మరో రెండు నెలల్లో యాసంగి పంట వేసే టైం వస్తదని, కానీ, నేటికీ వానకాలం రైతుభరోసా ఇవ్వలేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. 11 విడతల్లో పంటసాగుకు ముందే కేసీఆర్ రైతుబంధు అందజేశారని చెప్పారు. రుణమాఫీ కాకపాయె, రైతుబంధు పడగకపాయె అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని చెప్పి, చేయనందుకు రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తిచేశారు. రైతుల కోసం బీఆర్‌ఎస్ ప్రాణాలకు తెగించి పోరాడుతుందని పేర్కొన్నారు. తాము ఏర్పాటుచేసిన టోల్‌ఫ్రీ నంబర్ ఇప్పటిదాకా 1.32 లక్షల ఫిర్యాదులు వచ్చాయని, వాటిని గవర్నర్‌కు అందజేస్తామని చెప్పారు.

ఠాణాకు నిర్వహణ నిధులు రావడం లేదు

కేసీఆర్ పాలనలో ప్రతి పోలీస్‌స్టేషన్‌కు స్టేషనరీ ఖర్చుల కోసం ప్రతినెల రూ.75,000 మంజూరుచేశామని, తొమ్మిది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులు ఇవ్వడం లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీని గురించి పోలీసు అధికారుల సంఘం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రేవంత్ పాలనలో శాంతిభద్రతలు క్షీణించింది, మత కలహాలు పెరిగింది వాస్తవం కాదా? అని నిలదీశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పోలీసులకు సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్ ఎందుకు కావడంలేదని ప్రశ్నించారు. తొమ్మిది నెలల్లో 1,900 లైంగికదాడుల కేసులు, 247 ఇల్లీగల్ వెపన్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. మత కలహాల్లో ఆస్తినష్టం జరిగిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు.

హరీశ్‌రావు పేర్కొన్న జాబితా ప్రకారం రూ.2 లక్షల రైతు రుణమాఫీకి ప్రభుత్వం చూపుతున్న సాకులు

1. ప్రాసెసింగ్‌లో ఉన్నది.
2. తప్పుడు ఆధార్ నంబర్
3. డాటా లభించలేదు
4. పంపబడింది
5. ఆధార్ నంబర్‌తో పోలిస్తే లోన్ ఖాతాలోని పేరు తేడా ఉన్నది
6. కుటుంబ సమూహాన్ని నిర్ణయించాల్సి ఉన్నది.
7. కుటుంబ సమూహాన్ని నిర్ణయించాల్సి ఉన్నది. ఆధార్‌నంబర్‌తో పోలిస్తే లోన్ ఖాతాలోని పేరు తేడా
8. కుటుంబ సమూహాన్ని నిర్ణయించాల్సి ఉన్నది. ఒకరు ప్రభుత్వ ఉద్యోగి
9. కుటుంబ సభ్యుల్లో ఒకరు సర్వీస్ పింఛన్ దారులు.
10. కుటుంబ సమూహాన్ని నిర్ణయించాల్సి ఉన్నది. పట్టా పుస్తకం లేదు.
11. కుటుంబసభ్యుల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి
12. పట్టా పుస్తకం లేదు
13. పట్టా పుస్తకం లేనివారు, పేరులో తేడా
14. కుటుంబ సభ్యుల్లో ఒకరు సర్వీస్ పింఛన్‌దారుడైతే..
15. రేషన్‌కార్డు లేనివారు
16. రుణమంజూరు మార్గదర్శకాల్లో పేరు రాలేదు
17. రుణం రెండో దశలో చేర్చడం
18. డీబీటీ సమస్య: బ్యాంక్ ఖాతా మూసివేత
19. వేర్వేరు వ్యక్తులకు ఒకే కస్టమర్ ఐడీ, వేర్వేరు వ్యక్తులకు ఒకే ఖాతా
20. రైతు మరణం, భూమి వారసులకు చేరడం
21. వడ్డీ మొత్తం లోన్ మొత్తాన్ని మించి ఉండటం
22. వేర్వేరు రైతులు ఒకే కుటుంబంగా లెక్కించబడటం
23. పాక్షిక రుణమాఫీపై రైతు ఫిర్యాదులు
24. తప్పుడు ఖాతా నంబర్
25. ఆధార్ నంబర్, లోన్ ఖాతా పేరులో తేడా, వడ్డీ మొత్తం అసలు మొత్తాన్ని మించి ఉండటం
26. కుటుంబ గ్రూపింగ్ నిర్ణయించాల్సి ఉంది, ఒకరు ప్రభుత్వ ఉద్యోగి, పేరులో తేడా
27. 9.12.2023 నాటికి వడ్డీ మొత్తం ప్రిన్సిపల్ మొత్తాన్ని మించి ఉండటం
28. ఒకే ఖాతా నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ మంది రైతులు
29. వడ్డీ మొత్తం ప్రిన్సిపల్ మొత్తాన్ని మించి ఉండటం
30. రైతు మరణం
31. తప్పు వ్యక్తికి ఆధార్‌నంబర్ అనుసంధానం

9 నెలల్లో విద్యావ్యవస్థ ధ్వంసం

బాసర ట్రిపుల్ ఐటీ సమస్యల పరిష్కారంలో విఫలం: హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ ధ్వంసమైందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాసర ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరించడంలో సీఎం విఫలం అయ్యారని దుయ్యబట్టారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకొన్న సీఎం.. విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే గురుకుల విద్యార్థులు ఆందోళనలు చేస్తుండగా, బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సైతం ఆందోళనబాట పట్టారని పేర్కొన్నారు. 17 డిమాండ్లతో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు నాలుగు రోజులుగా నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ట్రాక్టర్‌లో వెళ్లి, కళాశాల గోడ దూకి నానా యాగీ చేసిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేశారని హరీశ్‌రావు దుయ్యబట్టారు.


ట్రిపుల్ ఐటీ సమస్యలు తీర్చింది బీఆర్‌ఎస్సే

బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించింది బీఆర్‌ఎస్ సర్కారేనని హరీశ్‌రావు చెప్పారు. నాడు మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి ట్రిపుల్ ఐటీకి వెళ్లి విద్యార్థుల సమస్యలను పరిష్కరించారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని కొనసాగించకుండా సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేశారని, ఫలితంగా సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో నాలుగు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. కొత్త వాటి ఊసు ఎత్తకపోగా ఉన్నవాటికి సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయ్యారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో ప్రాథమిక స్థాయి నుంచి ట్రిపుల్ ఐటీ వరకు సకల విద్యాలయాలు ధ్వంసమయ్యాయని, ధ్వంసం కాని విద్యాలయాలు ఇంకా ఏవైనా ఉన్నాయా? అని మండిపడ్డారు. ఇప్పటికే టీచర్లు లేక 1,800 పాఠశాలలు మూతపడ్డాయని, కల్తీ ఆహారంతో ఫుడ్ పాయిజన్ కేసులు పెరిగిపోయాయని, 600 మంది విద్యార్థులు దవాఖానల పాలు కాగా, 40 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఇప్పటికైనా బాసర ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరించడంతోపాటు విద్యాశాఖలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం వెంటనే రాష్ట్ర స్థాయి సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రైతు మరణంపైనా రాజకీయమే

మొదటిపేజీ తరువాయి...

రైతు మరణానికి కారణమైన ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసు పెట్టాలంటూ ఉల్టా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీ చామల ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. 'చనిపోయిన రైతు సురేందర్‌రెడ్డి కుటుంబంలో ఆయన తల్లికి రూ.1.5 లక్షల రుణమాఫీ జరిగింది. సురేందర్‌రెడ్డి ఆత్మహత్య విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రైతులను రెచ్చగొట్టేల వ్యవహరించిన హరీశ్‌రావుపై నేరపూరిత కుట్ర 61(2), ఆత్మహత్యకు ప్రేరేపణ సెక్షన్ 108 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి' అని ఎంపీ చామల తన లేఖలో పేర్కొన్నారు. తప్పుడు వివరాలతో, రాజకీయ దురుద్దేశంతో ఎంపీ ఈ విధంగా లేఖ రాయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది రైతు మరణాన్ని కించపరిచడమేనని, రైతు మరణాన్ని రాజకీయ చేయడం సిగ్గు చేటంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



I. రైతు వివరములు :

రైతు పేరు (శ్రీ/శ్రీమతి)	SOLIPETA SURENDER REDDY	తండ్రి/భర్త పేరు (శ్రీ/శ్రీమతి)	PRATHAP REDDY
జిల్లా	SIDDIPET	చిరునామా	PLOT NO 6 VINAYAKA NAGAR MEDCHAL KV RANGAREDDY
ఆధార్ సంఖ్య	xxxx-xxxx-2395	సెల్ నెం.	9505424998
ఫ్యామిలీ ఐడి	3711-443	కుటుంబంలో ఉన్న రుణఖాతాల సంఖ్య	2

II. కుటుంబం యొక్క రుణ వివరములు :

1	2	3	4	5	6	7	8
1	SOLIPETA SUSHILA Female	xxxx-xxxx-7747	ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK CHITTAPUR APGV0008130	73047252135 Crop Loan	103587	నిర్ధారణ చేయవలసి ఉన్నది	To be Processed
2	SOLIPETA SURENDER REDDY Male	xxxx-xxxx-2395	ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK CHITTAPUR APGV0008130	73047251936 Crop Loan	171266	నిర్ధారణ చేయవలసి ఉన్నది	To be Processed
					274853		

రైతు సురేందర్‌రెడ్డి, ఆయన తల్లి సుశీలకు రుణమాఫీ కాలేదని, ప్రాసెస్‌లో ఉన్నదంటూ అధికారులు విడుదల చేసిన స్టేట్‌మెంట్

రైతు తల్లి సుశీలకు పైసా మాఫీ కాలేదు

సుశీలకు ఇప్పటివరకు నయా పైసా కూడా రుణమాఫీ కాలేదని చిట్టాపూర్ ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు, సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి నిర్ధారించడంతో ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి చెప్పినదంతా అబద్ధమని తేలిపోయింది. ఆ రైతు తల్లి పేరు సోలిపేట సుశీల. ఆమెకు చిట్టాపూర్ ఏపీజీవీబీ బ్యాంకులో రుణ ఖాతా నంబర్ 73047252135పై రూ.1,03,587 పంట రుణం ఉన్నది. ఆమెకు సంబంధించిన రుణమాఫీ స్టేట్‌మెంట్‌ను అధికారులు విడుదల చేశారు. ఇందులో రుణమాఫీ కాకపోవడానికి కారణంపై 'నిర్ధారణ చేయవలసి ఉన్నది', 'To be Processed' అని చూపిస్తున్నది. సురేందర్ రెడ్డి తల్లికి రుణమాఫీ కాలేదని అధికారులే స్వయంగా చెప్పడంతో దీనిపై ఎంపీ చామల ఏం సమాధానం చెబుతారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. కనీస వివరాలు తెలుసుకోకుండా రైతు మరణాన్ని కించపరిచారంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఎంపీగా ఉంటూ ఇంత అజ్ఞానమా?

ఎంపీగా ఉంటూ కనీస అవగాహన లేకుండా, నిజానిజాలు తెలుసుకోకుండా కిరణ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారంటూ రైతులు మండిపడుతున్నారు. ఎంపీగా ఉన్న వ్యక్తి రైతు ఆత్మహత్యకు సంబంధించి కలెక్టర్‌కు లేఖ రాస్తున్నప్పుడు కనీస వివరాలు, నిజాలు తెలుసుకోవాలి. కానీ, ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి మాత్రం వాటన్నింటినీ పక్కన పెట్టి, పూర్తి అబద్ధాలతో లేఖ రాయడంపై విమర్శలొస్తున్నాయి. ఆయన లేఖ రాసే ముందు ఏ అధికారికి ఫోన్ చేసినా నిజాలు చెప్పేవారని, కానీ ఆయన నిజాలను దాచిపెట్టి అబద్ధాలను ప్రచారం చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారనే విమర్శలున్నాయి. ఇలాంటి వ్యక్తి ఎంపీగా ఉండేందుకు అనర్హుడంటూ రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఒక ఎంపీగా రైతు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయకుండా రైతులపైనే నిందలు వేసే విధంగా పూనుకోవడం విచారకరమని మండిపడుతున్నారు.

అసలేం జరిగింది?

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఈ నెల 6న రైతు సోలిపేట సురేందర్‌రెడ్డి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. రుణమాఫీ కాకపోవడమే తన చావుకు కారణమని లేఖ రాశారు. దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన సురేందర్ రెడ్డి పదేండ్ల క్రితం బతుకుదెరువు కోసం మేడ్చల్ జిల్లాకు వలస వచ్చారు. తన సొంత గ్రామంలో ఆయనకు వ్యవసాయ భూమి ఉన్నది. ఆయనకు అన్న రవీందర్ రెడ్డి, తల్లి సుశీల ఉన్నారు. వివాహ అనంతరం తర్వాత అన్న రవీందర్ రెడ్డి వేరుపడగా ఆయనకు విడిగా రేషన్‌కార్డు వచ్చింది. దీంతో సురేందర్ రెడ్డి, ఆయన తల్లి సుశీల ఒకే రేషన్‌కార్డుపై కొనసాగుతున్నారు. సురేందర్ రెడ్డి తన పేరిట ఉన్న నాలుగు ఎకరాల భూమితో చిట్టాపూర్ ఏపీజీవీబీ బ్యాంకులో రూ.1.92 లక్షల రుణం పొందారు. ఆయన తల్లి సుశీల పేరుపై రూ.1.03 లక్షల రుణం ఉన్నది. రవీందర్‌రెడ్డి పేరుపై రూ.1.57 లక్షల రుణం ఉన్నది. రేషన్‌కార్డు వేరుగా ఉన్న కారణంగా రవీందర్‌రెడ్డి రుణం మాఫీ కాగా సురేందర్‌రెడ్డి, తల్లి సుశీల రుణం మాఫీ కాలేదు. దీనిపై అధికారులను ఆరా తీయగా సురేందర్‌రెడ్డి, తల్లి సుశీల ఒకే రేషన్‌కార్డుపై ఉండటం వల్ల రుణమాఫీ కాలేదని తెలిపారు. దీంతో తనకు రుణమాఫీ కాదంటూ మనస్తాపానికి గురైన సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకొన్నారు.

రైతు ప్రాణం తీసిన రేషన్‌కార్డు నిబంధన

రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన రైతు సురేందర్‌రెడ్డి ప్రాణం తీసింది. రేషన్‌కార్డులో ఆయనతోపాటు ఆయన తల్లి పేరు ఉన్నందున రుణమాఫీ కాలేదని బ్యాంకు అధికారులే తెలిపారు. ఒకే రేషన్‌కార్డులో ఇద్దరి పేర్లు ఉండటం, ఇద్దరి పేర్లపై రూ.2 లక్షలకుపైగా రుణం ఉండటంతో వారికి మాఫీ కాలేదు. ఆయన అన్న రవీందర్‌రెడ్డికి రేషన్‌కార్డుపై ఆయన పేరు మాత్రమే ఉండటంతో రూ.1.57 లక్షలు మాఫీ అయ్యాయి. అంటే ప్రభుత్వం పెట్టిన రేషన్‌కార్డు నిబంధన కారణంగానే తనకు రుణమాఫీ కాలేదని రైతు సురేందర్‌రెడ్డికి అర్థమైంది. ఇక తనకు రుణమాఫీ కాదని ఆయన భావించారు. అందుకే చిట్టాపూర్ నుంచి ఆవేదనతో మేడ్చల్‌లోని తన ఇంటికి వచ్చిన ఆయన స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయానికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. కానీ, ప్రభుత్వం మాత్రం రైతు ఆవేదనను పట్టించుకోకుండా ఆయన మరణాన్ని కూడా రాజకీయం చేసే దురాలోచనలో ఉండటంపై విమర్శలొస్తున్నాయి.

సీఎం, మంత్రుల మధ్య సమన్వయం లేదు

- అర్థం లేకుండా కాంగ్రెస్ పాలన
- రైతులను గందరగోళంలోకి నెడుతున్న ప్రభుత్వం
- వరదసాయంపై ఉలుకూపలుకు లేదు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలన ఏ మాత్రం అర్థంపర్థం లేకుండా సాగిందని, ముఖ్యమంత్రి,మంత్రుల మధ్య సమన్వయంలేదని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ చేయలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ అని, గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రైతు బంధుకే దిక్కు లేదని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చక, వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.49 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి రూ. 31 వేల కోట్లకు కుదించి చివరకు బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించి రూ.18 వేల కోట్లు విడుదల చేసి రైతులకు రూ.10 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసిందని ఫైర్ అయ్యారు.



ముఖ్యమంత్రి, మంత్రుల చెబుతున్న మాటలకు పొంతన లేదని, రెండు లక్షల పైన రుణం ఉంటే బ్యాంకులో కట్టాలని చెబితే రైతులు అప్పు చేసి బ్యాంకుల్లో ఇప్పటికే జమ చేశారని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రి రూ.2 లక్షల పైన రుణం కట్టవద్దని అనడం తప్పించుకునే ప్రయత్నమని దుయ్యబట్టారు. రెండు లక్షలకు పైన రుణం కడితేనే మాఫీ వర్తిస్తుందని బ్యాంకర్లు రైతులను ఇబ్బందులు పెట్టి కట్టించుకున్నారని చెప్పారు. ఇప్పటికైనా రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని, ఎగ్గొట్టే ఆలోచన ఉంటే అదైనా చెప్పాలని డిమాండ్ చేశారు. వానకాలం పెట్టుబడికి రైతులు అప్పు చేసి పెట్టుబడి పెట్టారని పంట చేతికి వచ్చే సమయం ఆసన్నమైనా నేటికి రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. సూర్యాపేట, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, ములుగు, ఆదిలాబాద్ ప్రాంతాల్లో రైతులు పంట నష్టపోయారని వారికి వెంటనే రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



హైడ్రా పేరిట సీఎం రేవంత్ డ్రామా

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరిట సీఎం రేవంత్ డ్రామా చేస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆదివారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే.. అందరి దృష్టిని మళ్లించేందుకు సీఎం రేవంత్ హైడ్రా పేరిట ఇండ్ల కూల్చివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చి కూల్చివేయాలే తప్ప, ఇష్టారాజ్యంగా నోటీసులు లేకుండానే కూల్చివేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 70 ఏండ్లు పాలన చేసి, చెరువులను సర్వనాశనం చేసిన చరిత్ర, ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకే దక్కుతుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ గత పాలకుల వల్లే చెరువులు కబ్జా అయ్యాయని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కట్టడాలు వెలిశాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక, కేసీఆర్ పుణ్యమా అని చెరువులు తిరిగి బతికినట్టు తెలిపారు. బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలన్నీ కాంగ్రెస్, టీడీపీ పాపమేనని విమర్శించారు. ఇప్పుడు హఠాత్తుగా ఇండ్లను కూల్చివేయడం సరికాదన్నారు.



బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, నాయకుడు కార్తీక్‌రెడ్డి

ప్రజల దృష్టిని మళ్లించేందుకే 'హైడ్రా'మా!

- అన్నిరంగాల్లో విఫలమైన కాంగ్రెస్ సర్కారు
- కేసీఆర్ ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- రాజేంద్రనగర్‌లో బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం: కార్తీక్‌రెడ్డి

మణికొండ, సెప్టెంబర్ 08: ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరిట డ్రామా నడుపుతుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. గండిపేట మండలం అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో జరిగింది. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. అభివృద్ధి చేయడం చేతకాక, నాటి సంక్షేమ పథకాలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం హైడ్రా పేరుతో ఒక కొత్త స్టంట్ మొదలుపెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సాధ్యంకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ప్రభుత్వాన్ని నడపడంలో అన్నిరంగాల్లో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఆశలు సన్నగిల్లాయని తెలిపారు. గడిచిన పదేండ్లలో బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు పెట్టుబడుల పెట్టేందుకు క్యూ కట్టారని తెలిపారు. ఇప్పుడు అన్ని రంగాల్లో కుదేలైన తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తాడని ప్రజలంతా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని తెలిపారు.

హైడ్రా 10 శాతం చేసినా గొప్పే!

ఎఫ్టీఎల్ పేరుతో 30 వేల ఎకరాల చెరువులు ఆక్రమణకు గురయ్యాయని చెప్తున్న ప్రభుత్వం.. వాటిల్లో 10 శాతం అయినా స్వాధీనం చేసుకుంటే గొప్పేనని బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి చెప్పారు. అప్పుడే తాము హైడ్రా పనితీరు గురించి మాట్లాడుతామని తెలిపారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పారు. దీనికోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.



హైడ్రా పేరుతో హైడ్రామా!

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో రాష్ట్రంలో హైడ్రామా నడుస్తున్నదని, పేదల ఇండ్లను కూలుస్తూ వారికి నిలువ నీడ లేకుండా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ధ్వజమెత్తారు. హైడ్రా చర్యలతో పేదలెందరో ఆందోళన చెందుతున్నారని, వారిపై కక్షగట్టినట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తూ ఖమ్మం ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. అందుకే ఖమ్మంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మున్నారు వరద బాధితులు అడ్డుకున్నారని తెలిపారు. వర్షాలపై వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదని తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఖమ్మంలో పర్యటిస్తే కాంగ్రెస్ దాడులకు పాల్పడిందని తెలిపారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని, వరద బాధితులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంటలు ఏ మేరకు నష్టపోయాయో అంచనా వేసి, రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు.